


www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

అనుక్షణం

# నవభూమి

ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక

Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్
Navabhoomi daily fallows..

హైదరాబాద్ | 07 మంగళవారం జనవరి 2025 | పేజీలు 8-12 | వెల: రూ.6 | సంపుటి:3 సంచిక: 112




# పేలిన మందుపాతర

- వ్యాన్ డ్రైవర్‌తో సహా 9 మంది దుర్మరణం
- రెచ్చిపోయిన మావోయిస్టులు..
- 8 మంది జవాన్లకు తీవ్రగాయాలు
- బెద్రే - కుత్రు రహదారిపై దుర్ఘటన

2



**రాయ్‌పూర్-నవభూమిబ్యూరో:** ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు మరో సారి రెచ్చిపోయారు. బీజాపూర్ జిల్లాలో భద్రతా దళాలే లక్ష్యం చేసుకుని మందు పాతర పేల్చారు. ఈ ఘటనలో 9 మంది మరణించారు. 8 మంది జవాన్లు కాగా.. ఒకరు వ్యాన్ డ్రైవర్ అని భద్రతా దళాలు తెలిపాయి. ఈ ఘటనలో మరో 8 మంది జవాన్లు గాయపడ్డారు. వారిని రాజధాని రాయ్‌పూర్‌లోని ఆసుపత్రికి హుటాహుటిన తరలించారు. వారిలో పలువురి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు సమచారం. ఈ సంఘటన సోమవారం బెద్రే - కుత్రు రహదారిపై చోటు చేసుకుంది. మరోవైపు శనివారం ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణ్ పూర్, దంతెవాడ జిల్లా సరిహద్దుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్టుల సంఖ్య ఐదుకి పెరిగింది.

మావోయిస్టుల కోసం ప్రత్యేక భద్రత దళంతోపాటు పోలీసులు సంయుక్తంగా నారాయణ్ పూర్, దంతెవాడ జిల్లాల సరిహద్దుల్లో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ విషయాన్ని మావోయిస్టులు గమనించి.. కాల్పులకు తెగబడ్డారు. దీంతో భద్రతా దళాలు సైతం వెంటనే స్పందించి.. ఎదురు కాల్పులకు

## 2026 మార్చి నాటికి దేశంలో నక్సల్స్ కథ ముగిస్తాం

### కేంద్ర హెూం మంత్రి అమిత్ షా



**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో:** ఛత్తీస్ గఢ్‌లో మావోయిస్టు లు పంజా విసిరిన ఘటనలో 9 మంది జవాన్లు మృతి చెందిన విషయం తెలిసిందే. దీనిపై కేంద్ర హెూం మంత్రి అమిత్ షా తీవ్రస్థాయిలో స్పందించారు. వచ్చే ఏడాది కల్లా దేశంలో మావోయిస్టులు ఎవరూ ఉండరని స్పష్టం చేశారు. దేశంలో 2026 మార్చి నాటికి నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలిస్తామని చెప్పారు. నక్సల్స్ దాడిలో జవాన్ల మృతి పట్ల అమిత్ 2లో

# త్వరలో బుల్లెట్ ట్రైన్ పరుగులు



- ఈ ప్రాజెక్టులు నూతన శకానికి నాంది: ప్రధాని మోదీ
- 50 రూట్లలో దిగ్విజయంగా 136 వందేమాతరం రైళ్లు
- బీజేపీ హయాంలోనే భారత రైల్వే శాఖ అభివృద్ధి: ప్రధాని మోడీ
- చర్లపల్లి టెర్మినల్తో పాటు పలు రైల్వే ప్రాజెక్టులు వర్చువల్‌గా ప్రారంభం

2

**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** దేశంలో త్వరలో బుల్లెట్ ట్రైన్ అందుబాటులోకి వస్తుందని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. తెలంగాణలోని చర్లపల్లి రైల్వే టెర్మినల్ను సోమవారం వర్చువల్గా ప్రారంభించారు. జమ్మూ రైల్వే డివిజన్ సేవలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో పాటు.. ఒడిశాలో రాయగడ రైల్వే డివిజన్ బిల్డింగ్ను వర్చువల్గానే శంకు స్థాపన చేశారు. అనంతరం మాట్లాడిన ఆయన... ప్రస్తుతం దేశంలో 50. రూట్లలో 136 వందే భారత్ ట్రైన్లు సేవలు అందిస్తున్నా యని తెలిపారు. మరిన్ని అందుబా టులోకి వస్తాయన్నారు. వందే భారత్ స్లీపర్ ట్రైన్ ట్రయల్ రన్ లో 180 కిలోమీటర్ల వేగం అందుకున్నదని వివరించారు. బీజేపీ హయాంలోనే భారత రైల్వే కొత్త పుంతలు తొక్కుతోందని ప్రధాని పేర్కొన్నారు.దేశంలోనే అద్భుతమైన చర్లపల్లి రైల్వే టెర్మినల్ ప్రారంభించిన ప్రధాని మోదీ!

దక్షిణ మధ్య రైల్వే చరిత్రలో చర్లపల్లి రైల్వే టెర్మినల్ ప్రారంభోత్సవంతో మరొక మైలురాయి పడింది. చర్లపల్లి రైల్వే టెర్మినల్‌ను భారత ప్రధాని నరేంద్ర మోదీ నేడు వర్చువల్ విధానంలో ప్రారంభించారు. కేంద్ర మంత్రులు అశ్విని వైష్ణవ్, కిషన్‌రెడ్డిలు చర్లపల్లి టెర్మినల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో నేరుగా పాల్గొన్నారు. నేడు చర్లపల్లి రైల్వే టెర్మినల్ ప్రారంభోత్సవం కావడంతో నేటి నుంచి ఈ రైల్వే టెర్మినల్‌లో సేవలు అందుబాటులోకి రాబోతున్నాయి. నేటి నుండి చర్లపల్లి రైల్వే టెర్మినల్ సేవలు ప్రారంభం అత్యాధునిక సౌకర్యాలతో విమానాశ్రయం తరహాలో 413కోట్ల

# రూ.12లక్షల కోట్లు ఆవిరి

- దలాల్ స్ట్రీట్‌కు వైరస్ కుదుపు..ఒక్కరోజులోనే భారీ నష్టం
- దేశంలో 3 కేసులు నమోదయ్యాయనే వార్తలో అమాంతంగా పడిపోయిన సూచీలు
- నష్టపోయిన టాటా స్టీల్, ఎన్టీపీసీ, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఇండస్ ఇండ్ బ్యాంక్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ షేర్లు

2




**ముంబై-నవభూమిబ్యూరో:** దలాల్ స్ట్రీట్‌కు వైరస్ కుదుపు ఒక్కరోజులోనే రూ.12 లక్షల కోట్లు ఆవిరి ఉదయం మార్కెట్ ప్రారంభమైన కొద్దిసేపటి వరకు లాభనష్టాలతో కొనసాగిన సూచీలు దేశంలో మూడు కేసులు నమోదయ్యాయనే వార్తలో అమాంతంగా పడిపోయాయి.

చైనా వైరస్ దెబ్బ స్టాక్ మార్కెట్లను వణికించింది. దేశంలోనూ మూడు కేసులు నమోదయ్యాయనే సమాచారంతో బడాబడా కంపెనీల షేర్లు కూడా కుప్పకూలాయి. దీంతో సోమవారం మార్కెట్ ప్రారంభమైన కొద్ది సేపటికే సూచీలు భారీగా పడిపోయాయి. ఫలితంగా మదుపర్లు ఒక్క రోజులోనూ రూ.12 లక్షల కోట్లు కోల్పోవాల్సివచ్చింది. చైనా వైరస్ హెచ్‌ఎంపీవీ గుబులుతో దలాల్ మార్కెట్ సోమవారం భారీగా పతనమైంది. ఉదయం మార్కెట్ ప్రారంభమైన కొద్దిసేపటి వరకు లాభనష్టాలతో కొనసాగిన సూచీలు దేశంలో 3 కేసులు నమోదయ్యాయనే వార్తలో అమాంతంగా పడిపోయాయి. మరోవైపు ఆసియా మార్కెట్ల నుంచి బలహీన సంకేతాలు, విదేశీ మదుపర్ల అమ్మకాల ఒత్తిడితో మొత్తం మార్కెట్ విలువ రూ.12 లక్షల కోట్ల మేర క్షీణించింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 1400 పాయింట్ల మేర పతనం అవ్వగా, నిఫ్టీ 23,550 పాయింట్ల స్థాయికి చేరింది. ఉదయం సెన్సెక్స్ 79,281.65 పాయింట్ల వద్ద ఫ్లాట్‌గా ప్రారంభమైంది. ఆ వెంటనే బెంగళూరులో రెండు, గుజరాత్ లో ఒకటి చొప్పున వైరస్ కేసులు నమోదయ్యాయని తెలియగానే సూచీల పతనం మొదలైంది. క్షణాల్లోనే భారీ నష్టాల్లోకి జారుకున్న షేర్లు మదుపర్లను ముంచేశాయి. ఇంట్రాడేలో 77,781.62 పాయింట్ల కనిష్ఠాన్ని తాకిన సూచి, చివరికి 1258.12 పాయింట్ల నష్టంతో 77,964.99 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 388.70 పాయింట్లు నష్టపోయి 23,616.05 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం మరో మూడు పైసలు క్షీణించింది. సెన్సెక్స్ 30 సూచీలో టైటాన్, సన్ ఫార్మా షేర్లు మినహా మిగిలిన అన్ని కంపెనీలు నష్టపోయాయి. టాటా స్టీల్, ఎన్టీపీసీ, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఇండస్ ఇండ్ బ్యాంక్,

# భారత్‌లో వైరస్ ఎంటర్!

- ఇండియాలో ఎంటరైన చైనా వైరస్..
- గుజరాత్‌లో ఒకటి..బెంగుళూరులో 2 కేసులు
- హెచ్‌ఎంపీసీ వైరస్ పాతదే..భయపడాల్సిందేమీ లేదు
- కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా వెల్లడి






2

**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో:** ప్రస్తుతం చైనాని వణికిస్తున్న హెచ్ఎం పివి వైరస్ భారత దేశానికి కూడా చేరుకుంది. మన దేశంలో బెంగళూరులో ఇద్దరు చిన్నారులకు ఈ వైరస్ లక్షణాలను గుర్తించారు. వారి నుంచి సేకరించిన రక్తం శాంపిల్స్ ను ప్రైవేటు ల్యాబ్‌లకు పంపించిన డాక్టర్లు వీరికి హెచ్ఎం పివి సోకినట్టుగా గుర్తించారు. దీంతో ఐసిఎంఆర్‌కు సమాచారం ఇచ్చి వీరిని క్వారంటైన్‌లో ఉంచారు. హెచ్‌ఎంపీవీ వైరస్‌పై కొత్త ఆందోళన ప్రస్తుతం భారత దేశంలో నమోదైన రెండు చైనా వైరస్ కేసులు కూడా బెంగళూరులోనే నమోదు కావడంతో కర్ణాటక ప్రభుత్వం కూడా అప్రమత్తం అయ్యింది. అయితే హెచ్ ఎం పి వి వైరస్ భారతదేశంలోకి ప్రవేశించడంతో ఇప్పుడు ప్రజల్లో కొత్త ఆందోళన మొదలైంది. ముఖ్యంగా శ్వాసకోశానికి సంబంధించిన సమస్యలను కలిగించే ఈ వైరస్ ను తట్టుకోవడం, దానిని ఎదుర్కొని నిలబడడం సాధ్యమవుతుందా అన్నది ప్రస్తుతం ప్రతి ఒక్కరిలోనూ ఉత్పన్నమ వుతున్న ప్రశ్న. కరోనా ఇచ్చిన రోగాలతో పోరాటం చేస్తున్న ప్రజలు ఇప్పటికే కరోనా మహమ్మారితో పోరాడి ప్రస్తుతం కూడా పోస్ట్ కోవిడ్ సమస్యలతో పోరాటం సాగిస్తూనే ఉన్న ప్రజల వ్యాధి నిరోధక శక్తి గణనీయంగా తగ్గిపోయింది. కరోనా మహమ్మారి వ్యాప్తికి ముందు ఉన్న శారీరక బలం ప్రస్తుతం సగానికి పైగా మందిలో లేకుండా పోయింది. కరోనా మహమ్మారిని ఎదుర్కోవడానికి తీసుకున్న రెమిడిసవీర్ ఇంజక్షన్లు, వ్యాక్సిన్లు కూడా సైడ్ ఎఫెక్ట్స్ ఇవ్వడంతో నేటికీ దేశవ్యాప్తంగా ప్రజలు అనేక రకాల అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ప్రజలలో గణనీయంగా తగ్గిన ఇమ్యూనిటీ.. ఈ వైరస్ వస్తే ఎలా ? ఇక ఇప్పటికే కరోనా మహమ్మారి ఇచ్చిన

# కేటీఆర్‌కు మళ్లీ ఏసీబీ నోటీసులు

- 9న విచారణకు హాజరుకావాలని కేటీఆర్‌కు ఎసీబీ అధికారులు నోటీసులు
- గచ్చిబౌలిలోని ఓరియన్ విల్లాకు వెళ్లి నోటీసులు అందించిన అధికారులు
- 6న విచారణకు వచ్చిన కేటీఆర్,న్యాయవాదికి అనుమతి ఇవ్వకపోవడంతో వెనుదిరిగిన వైనం..దాంతో మళ్లీ నోటీసులు

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** ఫార్ములా ఈ రేస్ వ్యవహారంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఏసీబీ అధికారులు మరోసారి నోటీసులు ఇచ్చారు. జనవరి 9వ తేదీన విచారణకు హాజరుకావాలని ఆ నోటీసుల్లో ఏసీబీ అధికారులు స్పష్టం చేశారు. గచ్చి బౌలిలోని ఓరియన్ విల్లాకు వెళ్లిన ఇద్దరు ఏసీబీ అధికారులు.. కేటీఆర్‌కు నోటీసులు అందజేశారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన ఫార్ములా ఈ కారు రేసు వ్యవహారంలో నిబంధనలకు విరుద్ధంగా ఈఎఫ్ఓకు నిధులు బదలాయింపు.. అగ్రిమెంట్‌కు ముందే నిధులు చెల్లింపు వల్ల ప్రభుత్వ ఖజానాకు తీవ్ర నష్టం వాటిల్లిందని రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆరోపించింది. అందుకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. దీనిపై విచారణ చేపట్టాలని ఏసీబీని ప్రభుత్వం ఆదేశించింది.

ఈ కేసులో ఏ1గా కేటీఆర్, ఏ2గా ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్, ఏ3గా హెచ్‌ఎండీఏ రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డి పేర్లను ఏసీబీ చేర్చింది. మరోవైపు ఏసీబీ కేసు ఆధారంగా ఎన్ ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కేసు నమోదు చేసింది. అయితే ఈ కేసులో విచారణలో భాగంగా జనవరి 6 వ తేదీ హాజరుకావాలని కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు జారీ చేసింది.

ఈ విచారణకు హాజరయ్యేందుకు కేటీఆర్.. తన న్యాయవాదితో కలిసి ఏసీబీ కార్యాలయానికి వెళ్లారు. అయితే ఈ విచారణలో పాల్గొనేందుకు న్యాయవాదికి అనుమతి లేదనడంతో.. కేటీఆర్ ఏసీబీ కార్యాలయం నుంచి వెనుతిరిగారు. ఈ నేపథ్యంలో ఈ కేసు విచారణకు హాజరుకావా లంటూ సోమవారం ఏసీబీ అధికారులు కేటీఆర్ నివాసానికి వెళ్లి నోటీసులు అందజేసి వచ్చారు.

ఇంకోవైపు ఇదే కేసులో జనవరి 7వ తేదీన ఈడీ విచారణకు కేటీఆర్ హాజరు కావాల్సి ఉండగా.. జనవరి 8,9 తేదీల్లో ఈడీ ఎదుట బీఎల్ఎన్ రెడ్డి, అరవింద్ కుమార్ విచారణకు హాజరు కావాల్సి ఉంది. ఈ మేరకు వారికి

# ఏపీలో ఆరోగ్య శ్రీ సేవలు బంద్

- చంద్రబాబు సర్కార్‌కు బిగ్ షాక్
- ఈహెచ్ఎస్,ఓపీ సేవలు మాత్రమే బంద్
- సర్కార్ నుంచి రూ.3 వేల కోట్ల రావాల్సి ఉంది
- ఏపీ సర్కార్‌తో చర్చలు సఫలం కాకపోతే
- 26 నుంచి అత్యవసర సేవలు కూడా బంద్
- ఏపీ నెట్‌వర్క్ ఆస్పత్రుల అసోసియేషన్ అధ్యక్షుడు కె.విజయ్‌కుమార్ హెచ్చరిక




**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** చంద్రబాబు సర్కార్‌కు బిగ్ షాక్ తగిలింది. ఏపీలో ఆరోగ్య సేవలు ఆగిపోయాయి. సోమవారం నుంచి ఆరోగ్య శ్రీ సేవలు నిలిపివేస్తున్నట్లు ఆస్పత్రుల అసోసియేషన్ ప్రకటించింది. ఇప్పటి నుంచి ఈహెచ్ఎస్,ఓపీ సేవలను మాత్రమే బంద్ చేస్తున్నట్లు తెలిపింది.ఏపీ నెట్‌వర్క్ ఆస్పత్రుల అసోసియేషన్ అధ్యక్షుడు కె.విజయ్‌కుమార్ దీనిపై మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.3 వేల కోట్ల రావాల్సి ఉందని తెలిపారు. ఆస్పత్రుల ఆర్థిక పరిస్థితి బాగోలేదని, ఇక మీదట ఉచిత వైద్య సేవలు అందజేయలేమని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే ఆరోగ్య శ్రీ సేవ వైద్య సేవలు నిలిపివేస్తున్నట్టు ప్రభుత్వానికి నోటీసులు ఇచ్చామని ఆయన తెలిపారు. దీనిపై ఇప్పటికే ప్రభుత్వానికి నోటీసులు ఇచ్చామని, తమ నోటీసులపై ట్రస్ట్ సీఈఓ స్పందించారని విజయ్‌కుమార్ చెప్పుకొ చ్చారు.ట్రస్ట్ సీఈఓ ఫోన్ చేసి బకాయిలు క్లియర్ చేస్తామని చెప్పారని.. ఈ క్రమంలో రేపు చర్చకు ఆహ్వానించినట్లు ఆయన చెప్పారు. ఈ తరుణంలో ఏపీ ప్రభుత్వంతో చర్చలు సఫలం కాకపోతే ఈ నెల 26 నుంచి అత్యవసర సేవలు కూడా నిలిపివేస్తామని ప్రభుత్వాన్ని విజయ్‌కుమార్ హెచ్చరించారు. రూ.3 వేల కోట్ల బకాయిలు చెల్లించాలని యాజమాన్యాలు డిమాండ్ చేస్తున్నాయి. "చంద్రబాబు, పవన్ సంతకాలకూ విలువ లేదా ? ముందు వాటిని సీజ్ చేయండి.." ఇక ఉద్యోగులు సైతం కూటమి ప్రభుత్వంలో అసంతృప్తితో ఉన్నారని తెలుస్తోంది.

గత వైసీపీ ప్రభుత్వంలో జీతాలు ఎప్పుడు వచ్చేవో తెలిసేది కాదు. దీంతో ప్రభుత్వ ఉద్యోగులు మొత్తం కూడా కూటమికి మద్దతుగా నిలిచారు. అటు కూటమి ప్రభుత్వం సైతం ఉద్యోగులకు మొదట్లో మొదటి తేదీనే జీతాలు అందించింది. తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. కొంతమంది ఉద్యోగులకు 5 తారీఖు వచ్చినా జీతాలు అందడం లేదు. దీంతో ఉద్యోగుల్లో కొంత అసంతృప్తి నెలకొంది.

## ఎముకలు విరిచి, గుండె బయటికి తీసి

# జర్నలిస్ట్ దారుణ హత్య

- బీజపూర్ జిల్లాకు చెందిన జర్నలిస్ట్ ముకేష్ చంద్రశేఖర్ దారుణ హత్య
- ప్రధాన నిందితుడైన కాంట్రాక్టర్ సురేశ్ చంద్రశేఖర్‌ను హైదరాబాద్‌లో అరెస్ట్
- ఓ రోడ్డు నిర్మాణ పనికి సంబంధించిన వార్తల ప్రచురణే ఈ హత్యకు కారణంగా పోలీసుల అనుమానం

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** ఛత్తీస్ ఘడ్‌లోని బీజపూర్ జిల్లాకు చెందిన జర్నలిస్ట్ ముకేష్ చంద్రశేఖర్ హత్య రాష్ట్రంలో తీవ్ర కలకలం రేపింది. ముకేష్ ను నిందితుడు అత్యంత దారుణంగా హతమార్చారని అతని శవపరీక్ష నివేదిక వెల్లడించింది. ఈ నేపథ్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందం సిట్ ఈ కేసులో ప్రధాన నిందితుడిగా గుర్తించిన సురేశ్ చంద్రశేఖర్‌ను హైదరాబాద్ లో అదుపులోకి తీసుకుంది. మరోవైపు అటాప్సీ నివేదికలో వెలుగుచూసిన అంశాలు చూస్తే ఈ హత్య

## పెళ్లికి అంగీకరించని పెద్దలు

# ప్రేమ జంట ఆత్మహత్య

- కారులోనే పెట్రోల్‌తో నిప్పంటించుకొని సజీవ దహనం
- ఘటనకు ముందు తల్లితండ్రులకు ఫోన్ చేసి చెప్పినట్లు సమాచారం



**ఘట్కేసర్-నవభూమి:** మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో కారులో ఇద్దరు సజీవదహనం కేసు అనూహ్య మలుపు తిరిగింది. తొలుత ఘనపూర్ సర్వీసు రోడ్డులో వెళ్తున్న కారులో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగడంతోనే ఇద్దరు మృతి చెందారని పోలీసులు భావించారు. కానీ, వీరిద్దరూ ప్రేమ జంట అని, ఆత్మహత్యకు పాల్పడినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. సోమవారం సాయంత్రం జరిగిన ఈ ఘటనలో మృతులను శ్రీరామ్, లిఖితగా గుర్తించారు. కారులోపలే ఉండి పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నట్లు తెలుస్తోంది..ఇరుకుటుంబాల పెద్దలు పెళ్లికి అంగీకరించలేదనే ప్రేమజంట ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు చెబుతున్నారు. ఆత్మహత్య చేసుకునే ముందు వాళ్ళు వారి తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెప్పినట్లు సమాచారం. ఘటనాస్థలిలో 3 పేజీల లేఖను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శ్రీరామ్ స్వస్థలం యాదాద్రి జిల్లా బీబీనగర్ మండలం జమ్ములపేట కాగా, యువతి మేడ్చల్ జిల్లా నారపల్లికి చెందిన చెందినవారిగా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
2 | హైదరాబాద్ | మంగళవారం | 07 । జనవరి । 2025

# ప్రియాంకా గాంధీపై అనుచిత వ్యాఖ్యలు.. మంత్రి సీతక్క ఏమన్నారంటే..



**ఆదిలాబాద్:నవభూమి:** కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ ప్రియాంక గాంధీపై బీజేపీ నేత రమేష్ బిధూరి చేసిన అనుచిత వ్యాఖ్యల పట్ల మంత్రి సీతక్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రియాంకా గాంధీ మీద చేసిన వ్యాఖ్యలను ఖండించారు. సోమవారం ఆదిలాబాద్‌లో మంత్రి సీతక్క పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ... రమేష్ బిధూరి వ్యాఖ్యలు యావత్ మహిళా లోకానికే అవమానకరంగా ఉన్నాయని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రమేష్ బిధూరి వ్యాఖ్యలను అన్ని పార్టీల నేతలు ఖండించాలని అన్నారు. ఆయన బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రియాంక గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బిధూరిని బీజేపీ సస్పెండ్ చేయాలని కోరారు. ఇలాంటి వాళ్లకు టికెట్లు ఇస్తే మహిళలు స్వేచ్ఛగా, నిర్భయంగా తిరగగలరా? అని మంత్రి సీతక్క ప్రశ్నించారు.మహిళా వ్యతిరేకతను బీజేపీ అనువణువునా నింపుకుందని.. అందుకే రమేష్ బిధూరిని కమలం పార్టీ వెనకేసుకొస్తుందని అన్నారు. ఒక మహిళ శరీరాన్ని రోడ్లతో పోల్చి తన దుర్బుద్ధిని, పురుష దురంకారాన్ని బీజేపీ బయటపెట్టుకుందని ధ్వజమెత్తారు. తన వికృత చేష్టలతో ఆడవాళ్లను కాషాయం పార్టీ అవమాన పరుస్తోందని మండిపడ్డారు. బీజేపీకి మహిళలు బుద్ధి చెప్పడం ఖాయమని హెచ్చరించారు. మనుధర్మ శాస్త్రాన్ని అవలంభించడమే బీజేపీ మూల సిద్ధాంతమని విమర్శించారు. మనుధర్మ శాస్త్రంలో మహిళలను గౌరవించిన చరిత్ర లేదని అన్నారు. మహిళలను గౌరవించడం బీజేపీకి అసలు తెలియదని మంత్రి సీతక్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.





## వికారాబాద్ జిల్లాలో దారుణం.. ఏం జరిగిందంటే..



**వికారాబాద్ నవభూమి:** వైద్యుల నిర్లక్ష్యంతో నవజాత శిశువు మృతిచెందింది. ఈ సంఘటన వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో జరిగింది. డిప్యూటీ డాక్టర్ అశోక్ కుమార్ నిర్లక్ష్యంతో నవజాత శిశువు మృతిచెందిందని బంధువులు ఆరోపిస్తున్నారు. ఆస్పత్రి ముందు బంధువులు ఆందోళన వ్యక్తం చేశారు. డాక్టర్ అశోక్ కుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని బంధువులు డిమాండ్ చేశారు. బంధువులు ఆందోళనకు దిగడంతో ఆస్పత్రి వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బంధువులకు నచ్చజెప్పడానికి పోలీసులు ప్రయత్నిస్తున్నారు. నవజాత శిశువు మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని కుటుంబీకులు ఆరోపిస్తున్నారు నవాబ్‌పేట మండలం మాదిరెడ్డిపల్లికి చెందిన భిక్షపతి -స్వప్నల మొదటి సంతానం మగబిడ్డ మృతిచెందింది. రెండు రోజుల క్రితం ఆస్పత్రిలో ప్రసవం జరగ్గా శిశువు ఆరోగ్యంగా ఉంది. కానీ నిన్న(ఆదివారం) రాత్రి ఎక్కిళ్లు వచ్చాయి. కానీ ఆస్పత్రి రూంలో నుంచి డిప్యూటీ డాక్టర్ అశోక్ కుమార్ బయటకు రాలేదు. ఎంత పిలిచినా డాక్టర్ బయటకు రాకపోవడంతోనే మా బిడ్డ మృతిచెందాడని తల్లి దండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి ఎక్కిళ్లు ఎక్కువ అవడంతోనే మా బిడ్డ మృతిచెందిందని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. తల్లిదండ్రులు ఆవేదనను చూసిన బంధువులు కన్నీరు పెట్టుకున్నారు. డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆస్పత్రి వద్ద భారీగా పోలీస్ బందోబస్తు చేపట్టారు. పోలీసుల అదుపులో డాక్టర్ అశోక్ కుమార్ ఉన్నారు. అ సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## లిఫ్ట్ ఇవ్వమని జాలిగా అడుగుతారు.. పోన్లే పాపమని ఇచ్చారో..



**హైదరాబాద్-నవభూమి:** చీకటి పడగానే బస్టాండ్లు లేదా బస్టాప్‌ల లో చేతిలో సంచితో వాలిపోతారు. ఎక్కాల్సిన బస్సు రానట్టుగా ఎదురుచూస్తూనే ఉంటారు. తర్వాత రోడ్డుపై వెళ్తున్న వాహనదారులను ఆపి అర్జెంటుగా పనుంది దయచేసి సాయం చేయండని అడుగుతారు. ఆ మాటలకు కరిగిపోయి పోన్లే పాపం ఒంటరి మహిళ అని బండెక్కించుకున్న కాసేపటికే అసలు పథకం అమలు చేస్తారు. ముందుగా మాటల్లోకి దించి ఎలాంటి వ్యక్తి అని కనిపెట్టేందుకు ప్రయత్నిస్తారు. పరువు కోసం తాపత్రయపడే వారని తెలిస్తే కొద్ది దూరం వెళ్లగానే డబ్బు ఇవ్వమని బెదిరిస్తారు. లేకపోతే వేధిస్తున్నావని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసి పరువు తీస్తామని గొడవకు దిగుతారు. మీద పడి జేబుల్లో ఉన్న డబ్బు, ఒంటిపై ఉన్న నగలు దోచేస్తారు. ఒకవేళ వలపు వలకు లొంగే తరహా అని తెలిస్తే ఇంకో తరహాలో ప్రవర్తిస్తారు. నిర్మానుష్య ప్రాంతానికి వెళ్లగానే పని మొదలుపెడతారు. కవ్వించే మాటలు, చేతలతో మభ్యపెట్టి లొంగదీసుకుని చెప్పిన చోటుకు రమ్మంటారు. అలా నమ్మి ఒంటరిగా గడిపేందుకు హోటళ్లకు వెళితే.. బంధువులకు యాక్సిడెంట్ అయింది. ప్రాణాలు ప్రమాదంలో పడ్డాయని చెప్పి డబ్బు గుంజుతారు. తాజాగా ఈ ముఠాలోని ఇద్దరు కిలాడీ లేడీలను అరెస్టు చేశారు లాలాగూడ పోలీసులు.బైక్‌పై వెళ్తున్న వారినే లక్ష్యంగా చేసుకుని.. కొత్త తరహా దోపిడీకి తెరతీశారు కొందరు కిలేడీలు. రాత్రవగానే నగర శివారు ప్రాంతాల్లో చేరి వాహనదారులను లిఫ్ట్ అడుగుతూ..కొద్ది దూరం వెళ్లగానే ఏదో రకంగా బెదిరించి డబ్బులు గుంజుతున్నారు. జాలిపడి లిఫ్ట్ ఇచ్చిన పాపానికి ఇలా ఇప్పటివరకూ జేబులు గుల్ల చేసుకున్న పురుషులు ఎందరో. డిసెంబర్ 31వ తేదీన అబిడ్స్‌కు చెందిన ఓ వ్యాపారి ఇలాంటి మహిళ నుంచి తప్పించుకునేందుకు నుంచి రూ. 1.50 లక్షల నగదు, బంగారు గొలుసు ఇచ్చాడు. ఒక మహిళ కుటుంబీకుల ఎదుటే గొడవ సృష్టించడంతో పరువు పోతుందని భయపడి రూ. 5లక్షలు ఇచ్చి ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోయాడు. బంజారాహిల్స్, కేబీఆర్ పార్క్, ట్యాంక్‌బండ్, ఎన్టీఆర్ మార్గ్ వద్ద ఎక్కువగా ఇలాంటి మహిళలు బైక్, కారులో వెళ్తున్న వారిని టార్గెట్ చేసినట్లు పోలీసులు గుర్తించారు.ఇలాగే లిఫ్ట్ అడిగి డబ్బులు వసూళ్లు చేస్తున్న భాగ్య, లలితలను లాలాగూడ పోలీసులు అరెస్ట్ చేశారు. వీరు సికింద్రాబాద్ పరిధిలో ఒకరి నుంచి రూ. 3.30 లక్షలు.. మరొకరి నుంచి రూ. 2 లక్షలు కొట్టేసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. చిలకలగూడ, వారాసిగూడ ప్రాంతాల్లోనూ మరో 10 మందిని ఇదే రీతిలో మోసానికి గురయినట్లు భావిస్తున్నారు. మధ్యవయసుకు చెందినవారే లక్ష్యంగా ఈ ముఠాకు చెందిన 10 మంది మహిళలు నగర, శివారు ప్రాంతాల్లో తిరుగాడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

ఈ విషయంలో జాగ్రత్త..పేదింటి మహిళలు, యువతులను ముఠాలో చేర్చుకుంటూ నగరంలోని కొందరు పాత నేరస్థులే ఈ తరహా దోపిడీ పాల్పడుతున్నట్లు సమాచారం. ఇలాంటి మహిళలు దుకాణాలు, హోటళ్లకు వెళ్లి సరకులు, శుభకార్యాలకు భోజనాలు అందించాలని ఫోన్ నెంబర్లు సేకరిస్తున్నారు. తర్వాత రాత్రుళ్లు ఫోన్ కాల్ ద్వారా ముగ్గులోకి దించి హోటళ్లకు రమ్మని చెబుతారు. పొరపాటున వెళితే అత్యాచారానికి పాల్పడ్డారనో, మీ నగ్న చిత్రాలు సోషల్ మీడియాలో పెడతామనో బెదిరిస్తారు. అలా చేయకూడదంటే అడిగినంత డబ్బివ్వాలని డిమాండ్ చేస్తారు. కాబట్టి, ఇలాంటి విషయాల్లో జాగ్రత్తగా ఉండండి.

## నడి రోడ్డుపై జీహెచ్‌ఎంసీ రోడ్ క్లీనింగ్ వాహనం బీభత్సం..



**హైదరాబాద్-నవభూమి:** నాచారం పోలీసు స్టేషన్ పరిధిలోని మల్లాపూర్‌లో జీహెచ్‌ఎంసీ వాహనం బీభత్సం సృష్టించింది. గోకుల్ నగర్‌లో జీహెచ్‌ఎంసీ రోడ్ క్లీనింగ్ వాహనం అదుపుతప్పి.. ఇతర వాహనాలపైకి దూసుకెళ్లింది. ఇందుకు సంబంధించిన దృశ్యాలు అక్కడున్న సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి.డ్రైవర్ జీహెచ్‌ఎంసీ క్లీనింగ్ వాహనాన్ని రోడ్డు పక్కకు నిలిపి ఉంచి కిందకు దిగాడు. అతను దిగిన కాసేపటికే.. వాహనం ఉన్నట్టుండి ముందుకు కదిలింది. రోడ్ క్రాస్ చేసినట్టు.. ఆ వాహనం అవతలి నుంచి ఇవతలి వైపునకు వచ్చింది. అయితే గమనించిన డ్రైవర్ ఆ వాహనాన్ని ఆపే ప్రయత్నం చేసి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ప్రమాదంలో రెండు బైక్‌లు ధ్వంసమయ్యాయి. ఓ కారు కూడా స్వల్పంగా దెబ్బతిన్నది.

## తెలంగాణలోని ప్రముఖ ఆలయాల్లో
# ఎంత బంగారం ఉందో తెలుసా..?



**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణలోని అన్ని ఆలయాల్లో 1,048 కేజీల బంగారం, 38,783 కేజీల వెండి ఉన్నట్లు ఎండోమెంట్ అధికారులు వెల్లడించారు. అత్యధికంగా వేములవాడ రాజన్న ఆలయానికి 97 కిలోల బంగారం ఉండగా.. ఆ తర్వాత స్థానాల్లో భద్రాచలం 67 కేజీలు, యాదగిరి గుట్ట 61 కేజీలు ఉన్నాయి. ఈ బంగారం ఆయా ఆలయాల పరిధిలోనే ఉంటుందని అధికారులు తెలిపారు.

తెలంగాణలోని ప్రముఖ ఆలయాలు యాదగిరిగుట్ట, భద్రచాలం, వేములవాడల్లో ఎంత బంగారం ఉందో తెలుసా..? ఆ వివరాలను తాజాగా రాష్ట్ర దేవాదయశాఖ అధికారులు వెల్లడించారు. ప్రముఖ ఆలయాలతో పాటుగా.. రాష్ట్రంలోని అన్ని ఆలయాల్లో ఉన్న బంగారం వివరాలను తెలిపారు. వారు వెల్లడించిన వివరాల ప్రకారం.. రాష్ట్రంలో ఉన్న ఆలయాలన్నింటిలోనూ వేములవాడ రాజన్న ఆలయంలో ఎక్కువ బంగారం ఉంది. 97 కిలోల బంగారంతో రాజన్న ఆలయం టాప్లో ఉన్నట్లు పేర్కొన్నారు. ఆ తర్వాత భద్రాచలం రామయ్యకు 67 కిలోల బంగారం ఉండగా.. యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామికి 61 కిలోల బంగారం ఉంది. మొత్తంగా రాష్ట్రంలోని అన్ని ఆలయాల వద్ద 1,048 కేజీల బంగారం ఉన్నట్లు దేవాదాయశాఖ అధికారులు వెల్లడించారు.

తెలంగాణలో మొత్తం 704 ఆలయాలు ఉండగా.. ఆదాయాన్ని బట్టి ఆయా ఆలయాలను రీజినల్ జాయింట్ కమిషనర్ (ఆర్జేసీ), జిల్లా కమిషనర్(డీసీ), అసిస్టెంట్ కమిషనర్(ఏసీ)లకు బాధ్యతలు అప్పగించింది. ఆర్జేసీలు ఉన్న ఆలయాలు రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాలవాడ, భద్రాద్రి జిల్లాలోని భద్రాచలం, యాదాద్రి జిల్లాలో యాదగిరిగుట్ట ఆలయాలు ఉన్నాయి. డీసీ కేడర్లో కొండగట్టు ఆంజనేయస్వామి, కొమరవెల్లి మల్లికార్జునస్వామి, బాసర సరస్వతీ ఆలయం, సికింద్రాబాద్‌లోని గణేశ్ టెంపుల్స్ ఉన్నాయి. ఏసీ కేడర్లో మరో 13 ఆలయాలు ఉన్నాయి. మిగిలిన టెంపుల్స్ 6(ఏ), (బీ), (సీ), (డీ) కేటగిరీ పరిధిలో ఉన్నాయి. ఈ మొత్తం ఆలయాల్లో 1,048 కేజీల బంగారం ఉన్నట్లు అధికారులు తెలిపారు.

వెండి విషయానికొస్తే.. రాష్ట్రంలోని అన్ని ఆలయాల్లో కలిపి మొత్తంగా 38,783 కిలోల వెండి ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. అందులోనూ రాజన్న ఆలయం వద్ద 4,930 కిలోలు, యాదగిరి గుట్ట ఆలయం వద్ద 2,312 కిలోలు, భద్రాచలం ఆలయం వద్ద 980 కిలోల వెండి ఉంది. డీసీ కేడర్‌లో ఉన్న 4 ఆలయాల్లో 3,331 కిలోలు ఉండగా.. ఏసీ కేడర్‌లో ఉన్న 13 ఆలయాల్లో 4,415 కిలోల వెండి నిల్వలు ఉన్నాయి. 6(ఏ), (బీ), (సీ), (డీ) కేటగిరీ పరిధిలో 22,811 కిలోల వెండి ఉంది. కాగా, భక్తులు కానుకల రూపంలో సమర్పించే బంగారాన్ని మాత్రమే ప్రభుత్వ అనుమతి మేరకు కరిగించే అవకాశం ఉంది. త్రిసభ్య కమిటీ ఆమోదం తర్వాత ఆలయాల అవసరం మేరకే బంగారం కరిగించే చాన్స్ ఉంది. ఏ ఆలయానికి సంబంధించిన బంగారం ఆ ఆలయం పరిధిలోనే ఉంటుందని అధికారులు తెలిపారు.

## హైడ్రా గ్రీవెన్స్ ప్రారంభం.. ఫిర్యాదులు స్వీకరిస్తున్న రంగనాథ్



**హైదరాబాద్-నవభూమి:** హైడ్రా గ్రీవెన్స్ ప్రారంభమైంది. హైడ్రా ప్రధాన కార్యాలయం బుద్ధ భవన్‌లో సోమవారం ఉదయం హైడ్రా ప్రజావాణి మొదలైంది. హైడ్రా కమిషనర్ రంగానాథ్ స్వయంగా ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. ప్రభుత్వ పార్కులు, స్థలాలు, చెరువులకు సంబంధించి ఆక్రమణలపై నేరుగా ప్రజల నుంచి హైడ్రా చీఫ్ ఫిర్యాదులు తీసుకుంటున్నారు. ఈరోజు సాయంత్రం 5 గంటల వరకు ప్రజావాణి నిర్వాహణ ఉండనుంది. ఫిర్యాదుకు సంబంధిత ఆధారాలతో వస్తున్న ప్రజలు.. దాన్ని హైడ్రా చీఫ్‌కు అందజేస్తున్నారు. మొదటగా వచ్చిన 50 మంది ఫిర్యాదుదారులకు అధికారులు టోకెన్స్ ఇచ్చారు. టోకెన్ ప్రకారం అధికారులు ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన అంటే పది రోజుల్లోపు పరిష్కరించేలా హైడ్రా నిర్ణయం తీసుకుంది. చెరువులు, కుంటలు, నాలాల ఆక్రమణల ఫిర్యాదులపై ప్రత్యేకంగా దృష్టిసారించిన హైడ్రా.. న్యాయ వివాదాలు లేకుండా పకడ్బందీగా ఫిర్యాదులను పరిష్కరించాలని నిర్ణయించింది.

మరోవైపు ఎప్పటి నుంచో అనుకుంటున్న హైడ్రా పోలీస్‌స్టేషన్ కూడా త్వరలో ప్రారంభమయ్యే అవకాశాలు కనిపిస్తున్నారు. సంక్రాంతి పండుగకు హైడ్రా పోలీస్‌స్టేషన్ ప్రారంభంకానుంది. ఇప్పటికే హైడ్రా పీఎస్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఓకే చెప్పిన విషయం తెలిసిందే. హైడ్రా పోలీస్‌స్టేసన్‌ను ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధమైంది. ఇకపై హైడ్రాకు సంబంధించిన కార్యకలాపాలు పూర్తిగా కూడా హైడ్రా పోలీస్‌స్టేషన్ ద్వారా నిర్వహించేందుకు వీలుగా హైడ్రా కమిషన్ రంగనాథ్ నిర్ణయం తీసుకున్నారు. సంక్రాంతి నుంచి హైడ్రా పోలీస్‌స్టేషన్ ద్వారా సేవలను అందుబాటులోకి రానున్నాయి.

# పేలిన మందుపాతర

**(1వపేజీ తరువాయి)** దిగాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో తొలుత నలుగురు మావోయిస్టులు మృతి చెందినట్లు ప్రకటించా రు.

అయితే అదే ప్రాంతంలో మరో మావోయిస్ట్ మృతదేహాన్ని భద్రత దళాలు గాలింపు చర్యల్లో భాగంగా గుర్తించాయి. దీంతో సదరు ఎన్‌కౌంటర్‌లో మరణించిన వారి సంఖ్య ఐదుకు పెరిగింది. ఇక వీరిలో ఇద్దరు మహిళలని భద్రతా దళాలు వివరించాయి.ఈ ఎన్‌కౌంటర్‌లో పోలీస్ హెడ్ కానిస్టేబుల్ సైతం మరణించిన విషయం విధితమే.

నారాయణ్‌పూర్, బస్తర్, కండగావ్, దంతేవాడ జిల్లాల్లో మావోయిస్టుల కోసం శుక్రవారం ప్రత్యేక టాస్క్ ఫోర్స్ గాలింపు చర్యలు ప్రారంభించిన సంగతి తెలిసిందే. మరోవైపు దేశంలో మావోయిస్టులను నిర్మూలనకు కేంద్రం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తుంది. అందులోభాగంగా మావోయిస్టులు లొంగిపోయి.. జన జీవన స్రవంతిలో కలిసిపోవాలని పిలుపు నిచ్చింది. అలా లొంగిపోయిన వారికి జీవనోపాధి సైతం కల్పిస్తుంది. ఆ క్రమంలో దేశంలోని చాలా రాష్ట్రాల్లో మావోయిస్టుల ప్రభావం దాదాపుగా తగ్గిపోయింది.

కానీ ఛత్తీస్‌గఢ్‌లో వారి ప్రభావం ఉంది. ఈ నేపథ్యంలో మావోయిస్టుల ఏరివేతకు కేంద్రం ప్రత్యేక చర్యలు చేపట్టింది. దీంతో ఆ రాష్ట్రంలో తరచు మావోయిస్టులు, భద్రతా దళాలకు మధ్య కాల్పులు, ఎదురు కాల్పులు చోటు చేసుకొంటున్నాయి. ఇక 2026, మార్చి మాసాంతానికి దేశంలో మావోయిస్టులను నిర్మూలించేందుకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించుకొన్న సంగతి తెలిసిందే. అనుకొన్న లక్ష్యాన్ని చేరుకొనేందుకు కేంద్రం వడి వడిగా అడుగులు వేస్తోంది.

అదీకాక ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల హింసపై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ప్రత్యేక దృష్టి సారించారు. ఆ క్రమంలో ఇటీవల ఆయన ఆ రాష్ట్రంలో సైతం పర్యటించారు. ఈ సందర్భంగా లొంగిపోయిన మావోయిస్టులతో సమావేశమయ్యారు. అలాగే మావోయిస్టు బాధిత కుటుంబాలతో సైతం ఆయన భేటీ అయ్యారు. ఇక మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ సమక్షంలో 11 మంది మావోయిస్టులు గడ్చిరోలి పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయిన సంగతి తెలిసిందే. వారిలో మల్లోజుల వేణుగోపాల రావు భార్య తారక్క సైతం వారిలో ఉన్నారు.

# త్వరలో బుల్లెట్ ట్రైన్ పరుగులు

**(1వపేజీ తరువాయి)** రూపాయలతో చర్లపల్లి రైల్వే టెర్మినల్‌ను అత్యద్భుతంగా నిర్మించారు. నేటి నుంచి ఈ రైల్వే టెర్మినల్ నుంచి 13జతల రైళ్లు రాకపోకలు సాగిస్తాయి. ఈ టెర్మినల్ అందుబాటులోకి రావడంతో ఇక్కడి నుంచి మరో 12 జతల రైళ్ళను నడిపించేందుకు కూడా రైల్వేశాఖ సన్నద్ధమవుతోంది. ఢిల్లీ, చెన్నై ,విశాఖపట్నం, కోల్ కత్తా రూట్లలో వెళ్లే రైళ్లను చర్లపల్లి మీదుగా నడిపించనున్నట్టు ఇప్పటికే అధికారులు వెల్లడించారు. చర్లపల్లి రైల్వే టెర్మినల్ ప్రారంభించిన మోదీ దేశవ్యాప్తంగా రైల్వే మౌలిక సదుపాయాలను పెంచడం కోసం కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలలో భాగంగా ఈ రైల్వే టెర్మినల్‌ను అత్యద్భుతంగా నిర్మించగా నేడు ప్రధాని ప్రారంభించారు. ఈ ప్రాంత ప్రజల చిరకాల డిమాండ్ ను నెరవేరుస్తూ ఈనాడు ప్రారంభమైన చర్లపల్లి రైల్వే టెర్మినల్ ప్రయాణికులకు మెరుగైన ప్రయాణ సదుపాయాలతో పాటు మౌలిక వసతులను కల్పిస్తుంది. కేంద్రమంత్రి బండి సంజయ్ చర్లపల్లి రైల్వే టెర్మినల్ గురించి ఏమన్నారంటే ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో నేరుగా పాల్గొన్న కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రజా రవాణా వ్యవస్థ మెరుగుకు కేంద్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు...చర్లపల్లి టెర్మినల్ ప్రారంభోత్సవంలో మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయం, సహకారంతో వివిధ ప్రాజెక్టుల అమలుకు పరస్పర సహకారం అందించు కోవాలని సూచించారు.ఇప్పటిదాకా 32 వేల కోట్ల రూపాయలను కేంద్ర ప్రభుత్వం వివిధ ప్రాజెక్టుల కోసం అందించిందని చెప్పారు . రైల్వే టెర్మినల్ గురించి రాష్ట్రమంత్రి శ్రీధర్ బాబు రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ చర్ల పల్లి రైల్వే టెర్మినల్ నుంచి రవాణా సదుపాయాల మెరుగుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని, .కేంద్ర ప్రభుత్వం కూడా ఇందుకోసం ప్రత్యేక నిధులను మంజూరు చేయాలని కోరారు. పార్లమెంటు సభ్యులు ఈటెల రాజేందర్ మాట్లాడుతూ పెండింగ్ ప్రాజెక్టుల అమలుకోసం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సమష్టి కృషి చేయాలని సూచిం చారు. దేశంలోనే అద్భుత ఆదర్శ టెర్మినల్ అన్న కేంద్ర రైల్వే సహాయ మంత్రి కేంద్ర రైల్వే శాఖా సహాయ మంత్రి సోమన్న మాట్లాడుతూ రాష్ట్రంలో 2వేల కోట్ల నిధులతో ఆర్‌వోబి, ఆర్‌యూబిలను నిర్మించడానికి నిధులు విడుదల చేసిందని...ఇది ప్రధాన మంత్రి రాష్ట్రానికి ఇచ్చిన బహుమానం అని పేర్కొన్నారు...చర్ల పల్లి రైల్వే టెర్మినల్ దేశంలోనే అద్భుత ఆదర్శ టెర్మినల్ కానుందని, ఈ టెర్మినల్ నుంచి వివిధ ప్రాంతాలకు అప్రోచ్ రోడ్ల నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని సూచించారు

## 2వ అతిపెద్ద ఫ్లై ఓవర్‌ను ప్రారంభించిన సీఎం

**హైదరాబాద్-నవభూమి:** గ్రేటర్ హైదరాబాద్‌లో రెండవ అతిపెద్ద ఫ్లై ఓవర్‌ను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఆరాంఘర్ నుండి జూ పార్క్ వరకు నిర్మించిన ఈ అతి పెద్ద ఫ్లైఓవర్ నిర్మాణంతో హైదరాబాద్ నగరవాసుల ట్రాఫిక్ సమస్యకు చెక్ పడుతుందని భావిస్తున్నారు. ఆరాంఘర్ ఫ్లై ఓవర్ ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నిర్మించిన ఈ ఫ్లై ఓవర్ ను నేడు ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి ఈ ఫ్లైఓవర్ ద్వారా బెంగళూరు హైవే కు ట్రాఫిక్ అంతరాయం తగ్గుతుందని పేర్కొన్నారు. ఆరాంఘర్ ఫ్లైఓవర్ ను స్థానిక ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ తదితరులతో కలిసి ప్రారంభించారు. గతంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి హయంలో అతిపెద్ద ఫ్లై ఓవర్ పీవీ ఎక్స్ప్రెస్ వే ను నిర్మించుకున్నామని, మళ్లీ ఇప్పుడు రెండవ అతిపెద్ద ఫ్లై ఓవర్ ను నిర్మించుకొని మనకు మనమే పోటీ అని నిరూపించుకున్నామన్నారు. ఈ ఫ్లై ఓవర్‌కు మన్మోహన్ పేరు పెట్టాలని సూచిస్తున్నామన్నారు.

## రూ.12లక్షల కోట్లు ఆవిరి

**(1వపేజీ తరువాయి)** పవర్ గ్రిడ్ కార్పొరేషన్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. హెచ్డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్, ఐటీసీ, టాటా స్టీల్ వంటి అధిక వెయిటేజీ స్టాక్స్ కూడా అమ్మకాల ఒత్తిడి సూచీల పతనానికి కారణమయ్యాయి. వైరస్ భయంతోపాటు మరికొద్ది రోజుల్లో అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ బాధ్యతలు తీసుకోబోతుండటం, చైనా సహా మరి కొన్ని దేశాలపై టారీఫ్ భయం వెంటాడుతోంది. దీంతో జపాన్ నిక్కీ, హాంకాంగ్, షాంఘై మార్కెట్లు కూడా నష్టాల్లోనే ముగిశాయి.

## కేటీఆర్‌కు మళ్లీ ఏసీబీ నోటీసులు

**(1వపేజీ తరువాయి)** ఇప్పటికే ఈడీ నోటీసులు జారీ చేసిన విషయం విధితమే. 2022, అక్టోబర్‌లో ఫార్ములా ఈ కారు రేసుకు సంబంధించి బీఆర్ఎస్ ప్రభుత్వం ఈఎఫ్‌ఓతో ఒప్పందం చేసుకుంది. సీజ్ 9, 10, 11,12 రేసులను నిర్వహించాలనేది ఈ ఒప్పందం ఉద్దేశం. అయితే 2023 ఫిబ్రవరిలో సీజన్ 9 రేసులు జరిగాయి. సీజన్ 10 కి సంబంధించి ప్రమోటర్‌గా వ్యవహరించిన సంస్థ ముందుకు రావడంతో అంతకు ముందున్న త్రైపాక్షిక ఒప్పందం కాస్తా.. ద్వైపాక్షిక ఒప్పందంగా మారింది. ఇది నిబంధనల ఉల్లంఘన చోటు చేసుకుందని ప్రభుత్వం వాదిస్తోంది.

## ఎముకలు విరిచి, గుండె బయటికి తీసి జర్నలిస్ట్ హత్య

**(1వపేజీ తరువాయి)** ఎంత పాశవికంగా జరిగిందో అర్థమవుతోంది. జనవరి 3న జరిగిన ముకేష్ చంద్రశేఖర్ హత్య తర్వాత ఏర్పాటు చేసిన సిట్ బృందం ఇప్పటికే ఈ కేసులో ప్రధాన నిందితుడైన సురేశ్ చంద్రశేఖర్ కు సోదరులైన రితేష్ చంద్రశేఖర్, దినేష్ చంద్రశేఖర్, వారి డ్రైవర్ మహేంద్ర రాంటెకేను అరెస్టు చేసింది. నిన్న రాత్రి హైదరాబాద్ లో ప్రధాన నిందితుడు సురేశ్ చంద్రశేఖర్ ను కూడా అరెస్టు చేశారు. నిన్న రాత్రి అరెస్టు చేసి హైదరాబాద్ నుంచి ఛత్తీస్ ఘడ్ కు అతన్ని తరలించారు. స్వతంత్ర జర్నలిస్టు అయిన ముకేష్ చంద్రశేఖర్ జనవరి 1న అదృశ్యమయ్యాడు. జనవరి 3న అతని శవం బీజపూర్ నగరంలోని ఛత్తన్ పారా బస్తీలో ఉన్న సురేశ్ చంద్రశేఖర్ కు చెందిన స్థలంలోని సెప్టిక్ ట్యాంకులో దొరికింది. ఛత్తీస్ ఘడ్ లో ఓ రోడ్డు నిర్మాణ పనికి సంబంధించిన వార్తల ప్రచురణే ఈ హత్యకు కారణమై ఉండొచ్చని తెలుస్తోంది. అయితే పోలీసులు మాత్రం నిందితులను కస్టడీలో విచారించిన తర్వాతే అసలు విషయాలు బయటపెట్టబోతున్నారు. కీలక నిందితుడు సురేశ్ చంద్రశేఖర్ అరెస్టు నేపథ్యంలో అతన్ని ఇవాళ కోర్టులో హాజరుపర్చనున్నారు. మరోవైపు ముకేష్ చంద్రశేఖర్ పోస్ట్‌మార్టం పరీక్షలో ఈ హత్య ఎంత దారుణంగా జరిగిందో వైద్యులు గుర్తించారు. మృతుడి తలపై 15 పగుళ్లు ఉన్నట్లు తేల్చారు. అలాగే అతని మెడ విరిగిపోయిందని, అతని గుండె బయటకు వచ్చినట్లు కూడా గుర్తించారు.ప్రధాన నిందితుడైన సురేశ్ చంద్రశేఖర్ ఓ రోడ్డు కాంట్రాక్టర్. అతనితో ఉన్న విభేదాలతోనే ఈ హత్య జరిగినట్లు తెలుస్తోంది.

## భారత్‌లో వైరస్ ఎంటర్!

**(1వపేజీ తరువాయి)** అనారోగ్యాల నుంచి బయటపడని ప్రజలు ప్రస్తుతం వస్తున్న ఈ వైరస్ ను ఎదుర్కోవడానికి కావలసిన శక్తి కూడా తమ వద్ద లేదని తెగ బాధపడుతున్నారు . ఈసారి మరి ఏదైనా వైరస్ దాడి చేస్తే పోరాడి బ్రతుకుతామా? అంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భయం గుప్పిట్లో జనం ప్రభుత్వం ఈ వైరస్ వ్యాప్తి చెందకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదిలోనే దీనిని కట్టడి చేయాల్సిన అవసరం ఉందని కూడా పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కరోనా మహమ్మారి తాలూకు విషాదం నుంచి ఇంకా పూర్తిగా కోలుకొని ఎంతోమంది హెచ్‌ఎంపీవి వైరస్ గురించి తెగ ఆందోళన చెందుతున్నారు. వృద్ధులు భయం గుప్పిట్లో విలవిలలాడుతున్నారు.

**కొత్త వైరస్‌పై కేంద్రం కీలక ప్రకటన.. నిపుణులు చెప్పింది ఇదే**


చైనాలో హ్యూమన్ మెటానిమోవైరస్ (హెచ్‌ఎంపీవీ) విజృంభిస్తోందని, భారత్‌లోనూ కేసులు వెలుగు చూస్తున్నాయన్న వార్తల నేపథ్యంలో కేంద్రం స్పందించింది. ఎలాంటి ఆందోళన అవసరం లేదని తెలిపింది. హెచ్‌ఎంపీవీ కొత్త వైరస్ కాదని, 2001లో తొలిసారి గుర్తించగా, చాలా ఏళ్లుగా ప్రపంచవ్యాప్తంగా సర్క్యులేట్ అవుతున్నట్టు నిపుణులు వివరణ ఇచ్చారని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా తెలిపారు. గాలి ద్వారా, రెస్పిరేషన్ ద్వారా హెచ్‌ఎంపీవీ వ్యాప్తి జరుగుతుందన్నారు.

'అన్ని వయస్సుల వారిపైనా దీని ప్రభావం ఉండొచ్చు. చలికాలంలో ఎక్కువగా ఈ వైరస్ వ్యాప్తి జరుగుతుంది. చైనాలో హెచ్‌ఎంపీవీ కేసులు వెలుగు చూసినట్టు వార్తలు రావడంతో చైనాతో పాటు, పొరుగుదేశాల్లో పరిస్థితిని ఆరోగ్య మంత్రిత్వ శాఖ, ఐసీఎంఆర్, నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ క్షుణ్ణంగా అధ్యయనం చేస్తున్నాయి. వరల్డ్ హెల్త్ ఆర్గనేజేషన్ (డబ్ల్యూహెచ్ఓ) సైతం పరిస్థితిపై త్వరలోనే ఒక రిపోర్ట్‌ను మనతో పంచుకోనుంది. భారత్‌లో పరిస్థితిపై హెల్త్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్ అధ్యక్షతన జాయింట్ మానిటరింగ్ గ్రూప్ ఈనెల 4న సమావేశమై పరిస్థితిని సమీక్షించింది. ఆరోగ్య నిఘా వ్యవస్థలు కూడా అప్రమత్తంగా ఉన్నాయి. దేశంలో ఎలాంటి ఆరోగ్య సవాళ్లు ఎదుర్కొనేందుకైనా సిద్ధంగా ఉన్నాం. ఆందోళన పడాల్సి పని లేదు. పరిస్థితి నిశితంగా గమనిస్తున్నాం" అని జేపీ నడ్డా తెలిపారు.

## కేంద్రానికి కృతజ్ఞతలు: ప్రధాని మోదీకి సీఎం రేవంత్ వినతుల వెల్లువ!

**చర్లపల్లి-నవభూమి:** సకల హంగులతో అధునాతనంగా నిర్మించిన చర్లపల్లి రైల్వే టెర్మినల్‌ను ఇవాళ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చ్యువల్ విధానంలో ప్రారంభించారు. చర్లపల్లి టెర్మినల్ వర్చువల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడిన తెలంగాణా సీఎం రేవంత్ రెడ్డి చర్లపల్లి రైల్వే టెర్మినల్‌ను పూర్తి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఇదే సమయంలో తెలంగాణా అభివృద్ధికి అనేక ప్రాజెక్ట్ లను కేంద్రం ఇవ్వాల్సి ఉందని, ఆ చిట్టాను కేంద్రానికి విన్నవించారు. కేంద్రానికి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి భారతదేశ అభివృద్ధికి రైల్వేల అభివృద్ధి చాలా కీలకమని పేర్కొన్న సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ లాంటి రాష్ట్రాల అభివృద్ధి కూడా రైల్వేల అభివృద్ధిపైనే ఆధారపడి ఉందన్నారు. హైదరాబాద్‌లోని చర్లపల్లిలో కొత్త టెర్మినల్, స్టేషన్‌ను పూర్తి చేసినందుకు కేంద్రానికి కృతజ్ఞతలు అని పేర్కొన్నారు. ఇక ఇదే సమయంలో హైదరాబాద్ నుంచి బందర్ పోర్ట్ వరకు గ్రీన్ ఫీల్డ్ హైవే, డైరెక్ట్ రైల్వే నిర్మాణానికి కేంద్రం సహకరించాలని కోరుతున్నామని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. మీరు సహకరిస్తే తెలంగాణా ప్రగతి తెలంగాణలో 370 కిలోమీటర్ల మేర రీజనల్ రింగ్ రోడ్ ను నిర్మించబోతున్నామని, కేంద్ర సహకారం అవసరమన్నారు. రీజనల్ రింగ్ రోడ్డు, రీజనల్ రింగ్ రైల్ నిర్మాణంలో కేంద్రం పూర్తిగా సహకరించాలని కోరుతున్నామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-2కు ప్రతిపాదనలు ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి పంపించామన్నారు.

## తెల్లవారుజామున కూలిన బిల్డింగ్..




**చండీగఢ్-నవభూమి:** బహుళ అంతస్తుల భవనం తెల్లవారుజామున కూలిపోయింది. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు, అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. శిథిలాల తొలగింపు చర్యలు చేపట్టారు. అయితే ఎంత మంది మరణించారన్నది ఇంకా తెలియలేదు.

తెల్లతెల్లవారుజామున బిల్డింగ్ కుప్పకూలిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. కేంద్రపాలిత ప్రాంతమైన చండీగఢ్‌లో ఈ సంఘటన జరిగింది. సోమవారం తెల్లవారుజామున 7 గంటల సమయంలో ప్రధాన మార్కెట్



ప్రాంతమైన సెక్టార్ 17లోని బహుళ అంతస్తుల భవనం ఒక్కసారిగా కూలిపోయింది. ఇది చూసి అక్కడున్న జనం షాకయ్యారు.కాగా, ఈ సమాచారం తెలిసిన వెంటనే పోలీసులు, అధికారులు అక్కడకు చేరుకున్నారు.

కూలిన బిల్డింగ్ శిథిలాల తొలగింపు చర్యలు చేపట్టారు. శిథిలాల్లో ఎవరైనా చిక్కుకున్నారా? ప్రాణ నష్టం జరిగిందా? అన్నది ఇంకా తెలియలేదు. అయితే బహుళ అంతస్తుల బిల్డింగ్ కూలడాన్ని రోడ్డుపై వెళ్లే ఒక వ్యక్తి మొబైల్‌లో రికార్డ్ చేశాడు. షాక్‌కు గురి చేసేలా ఉన్న ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

## నలుగురిని బలిగొన్న పొగమంచు.. విజిబిలిటీ లేక లారీని ఢీకొట్టిన కారు





**న్యూఢిల్లీ-నవభూమి:** ఉదయాన్నే దట్టంగా కమ్మేసిన పొగమంచు నలుగురిని బలితీసుకున్నది. పొగమంచు కారణంగా విజిబిలిటీ సరిగా లేకపోవడంతో కారు ముందు వెళ్తున్న లారీ ని ఢీకొట్టింది. ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం సాగర్ జిల్లా లోని సాగర్-ఛత్తార్‌పూర్ రహదారిపై హీరాపూర్ గ్రామం వద్ద ఈ ప్రమాదం జరిగింది.స్థానికుల ద్వారా ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీప ఆస్పత్రులకు తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టానికి పంపించారు. మృతులంతా కారులో విధుల కోసం వెళ్తుండగా ప్రమాదం జరిగిందని పోలీసులు విచారణలో తేలింది. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

## మా పరిధి కాదన్న 2 రాష్ట్రాల పోలీసులు.. పలు గంటలపాటు రోడ్డుపై వ్యక్తి మృతదేహం

**భోపాల్-నవభూమి:** రోడ్డు దాటుతున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడు అక్కడికక్కడే మరణించాడు. అయితే ప్రమాదం జరిగిన ప్రాంతం తమ పరిధి కాదని రెండు రాష్ట్రాల పోలీసులు తెలిపారు. దీంతో ఆ వ్యక్తి మృతదేహం పలు గంటలపాటు ఆ రోడ్డుపై ఉంది. ఆగ్రహించిన గ్రామస్తులు రహదారిని దిగ్బంధించి నిరసన చేశారు. దీంతో స్థానిక పోలీసులు దిగి వచ్చారు. 27 ఏళ్ల రాహుల్ అహిర్వార్ పని కోసం ఢిల్లీ వెళ్లేందుకు ఆదివారం సాయంత్రం 7 గంటల సమయంలో ఇంటి నుంచి బయలుదేరాడు. రోడ్డు దాటుతుండగా ఒక వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. దీంతో రాహుల్ అక్కడికక్కడే మరణించాడు.కాగా, రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మరణించడాన్ని స్థానికులు గమనించి గుమిగూడారు. మధ్యప్రదేశ్‌లోని హర్పాల్‌పూర్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. ఆ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదం జరిగిన ప్రాంతం తమ పరిధిలోకి రాదన్నారు. పొరుగు రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లోని మహోబా జిల్లా మహోబ్‌కాంత్ పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తుందని చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయారు.మరోవైపు గ్రామస్తులు ఉత్తరప్రదేశ్‌లోని ఆ పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. అయితే అది తమ పరిధి కాదని అక్కడి పోలీసులు తెలిపారు. మధ్యప్రదేశ్ పోలీసుల పరిధిలోకి వస్తుందని చెప్పారు. ఈ నేపథ్యంలో రాహుల్ మృతదేహం నాలుగు గంటలకుపైగా ఆ రోడ్డుపై పడి ఉంది.కాగా, ఇరు రాష్ట్రాల పోలీసులు స్పందించక పోవడంపై గ్రామస్తులు ఆగ్రహించారు. రోడ్డును దిగ్బంధించి నిరసన చేపట్టారు. దీంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఇది తెలిసి రాత్రి 11 గంటలకు మధ్యప్రదేశ్ పోలీసులు అక్కడకు చేరుకున్నారు. పోస్ట్‌మార్టం కోసం రాహుల్ మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు. గ్రామస్తులు నిరసన విరమించడంతో ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

## కర్ణాటకలో హెచ్‌ఎంపీవీ కేసులు.. అప్రమత్తమైన ఢిల్లీ ప్రభుత్వం



**న్యూఢిల్లీ-నవభూమి:** కర్ణాటక రాజధాని బెంగళూరు లో, గుజరాత్ లోని అహ్మదాబాద్ నగరంలో హెచ్‌ఎంపీవీ కేసులు నమోదైన నేపథ్యంలో ఢిల్లీ ప్రభుత్వం అప్రమత్తమైంది. వైరస్‌ను అడ్డుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని ఆరోగ్య, కుటుంబసంక్షేమ శాఖలకు ఢిల్లీ ఆరోగ్యశాఖ మంత్రి సౌరభ్ భరద్వాజ్ ఆదేశాలు జారీచేశారు.శ్వాసకోశ సంబంధ అనారోగ్యానికి దారితీసే ఈ వైరస్ విస్తృతమైతే తీసుకోవాల్సిన చర్యలపై అన్ని ఆస్పత్రులు అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్యమంత్రి భరద్వాజ్ సూచించారు. ఈ వైరస్ కట్టడికి సంబంధించిన చర్యలపై అప్‌డేట్స్ కోసం ఢిల్లీ ఆరోగ్య కుటుంబసంక్షేమ శాఖ ఎప్పటికప్పుడు కేంద్ర ఆరోగ్య శాఖతో సంప్రతింపులు జరుపుతుండాలని ఆయన ఆదేశించారు. ఈ విషయంలో ఏమాత్రం తాత్సారం చేయవద్దని హెచ్చరించారు.వైరస్‌కు సంబంధించి ఎలాంటి అప్‌డేట్స్ ఉన్నా తక్షణమే తన దృష్టికి తీసుకురావాలని మంత్రి సూచించారు. వైరస్‌ను అడ్డుకునే ఏర్పాట్లకు సంబంధించి ఎలాంటి ఆదేశాలు, సూచనలు కావాలన్నా తనను ఫోన్‌లో సంప్రదించాలని ఆదేశించారు. ప్రతిరోజు మూడు ఆస్పత్రులను తనిఖీ చేయాలని, సంబంధిత రిపోర్టులను ఎప్పటికప్పుడు తనకు పంపించాలని ఢిల్లీ ఆరోగ్య కార్యదర్శికి మంత్రి ఆదేశాలు జారీచేశారు.

## 5 ఏళ్లుగా చేయి లేపి ఉంచిన సాధువు.. ప్రయాగ్‌రాజ్‌కు క్యూకట్టిన బాబాలు

**ప్రయాగ్‌రాజ్-నవభూమి:** ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో ఈనెల 13వ తేదీ నుంచి మహాకుంభ మేళా జరగనున్నది. త్రివేణి సంగమంలో పవిత్ర పుణ్య స్నానాలు ఆచరించనున్న నేపథ్యంలో .. అక్కడ భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న రకరకాల సాధువులు, బాబాలు ప్రయాగ్‌రాజ్‌కు చేరుకుంటారు. దిగంబర హరివంశ గిరి బాబా కూడా చేరుకున్నాడు. హరివంశ బాబా గత అయిదేళ్ల నుంచి తన ఎడమ చేతిని లేపి ఉంచారు. 12 ఏళ్ల పాటు తన చేయిని లేపి ఉంచాలని దీక్ష పూనినట్లు ఆయన చెప్పారు. అభివృద్ధి పథంలో దేశం వెళ్తుందని భావిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. నేతలు, ఆఫీసర్లు చాలా వివేకంతో వ్యవహరిస్తారని భావిస్తున్నట్లు చెప్పారు.

# బెంగళూరులో ఘోరం.. పిల్లలకు విషమిచ్చి దంపతుల ఆత్మహత్య..!



**బెంగళూరు -నవభూమి:** కర్ణాటక రాజధాని బెంగళూరు లో ఘోరం జరిగింది. చిన్నారులైన తమ ఇద్దరు పిల్లలకు విషమిచ్చి దంపతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటనతో స్థానికంగా తీవ్ర విషాదం అలుముకుంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ప్రయాగరాజ్ కు చెందిన అనూప్ కుమార్ (38) ఉద్యోగరీత్యా భార్యపిల్లలతో కలిసి కర్ణాటక రాజధాని బెంగళూరులో ఉంటున్నాడు.

అనూప్ భార్య రాఖీ (35) గృహిణి. వీరికి అనుప్రియ (5), ప్రియాన్ష్ (2) అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. అనూప్ ఓ ప్రైవేటు కంపెనీలో సాఫ్ట్‌వేర్ కన్సల్టెంట్‌గా పనిచేస్తున్నాడు. సంతోషంగా జీవనం సాగిస్తున్న వీరి కుటుంబంలో ఒక్కసారిగా విషాదం అలుముకుంది. సోమవారం ఉదయం పనిమనిషి వచ్చి తలుపుతట్టగా ఎంతకూ తీయలేదు. దాంతో ఆమె ఇరుగుపొరుగుకు సమాచారం ఇచ్చింది.వారు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా ప్రాంతానికి చేరుకున్న పోలీసులు.. తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లారు. లోపల అనూప్, అతని భార్య రాఖీతోపాటు పిల్లలు విగతజీవులుగా పడివున్నారు. పిల్లలిద్దరి మృతదేహాలు బెడ్‌పై పడివుండగా.. అనూప్, రాఖీల మృతదేహాలు ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాయి. దాన్నిబట్టి అనూప్ దంపతులు ముందుగా పిల్లలిద్దరికి విషమిచ్చి చంపి, తర్వాత వాళ్లు ఉరేసుకున్నట్లుగా ప్రాథమిక అంచనాకు వచ్చారు.ఘటనపై పనిమనిషిని ఆరా తీయగా ఆమె పలు విషయాలు వెల్లడించిందని పోలీసులు తెలిపారు. పనిమనిషి తెలిపిన వివరాల ప్రకారం.. అనూప్ ఇంట్లో మొత్తం ముగ్గురు పనివాళ్లు ఉన్నారు. వారిలో ఇద్దరు వంట మనుషులు కాగా, ఒకరు పిల్లల కేర్‌టేకర్‌గా పనిచేస్తున్నారు. వారికి ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున వేతనం ఇస్తున్నారు. ఆర్థికంగా వారికి ఏ లోటూ లేదు. అయితే అనుప్రియ ఆరోగ్యం గురించి అనూప్ దంపతులు ఎప్పుడూ ఆందోళన చెందుతుండేవారు.ఈ క్రమంలో సోమవారం అనూప్ దంపతులు పుదుచ్చేరి పర్యటనకు ప్లాన్ చేసుకున్నారు. ఆ మేరకు ఆదివారం రాత్రి లగేజ్‌ను కూడా సర్దిపెట్టుకున్నారు. సోమవారం ఉదయం వారు బయలుదేరి వెళ్లాల్సి ఉంది. కానీ తీరా పనిమనిషి వచ్చి చూసేసరికి వారు పిల్లలను చంపేసి ఉసురు తీసుకున్నారు. పనిమనిషి వెల్లడించిన వివరాలను బట్టి.. తమ కూతురు అనారోగ్య సమస్య కారణంగానే దంపతులు తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు.

### దేశంలో ఒకే రోజు మూడు హెచ్‌ఎంపీవీ కేసులు..

# రాష్ట్రాలకు కేంద్రం అలర్ట్




**న్యూఢిల్లీ-నవభూమి:** భారత్‌లో హెచ్‌ఎంపీవీ వైరస్ కేసులు తీవ్ర భయాందోళనకు గురి చేస్తున్నాయి. ఇప్పటికే కర్ణాటకలో రెండు కేసులు వెలుగు చూడగా.. తాజాగా దేశంలో మూడో కేసు బయటపడింది. గుజరాత్‌లో ఒక చిన్నారికి తాజాగా ఈ హెచ్‌ఎంపీవీ వైరస్ సోకినట్లు అధికారులు గుర్తించారు. ఇక చైనాలో మొదలైన ఈ హెచ్‌ఎంపీవీ వైరస్.. ప్రస్తుతం భారత్‌లో ఒకే రోజు 3 కేసులు పాజిటివ్ కావడంతో కేంద్ర ప్రభుత్వం అలర్ట్ అయింది. ఈ హెచ్‌ఎంపీవీ వైరస్ గురించి అన్ని రాష్ట్రాలను అప్రమత్తం చేసింది.చైనాలో వెలుగు చూసిన హ్యూమన్ మెటానిమోవైరస్ - హెచ్‌ఎంపీవీ వైరస్ అనుకున్న దాని కంటే వేగంగానే ప్రపంచ దేశాలకు విస్తరిస్తోంది. ఈ నేపథ్యంలోనే సోమవారం భారత్‌లో తొలి కేసు గుర్తించగా.. ఇవాళే ఇప్పటివరకు మొత్తం 3 కేసులు నమోదు అయ్యాయి. ఇందులో రెండు కర్ణాటక రాజధాని బెంగళూరులో కాగా.. మరో కేసు గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో గుర్తించారు. ఈ మేరకు ఐసీఎంఆర్ వెల్లడించింది. ఇప్పటికే బెంగళూరులో 3, 8 నెలల వయసు కలిగిన ఇద్దరు చిన్నారులకు ఈ హెచ్‌ఎంపీవీ వైరస్ పాజిటివ్‌గా తేలగా.. అహ్మదాబాద్‌లో 2 నెలల చిన్నారికి ఈ వైరస్ సోకినట్లు నిర్ధారించింది.ఈ క్రమంలోనే దేశవ్యాప్తంగా శ్వాసకోశ వ్యాధుల విషయంలో ఐసీఎంఆర్ సాధారణ పర్యవేక్షణలో భాగంగా ఈ రెండు కేసులు వెలుగు చూశాయని కేంద్ర ఆరోగ్యశాఖ తాజాగా వెల్లడించింది. భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో ఈ హెచ్‌ఎంపీవీ వైరస్ వ్యాప్తి చెందుతోందని తెలిపింది. ఈ హెచ్‌ఎంపీవీ వైరస్ కేసులు చైనాను దాటేసి ఇతర దేశాల్లోనూ ఇప్పుడు కేసులు నమోదు అవుతున్నాయని స్పష్టం చేసింది.బెంగళూరులోని 3 నెలల చిన్నారికి ఈ హెచ్‌ఎంపీవీ వైరస్ సోకగా.. దాని నుంచి కోలుకుందని పేర్కొంది. ఆ చిన్నారి ఆస్పత్రి నుంచి డిశ్చార్జి కాగా.. మరో చిన్నారి చికిత్స పొందుతోందని తెలిపింది. ప్రస్తుతం అహ్మదాబాద్‌లో వైరస్ సోకిన చిన్నారికి చికిత్స అందిస్తున్నామని వెల్లడించింది. అయితే ఈ హెచ్‌ఎంపీవీ వైరస్ వెలుగు చూసిన దేశాల్లో.. ప్రస్తుతం ఆ వైరస్ సోకిన చిన్నారుల కుటుంబ సభ్యులు ఎలాంటి ప్రయాణాలు చేయలేదని కేంద్ర ఆరోగ్య శాఖ స్పష్టం చేసింది.

ఇక చైనాలో ప్రారంభమై.. ఇతర దేశాలకు విస్తరించి.. చివరికి భారత్‌లోనూ ఈ హెచ్‌ఎంపీవీ వైరస్ కేసులు నమోదు అవుతుండటం పట్ల కేంద్రం స్పందించింది. ఈ వైరస్ వ్యాప్తి పట్ల దేశంలోని అన్ని రాష్ట్రాలు నిరంతరం అలర్ట్‌గా ఉండాలని సూచించింది. ఈ హెచ్‌ఎంపీవీ వైరస్ లక్షణాలతో వచ్చిన రోగులకు మెరుగైన చికిత్స అందించాలని పేర్కొంది. ఇందు కోసం అన్ని రాష్ట్రాల్లోని ఆస్పత్రుల్లో తగిన సదుపాయాలు, మౌలిక వసతులు సమకూర్చుకోవాలని తెలిపింది.

ఇక ఈ వైరస్ లక్షణాలు కూడా ఫ్లూ, ఇతర శ్వాసకోశ ఇన్ఫెక్షన్ల లాగే ఉంటాయని డాక్టర్లు చెబుతున్నారు. దగ్గు, జ్వరం, ముక్కు దిబ్బడ, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉంటుందని పేర్కొన్నారు. ఇక ఈ హెచ్‌ఎంపీవీ వైరస్ అధికంగా ఉన్నవారిలో బ్రాంకైటిస్, నిమోనియా లాంటి వ్యాధులు వస్తాయని తెలిపారు. ఈ హెచ్‌ఎంపీవీ వైరస్ లక్షణాలు బయటికి కనిపించడానికి 3 నుంచి 6 రోజులు పడుతుందని చెప్పారు. ఇక అమెరికాకు చెందిన సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ తెలిపిన ప్రకారం.. చిన్నారులు, వృద్ధులు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న వారికి ఈ హెచ్‌ఎంపీవీ వైరస్ వచ్చే అవకాశాలు ఎక్కువ అని పేర్కొంది. ఇక చైనాలో వెలుగుచూసిన ఈ హ్యూమన్ మెటానిమోవైరస్ వ్యాప్తి నేపథ్యంలో ఇప్పటికే అప్రమత్తమైన భారత్.. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ జాయింట్ మానిటరింగ్ గ్రూప్ సమావేశం నిర్వహించింది. అయితే భారత్‌లో అంత ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొంది.

## డాకింగ్ టెస్ట్‌ను వాయిదా వేసిన ఇస్రో.. మళ్లీ నిర్వహించేది ఎప్పుడో తెలుసా..?




**న్యూఢిల్లీ-నవభూమి:** స్పాడెక్స్ మిషన్‌లో భాగంగా నిర్వహించిన డాకింగ్ టెస్ట్‌ను ప్రస్తుతానికి వాయిదా వేసినట్లు భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో తెలిపింది. షెడ్యూల్ ప్రకారం డాకింగ్ ప్రక్రియ ఈ నెల 7న జరగాల్సి ఉండగా.. 9వ తేదీకి వాయిదా వేసినట్లు పేర్కొంది. డాకింగ్ ప్రక్రియను వాయిదాకు గల కారణాలను వెల్లడించలేదు. కేంద్ర ఎర్త్ సైన్స్ మంత్రి జితేంద్ర సింగ్ స్పాడెక్స్ మిషన్‌కు ఇండియన్ డాకింగ్ టెక్నాలజీగా నామకరణం చేశారు. ఇది పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో ఇస్రో ఈ మిషన్‌ను చేపట్టింది. తొలిసారిగా డాకింగ్ టెస్ట్‌ను నిర్వహించనున్నది. మిషన్‌లో భాగంగా ప్రత్యేకంగా రూపొందించిన ఉపగ్రహాలను భూమి తక్కువ కక్ష్యలో ఒకదానితో మరొకదాన్ని ఇస్రో అనుసంధించనున్నది. ఇప్పటి వరకు, రష్యా, అమెరికా, చైనాకు మాత్రమే క్లిష్టమైన ఈ సాంకేతిక టెక్నాలజీ అందుబాటులో ఉన్నది.ఇస్రో సైతం ఈ ఘనతను సాధించేందుకు రెడీ అవుతున్నది. ఇందులో ఇస్రో విజయవంతమైన డాకింగ్ టెక్నాలజీ కలిగిన నాలుగో దేశంగా భారత్ చరిత్ర సృష్టించనున్నది. ప్రక్రియలో భాగంగా దాదాపు గంటకు 28,800 కిలోమీట్ల వేగంతో ప్రయాణించే రెండు స్పేస్‌క్రాఫ్ట్‌లను అనుసంధానం చేస్తారు. టెస్ట్‌లో సెన్సార్ సెట్‌ని ఉపయోగించి ఉపగ్రహాల వేగాన్ని తగ్గించి.. ఆ తర్వాత ఒకదానితో ఒకటి అనుసంధానిస్తారు. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. భారతీయ డాకింగ్ మెకానిజంపై ఇస్రో ఇప్పటికే పేటెంట్ తీసుకుంది. డాకింగ్ అనేది సంక్లిష్టమై పక్రియ. ఎందుకంటే రెండు స్పేస్‌క్రాఫ్ట్‌లను కక్ష్యలో ఉంచాలి. ముఖ్యంగా ఒకదానితో మరొకటి ఢీకొట్టకుండా చూడాల్సి ఉంటుంది.భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ త్వరలో చంద్రయాన్-4 మిషన్‌కు సిద్ధమవుతుంది. చంద్రుడిపై నమూనాలను సేకరించనున్నది. ఈ మిషన్‌ను రెండు విడుతలుగా చేపట్టనున్నది. ఈ క్రమంలో డాకింగ్‌లో నైపుణ్యం సాధించడం తప్పనిసరని ఇస్రో చీఫ్ సోమనాథ్ వెల్లడించారు. ఇక స్పాడెక్స్ మిషన్‌లో భాగంగా డిసెంబర్ 30న శ్రీహరికోటలోని లాంచ్‌ప్యాడ్ నుంచి పీఎస్ఎల్వీ సీ-60 వాహహక నౌక నింగిలోకి దూసుకెళ్లింది. ఎస్‌డీఎక్స్01(చేజర్), ఎస్‌డీఎక్స్02(టార్గెట్) అనే 440 కిలోలు ఉన్న రెండు చిన్న ఉపగ్రహాలను ఈ వాహకనౌక నిర్ణీత భూ దిగువ కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. వీటిని భూమికి 470 కిలోమీటర్ల ఎత్తులో ఈ రెండింటినీ 3 మీటర్ల సమీపానికి చేర్చి డాకింగ్ ప్రక్రియ నిర్వహించనున్నారు.

## బీజేపీ నేత వివాదాస్పద వ్యాఖ్యలు.. కంటతడిపెట్టిన ఢిల్లీ సీఎం అతిషి..

**న్యూఢిల్లీ-నవభూమి:** ఢిల్లీ ముఖ్యమంత్రి అతిషి ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతూ ఒక్కసారిగా ఏడ్చేశారు. ఢిల్లీ బీజేపీ నాయకుడు, కల్కాజీ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి రమేష్ బిదూరీ అతిషి గురించి చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలపై స్పందిస్తూ ఆమె కంటతడి పెట్టారు. రమేష్ బిదూరీ వ్యాఖ్యలు తనను తీవ్ర ఆవేదనకు గురిచేశాయని అన్నారు.ఢిల్లీ బీజేపీ నేత రమేష్ బిదూరీ తరచూ వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తూ వార్తల్లో నిలుస్తున్నారు. ఇప్పటికే కాంగ్రెస్ అగ్ర నాయకురాలు ప్రియాంకాగాంధీ గురించి ఆయన వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. తాము అధికారంలోకి వస్తే ఢిల్లీ రోడ్లను ప్రియాంకాగాంధీ బుగ్గల్లా నున్నగా తీర్చిదిద్దుతామని అన్నారు. తాజాగా ఆదివారం రోహిణిలో జరిగిన బహిరంగసభలో ఆయన మాట్లాడుతూ ఢిల్లీ ముఖ్యమంత్రిపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు.ఢిల్లీ ముఖ్యమంత్రి అతిషి ఏకంగా తన తండ్రినే మార్చేశారని రమేష్ బిదూరీ వ్యాఖ్యానించారు. అతిషి తన పేరు చివరలో గతంలో మార్లినా అని రాసుకునే వారని, ఇప్పుడు మార్లినా స్థానంలో సింగ్ వచ్చి చేరిందని ఆయన ఎద్దేవా చేశారు. ఇది ఆమ్ ఆద్మీ పార్టీ నేతల సంస్కృతి అని దెప్పిపొడిచారు. ఇవాళ ఆ వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ అతిషి ఏడ్చారు. కాగా రమేష్ వ్యాఖ్యలను అంతకుముందే ఆప్ కన్వీనర్ అర్వింద్ కేజ్రీవాల్ కూడా కొట్టిపారేశారు.

### అఫ్గన్‌పై పాకిస్థాన్ వైమానిక దాడులు..

# తీవ్రంగా స్పందించిన భారత్



**కాబూల్-నవభూమి:** బట్టకాల్చి ఎదుటివారిపై వేయడం దాయాది పాకిస్థానిక్‌కు అలవాటే.. అవతలి వైపు అఫ్గనిస్థాన్.. ఇటువైపు ఇండియాపై తరుచూ ఆరోపణలు చేస్తూ.. పబ్బం గడుపుకుంటోంది. ఈ క్రమంలో అఫ్గన్‌లో అమాయక ప్రజలే లక్ష్యంగా దాడులకు దిగింది. తూర్పు పక్తికా ప్రావిన్స్‌లో జరిగిన ఈ దాడిలో 46 మంది చనిపోయారు. ఈ దాడులను పాల్పడిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని అఫ్గన్ హెచ్చరించింది. తాజాగా, పాక్ దాడులపై భారత్ స్పందించింది. తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది.అఫ్గనిస్థాన్ పౌరులే లక్ష్యంగా ఇటీవల పాకిస్థాన్ చేపట్టిన వైమానిక దాడులపై భారత్ తీవ్రంగా స్పందించింది. పాక్ చర్యలపై ఆగ్రహం వ్యక్తం చేసిన భారత్.. అమాయక పౌరులపై జరిగే ఎటువంటి దాడినైనా నిస్సందేహంగా ఖండిస్తామని స్పష్టం చేసింది. తన అంతర్గత వైఫల్యాలను పొరుగుదేశాలపైకి నెట్టేయడం పాకిస్థాన్‌కు అలవాటేనని మండిపడింది. ఈ మేరకు భారత విదేశాంగ శాఖ ఓ ప్రకటన విడుదల చేసింది. డిసెంబరు 26న అఫ్గనిస్థాన్ పక్తియా ప్రావిన్సుల్లో పాకిస్థాన్ వైమానిక దళం జరిపిన దాడుల్లో కనీసం 46 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో మహిళలు, చిన్నారులే అధికంగా ఉన్నారు. అటు, పాకిస్థాన్‌పై ప్రతీకార దాడి తప్పదని తాలిబన్ ప్రభుత్వం హెచ్చరించింది.

"అంతర్జాతీయ నియమ, నిబంధనలను ఉల్లంఘించిన ఈ క్రూరమైన చర్యను అఫ్గనిస్థాన్ తీవ్రంగా పరిగణిస్తుంది" అని ఆ దేశ రక్షణ మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఇనాయతుల్లా ఖౌరాజ్మీ ఒక ప్రకటనలో తెలిపారు. 'ఈ పిరికిపంద చర్యకు ఇస్లామిక్ ఎమిరేట్ సమాధానం ఇవ్వకుండా నిద్రపోదు" అని హెచ్చరించారు.పక్తికా ప్రావిన్సులు బార్మల్ జిల్లాలోని నాలుగు గ్రామాలే లక్ష్యంగా పాకిస్థాన్ సైన్యం వైమానిక దాడులకు పాల్పడింది. ఈ ఘటనలో 46 మంది చనిపోగా మరో ఆరుగురు చిన్నారుల పరిస్థితి విషమంగా ఉందని తాలిబన్ ప్రభుత్వం ప్రకటించింది.తాలిబన్లు అఫ్గన్‌ను ఆక్రమించుకున్న తర్వాత.. పాక్ సరిహద్దులో ఉద్రిక్తతలు నెలకొన్నాయి. తమ దేశంలో జరిగిన పలు ఉగ్రదాడులకు తాలిబన్లే కారణమని పాక్ ఆరోపిస్తోంది. అయితే, ఈ ఆరోపణలను తాలిబన్ ప్రభుత్వం ఖండిస్తూనే ఉంది. గత ఏడాది మార్చిలోనూ అఫ్గన్‌పై పాక్ వైమానిక దాడులు చేసింది.. తాజాగా డిసెంబరు 26న మరోసారి దాడులకు పాల్పడింది. పాక్ సైన్యం వైమానిక దాడుల్లో వజీరిస్థానీ శరణార్థులే ఎక్కువగా మృతిచెందారు.ఒకప్పుడు తాలిబన్లతో అంటకాగి... అల్‌ఖైదా వంటి ఉగ్రవాద సంస్థలు అక్కడ వేళ్లూనుకోవడంలో దాయాది కీలకంగా వ్యవహరించిన అంశం జగమెరిగిన సత్యమే. 2021లో అమెరికా సైన్యం వైదొలగిన తర్వాత.. అఫ్గన్‌కు పాకిస్థాన్ ఆర్మీ జనరల్ వెళ్లడం అప్పట్లో సంచలనం రేపింది. ప్రపంచమంతా తాలిబన్ల ప్రజాకంటక పాలనపై భయాందోళనలు వ్యక్తం చేస్తే.. పాక్ మాత్రం చంకలు గుద్దుకుంది.గ్రురున ఏడాది తిరగకముందే దాని సంతోషం తుస్సుమంది. తాము చెప్పినట్లు ఆడే ప్రభుత్వం అఫ్గన్‌లో ఉంటుందని, తాలిబన్లు తమ మాట జవదాటరని ఆశించిన పాకిస్థాన్‌కు భంగపాటు తప్పలేదు. స్నేహం మాట అటుంచితే ఇరు దేశాల మధ్య యుద్ధవాతావరణం నెలకుంది. ఇప్పుడు తాలిబన్లతో వైరం పెట్టుకుని.. కయ్యానికి కాలుదువ్వుతోంది. అఫ్గన్ సరిహద్దుల్లో పాక్ సైన్యం ముప్పు ఎదుర్కొంటోంది.

# అమెరికా హెచ్ 1 బీ వీసాల్లో మనోళ్ల జోరు




**న్యూఢిల్లీ-నవభూమి:** ఏటా ప్రపంచవ్యాప్తంగా ఎంతో మంది అమెరికాకు వెళ్తూ ఉంటారు. అయితే అక్కడికి వెళ్లేవారికి అమెరికా ప్రభుత్వం రకరకాల వీసాలు జారీ చేస్తూ ఉంటుంది. ఈ క్రమంలోనే ఇందులో హెచ్ 1 బీ వీసాల గురించి బాగా చర్చ జరుగుతూ ఉంటుంది. ఇక ప్రపంచ దేశాల నుంచి అమెరికాకు వెళ్లేవారిలో భారత్ నుంచి అత్యధిక సంఖ్యలో ఉంటారు. నైపుణ్యాలు కలిగిన విదేశీ ఉద్యోగులను నియమించుకునేందుకు అమెరికా కంపెనీలు.. తాత్కాలికంగా హెచ్ 1 బీ వీసాలు అందిస్తూ ఉంటుంది. ఈ హెచ్ 1 బీ వీసాలతో భారత ఐటీ రంగం భారీగా డెవలప్ అవుతోంది. ఈ నేపథ్యంలోనే తాజాగా అమెరికా జారీ చేసే హెచ్ 1 బీ వీసాలకు సంబంధించి లెక్కలు విడుదల చేసింది. అమెరికా జారీ చేసే ప్రతీ ఐదు హెచ్ 1 బీ వీసాల్లో ఒకరు భారతీయులే ఉంటున్నారని ఆ లెక్కల ద్వారా తెలుస్తోంది.అమెరికా జారీ చేసే హెచ్ 1 బీ వీసాల్లో భారత ఐటీ కంపెనీల జోరు కనిపిస్తోంది. మొత్తం హెచ్ 1 బీ వీసాల్లో అయిదింటిలో ఒకవంతు భారతీయ ఐటీ సంస్థలే దక్కించుకుంటుండటం గమనార్హం. తాజాగా అమెరికా ఇమిగ్రేషన్ విభాగం గణాంకాలు విడుదల చేసింది. హెచ్ 1 బీ వీసాలు పొందడంలో ఇన్ఫోసిస్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ - టీసీఎస్ ముందువరుసలో ఉన్నట్లు తెలుస్తోంది. గతేడాది ఏప్రిల్- సెప్టెంబరు నెలల మధ్య అమెరికా జారీ చేసిన 1.3 లక్షల హెచ్ 1 బీ వీసాల్లో.. 24,766 వీసాలను భారత సంతతి కంపెనీలే పొందాయని వెల్లడైంది.%ఇక అత్యధిక వీసాలు పొందిన వాటిలో అమెజాన్ కామ్ సర్వీసెస్ ఎల్ఎల్‌సీ ముందు వరుసలో నిలిచింది. ఈ సంస్థకు 9,265 హెచ్ 1 బీ వీసాలు లభించాయి. ఎల్ఎల్‌సీ తర్వాత ఇన్ఫోసిస్ రెండో స్థానంలో ఉంది. అమెరికాలోని న్యూజెర్సీ కేంద్రంగా పనిచేస్తున్న కాగ్నిజెంట్ సంస్థ 6,321 హెచ్ 1 బీ వీసాలతో మూడో స్థానంలో నిలిచింది. ఇక భారతీయ సంస్థల విషయానికి వస్తే.. ఇన్ఫోసిస్ కంపెనీ 8,140 వీసాలతో తొలి స్థానాన్ని దక్కించుకుంది.

ఆ తర్వాత టీసీఎస్ 5,274 వీసాలు.. హెచ్‌సీఎల్ అమెరికా 2,953 ఆ తర్వాతి స్థానాల్లో నిలిచాయని అమెరికా ఇమిగ్రేషన్ డిపార్ట్‌మెంట్ వెల్లడించింది. ఈసారి 1,634 వీసాలతో విప్రో.. 1,199 వీసాలతో టెక్ మహీంద్రా కాస్త వెనుకంజలో ఉన్నట్లు తెలిపింది. అమెరికా కంపెనీలు తాత్కాలికంగా ప్రత్యేక నైపుణ్యాలు ఉన్న విదేశీ ఉద్యోగులను నియమించుకునేందుకు హెచ్ 1 బీ వీసాలను జారీ చేస్తూ ఉంటుంది.

## భారత్‌లో పెరుగుతున్న హెచ్‌ఎమ్‌పీవీ కేసులు.. అహ్మదాబాద్‌లో మరో చిన్నారికి వైరస్ పాజిటివ్

న్యూఢిల్లీ-నవభూమి:రెండేళ్ల చిన్నారికి వైరస్ పాజిటివ్‌గా తేలింది. ప్రస్తుతం చిన్నారి అహ్మదాబాద్ లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిసింది. ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం స్థిరంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. బాధిత కుటుంబానికి రాజస్థాన్‌లోని దుంగార్‌పూర్‌గా తెలిసింది. తాజా కేసుతో భారత్‌లో మొత్తం హెచ్‌ఎమ్‌పీవీ కేసుల సంఖ్య మూడుకు చేరింది.అంతకుముందు




బెంగళూరులోని బాప్టిస్ట్ ఆసుపత్రి లో 3, 8 నెలల చిన్నారులకు వైరస్ సోకినట్లు తేలిన విషయం తెలిసిందే. మూడు కేసుల్లో వైరస్ సోకిన పిల్లల కుటుంబ సభ్యులకు అంతర్జాతీయ ప్రయాణాలు చేసిన హిస్టరీ లేదు. అయినప్పటికీ వైరస్ బారినపడటం ఆందోళన కలిగిస్తోంది.



## కొత్త సంవత్సరంలో రూపాయి

డాలర్ ముందు రూపాయి తేలిపోతోంది. రోజురోజుకూ విలువ కోల్పోతూ తన రికార్డును తానే బద్దలుకొడుతోంది. జనవరి 3న రూపాయి మారకం విలువ డాలర్‌కు 85.79. డిసెంబరు 27న 85.80కు క్షీణించిన విషయం తెలిసిందే. సమీపకాలంలో రూపాయి విలువ మరింత పతనం కావచ్చునని ఆర్థికవేత్తలు అంచనావేస్తున్న నేపథ్యంలో, 2014లో ఎన్నికల ప్రచారంలో నరేంద్ర మోదీ రూపాయి పతనం గురించి చేసిన వ్యాఖ్యలు అందరికీ గుర్తుకు వస్తున్నాయి. దేశ రక్షణ గురించి గానీ, రూపాయి పతనం గురించి గానీ మన్మోహన్‌సింగ్ ప్రభుత్వానికి పట్టింపు లేదని మోదీ అప్పట్లో ఘాటైన వ్యాఖ్యలు చేశారు. ఆయనతో పాటు, ఆయన ప్రధాని కావాలని కోరుకున్న ప్రముఖులంతా రూపాయి పతనం మీద చేసిన వెటకారపు వ్యాఖ్యలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో మళ్ళీ ప్రత్యక్షమవుతున్నాయి. అప్పట్లో రూపాయి బాగోగుల గురించి గుండెలుబాదుకున్న పెద్దలంతా ఇప్పుడు ఎందుకో నోరువిప్పడం లేదు మరి.రూపాయి విలువ ఈ స్థాయిలో పడిపోవడం ఆర్థిక నిపుణుల్లో కలకలం రేపింది. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా దిద్దుబాటు చర్యలేవో చేపట్టింది కానీ, అవి ఏ మాత్రం ఫలితాలను సాధిస్తాయో వేచి చూడాల్సిందే. సెప్టెంబర్ నెల నుండి రూపాయి పతనం స్పష్టంగానే కనిపిస్తోంది. సెప్టెంబర్ 12న డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ రూ.83.98కి పడిపోయింది. అప్పట్లో అదో రికార్డు. ఆ స్థాయికి రూపాయి విలువ పడిపోవడం అదే మొదటిసారి కావడంతో కలకలం రేగింది. మార్కెట్లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఆర్థిక నిపుణులు రకరకాల విశ్లేషణలు చేశారు. అయితే, ఎన్నికల పబ్బాలను గడుపుకునే పనిలో ఉన్న మోదీ ప్రభుత్వానికి అప్పట్లో ఈ విషయమే పట్టలేదు. ఫలితంగా పతనంలో రూపాయి కొత్త రికార్డులు సృష్టించడం ప్రారంభమైంది.రూపాయి విలువ తగ్గిపోతోంది కాబట్టి మన జేబులో డబ్బు ఎక్కువగా ఖర్చు చెయ్యాల్సి వస్తోంది. గత పదేళ్ళలో డాలర్‌తో రూపాయి మారకపు విలువ 25 శాతం పతనమైంది. అప్పట్లో 3వేల రూపాయలు ఉండే ఇంటి అద్దె ఇప్పుడు 15వేల రూపాయలు అయ్యింది. ఆ లెక్కన అప్పట్లో నెలకు రూ.10వేలు సంపాదించేవారు. ఇప్పుడు నెలకు దాదాపు రూ.50వేల దాకా సంపాదించాలి. ఆ స్థాయిలో సామాన్యుల వేతనాలు పెరుగుతున్నాయా? లేదు కదా కాబట్టి రూపాయి పతనం వల్ల నష్టపోతున్నది పేదలు, మధ్య తరగతివారు, సామాన్యులే. పదేళ్ల కిందట ఒక డాలర్ కోసం మనం 63 రూపాయలు చెల్లించాల్సి వచ్చేది. మరి ఇప్పుడు 85 రూపాయలు చెల్లించాల్సి వస్తోంది. ఇదివరకు కూరగాయలు కొంటే 100 రూపాయలకి సంచినిండేది, ఇప్పుడు 500 రూపాయలు పెట్టినా నిండట్లేదు. ఒక్క కూరగాయలే కాదు, ఇంట్లో వాడే ప్రతీ నిత్యావసరం ధరా పెరుగుతూనే ఉంటుంది.

ఈ పతనం ఇంకొంత కాలం, ఇంకా హెచ్చుగా సాగే అవకాశాలే అధికం. అంటే ధరలు మరింత పెరగడం ఖాయం. రూపాయి పతనం వల్ల పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు బాగా పెరుగుతాయి. మనం విదేశాల నుంచి చమురును ఎక్కువగా కొంటున్నాం, భారీగా చెల్లింపులు జరుపుతున్నాం కనుక విలువ ప్రభావం ఇక్కడ అధికంగా ఉంటుంది. మన నెలవారీ బడ్జెట్ ప్రతీ నెలా పెరుగుతూండటానికి ద్రవ్యోల్బణం కూడా కారణం. కోడిగుడ్డు ఒక రూపాయి నుంచి గత సంవత్సరం 5 రూపాయలు అయ్యింది. ఈ సంవత్సరం 7 రూపాయలు అయ్యింది. కోళ్ల దాణా, కరెంటు ఖర్చు, కూలీ వేతనాలు, నిర్వహణ ఖర్చులు, రవాణా ఖర్చులు ఇలా అన్నీ పెరుగుతూ గుడ్డు ధర కూడా పెరిగింది. ఇలా ఒకదానిపై ఒకటి ఆధారపడుతూ ధరలు పెరుగుతూనే ఉన్నాయి.అమెరికాతో పోల్చితే ఇండియా చాలా వేగంగా వృద్ధి చెందుతున్న దేశం. అయినా రూపాయి పతనం కావడానికి కారణం డాలర్ అంతర్జాతీయ స్టాండర్డ్ కరెన్సీగా ఉండటమే. ప్రతీ దేశమూ విదేశాలతో వ్యాపారం డాలర్ల రూపంలో చేస్తున్నాయి. దాంతో డాలర్ విలువ పెరుగుతూనే ఉంది. మనం విదేశాలతో రూపీలో వాణిజ్యం చేస్తే మన కరెన్సీ కూడా బలపడగలదు. కానీ అమెరికా అందుకు అంగీకరించక, ఆంక్షల పేరిట భయపెడుతోంది. ఆసియాలో రూపీ రూపంలో వాణిజ్యం జరపాలనే డిమాండ్లు ఉన్నాయి. ఈ దిశగా అడుగులు పడితే మన కష్టాలు తీరగలవు. బ్రిక్ దేశాలు ఉమ్మడి కరెన్సీని ప్రవేశపెట్టి డాలర్‌కి చెక్ పెట్టాల్సిన టైమ్ వచ్చింది. ఇప్పటికైనా అడుగులు పడకపోతే, భారతీయులు మరింతగా నష్టపోతారు. మన ఎగుమతులను, ఉత్పాదకత సామర్థ్యాలను పెంచుకోవాల్సిన అవసరం ఉన్నది. ప్రభుత్వాలు ఉద్యోగ కల్పన, మౌలిక వసతుల కల్పనపై దృష్టి పెట్టాలి. దీంతో ఉత్పత్తి పెరిగి ఎగుమతుల ద్వారా విదేశీ మారక ద్రవ్యం ఆర్జించి రూపాయి స్థిరీకరణ చేయవచ్చు. దేశీయంగా ఎలక్ట్రానిక్స్ సంస్థలు నెలకొల్పి, ఉన్నవాటి సామర్థ్యాన్ని ఉత్పత్తిని పెంచి దేశీయ ఉత్పత్తిని ప్రోత్సహించాలి. దిగుమతుల్లో ప్రముఖపాత్ర వహిస్తున్న ఇంధన అవసరాల కోసం దేశీయ సంస్థల్ని పురికొల్పి, ఎక్కువ ఉత్పత్తిని సాధించాలి. ప్రత్యామ్నాయ ఇంధన వనరుల ఉత్పాదకతను పెంచడం ద్వారా స్వయం సమృద్ధి సాధించాలి.రూపాయి విలువ ఈ స్థాయిలో పడిపోవడం ఆర్థిక నిపుణుల్లో కలకలం రేపింది.రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా దిద్దుబాటు చర్యలేవో చేపట్టింది కానీ, అవి ఏ మాత్రం ఫలితాలను సాధిస్తాయో వేచి చూడాల్సిందే.గత ఏడాది సెప్టెంబర్ నెల నుండి రూపాయి పతనం స్పష్టంగానే కనిపిస్తోంది. ఈ పతనం ఇంకొంత కాలం, ఇంకా హెచ్చుగా సాగే అవకాశాలే అధికం. అంటే ధరలు మరింత పెరగడం ఖాయం.

# సత్యమేవ జయతే



*మాటకు ప్రాణము సత్యము*
*కోటకు ప్రాణంబు సుభటకోటి దరిత్రిన్*
*బోటికి ప్రాణము మానము*
*చీటికి ప్రాణము వ్రాలు సిద్ధము సుమతీ!*

దీని అర్థం, మాటకు సత్యమే ప్రాణం. వీరులైన సైనికులే కోటకు ప్రాణము. స్త్రీకి శీలమే ప్రాణము. చీటికి సంతకమే ప్రాణము. అనగా సంతకం లేని చీటీ వ్యర్థము. తన సుమతీ శతకంలో బద్దెన బ్రహ్మాండంగా ఈ సత్యాలను వివరించారు.ఆదికవి నన్నయ బట్టు తన ఆంధ్ర మహాభారతంలో, శకుంతలోపాఖ్యానం లో, శకుంతల ద్వారా సత్యప్రాశస్త్యాన్ని గూర్చి స్పష్టంగా వివరించారు. నూరు బావులకంటే ఒక దిగుడు బావి మేలు, నూరు దిగుడు బావుల కంటే ఒక యజ్ఞం మేలు, నూరు యజ్ఞాల కంటే ఒక పుత్రుడు మేలు, నూరు పుత్రుల కంటే ఒక సత్యం మేలు. అంటే, సర్వ ధర్మాల కంటే సత్యం గొప్పదని స్పష్టం చేయబడింది.సత్యమే సదా నిలుస్తుంది.నిలబెడుతుంది. వాస్తవాలను వెల్లడి చేస్తూ అవస్తవాలను ఎండగడుతుంది. ఈ మేరకు పగటివేళను సత్యంతో, చీకటి వేళను అబద్ధంతో పోల్చవచ్చు. సత్యమునకు నిజము, యథార్థత, ఇవన్నీ పర్యాయపదాలే! యదార్ధ వాది లోకవిరోధి అనే నానుడి ఉన్నా యదార్థవాదులే లోకాన్ని రక్షించేవారుగా ఉంటారనేది స్పష్టం. సత్యమును పలుకుట గౌరవంగా ఎంచబడితే! అబద్ధము పలుకుట పాపముగా ఎంచబడింది. అబద్ధాల వలన అన్యాయం జరిగితే సత్యం వలన న్యాయం జరుగుతుంది. సత్యమే నిలుస్తుంది, గెలుస్తుంది, అన్నింటా గెలిపిస్తుంది. అందుకే, యజమానులు, అధికారులు, పాలకులు, సత్యాసక్తులై వుంటే సదర వ్యవస్థలు బ్రహ్మాండంగా రాణిస్తూ ఆదర్శవంతంగా నిలుస్తాయి. క్లుప్తంగా సత్యమే పరమ జ్ఞానమునకు సాటిగా ఉంటూ మన మనసులను శుద్ధి చేస్తూ, స్వతంత్రులనుగా చేస్తుంది. సత్యము నీతిని కలిగి ఉంటూ నమ్మకాన్ని కలిగిస్తుంది.సత్యమునే పలికే మనస్సు నిర్మలంగా ఉంటే, అబద్ధాలను పలికే మనస్సు అలజడితో ఉంటుంది. ఉదా! సత్యమును ఒక చిన్న నూనె బిందువుతో పోల్చితే! ఆ నూనె బిందువును నీటిలో వేసినా, ఏటిలో వేసినా,చివరకు సముద్రంలో వేసినా తేలుతూనే ఉంటుంది.ఎంత మాత్రం మునగదు కదా! అవును సత్యం ఎల్లప్పుడూ నిలుస్తూ ఉన్నత శిఖరాలలో ఉంచితే, దానికి వ్యతిరేకంగా అబద్ధం నిట్ట నిలువునా ముంచేస్తుంది. సత్యమే నిలుస్తుంది, నిలుపుతుంది, నెగ్గుతుంది. ఈ సందర్భంలో... గతంలో నేనెప్పుడో చదివిన విషయాన్ని మీ ముందు



ఉంచుతున్నాను.ఒక బీద స్త్రీ తన ఏకైక పుత్రుడిని ప్రయోజకుడ్ని చేయాలనే ఉద్దేశ్యంతో పాదాచారుల బృందంతో వేరే దేశానికి పంపిస్తుంది. పంపించే క్రమంలో, నిలువ ఉండే ఆహారం, తాను దాచుకున్న నాణేలను ఇస్తూ, చక్కని ప్రావీణ్యతను సాధించాలని చెబుతూ, ఎప్పుడూ సత్యాన్ని పలకమంటుంది. సదరు బృందంతో పాటు బాలుడు వెళ్తుండగా మార్గమధ్యంలో ఒక దోపిడి దొంగల ముఠా వారిని అడ్డగించి అందరినీ అడుగుతూ వారి వద్దవి దోచుకుంటుంది. ఏమీ లేవని అబద్ధాలు చెప్పిన వారిని బాది ఉన్నదంతా దోచుకుంటుంది. ఆ సమయంలో సదరు దొంగల ముఠా లీడర్ ఈ చిన్న పిల్లాడిని చూస్తూ నీ దగ్గర ఏమి ఉన్నాయని ప్రశ్నిస్తే, సత్యవంతుడైన బాలుడు తన మూటను విప్పి, ఉన్నదంతా నిజాయితీగా చెబుతూ చూపిస్తాడు. తన తల్లి భద్రంగా ఇచ్చిన నాణాలను సైతం నిర్భయంగా చూపిస్తాడు,ఇచ్చేస్తాడు. దీంతో బాలుడి పోకడని చూసి ఖంగు తిన్న గ్యాంగ్ లీడర్ పిల్లోడి ధైర్యానికి, సత్య వచనానికి ఫిదా అవుతాడు. ఇలా ఉండాలని నీకు ఎవరు చెప్పారని అడిగితే? మా అమ్మ ఎప్పుడు సత్యమునే పలుకమంది. సత్యమే కాపాడుతుందని చెప్పిందంటాడు. అంతేకాకుండా సత్యమే న్యాయాన్ని కలిగిస్తూ, ధర్మాన్ని కాపాడుతూ, ఉత్తములుగా ఉంచుతుందని, తద్వారా స్వర్గ ప్రాప్తి లభిస్తుందని వారికి హితబోధ చేస్తాడు.సదరు బోధనలకు ప్రభావితుడైన దొంగల ముఠామేస్త్రి తన తప్పులను గుర్తిస్తూ, పశ్చాతాపంతో పూర్తిగా మారిపోతాడు. ఇదే సత్యానికి ఉండే పవర్. సత్యాన్ని కలిగి ఉన్నవారు, పలికినవారు, నమ్మినవారు చరిత్రలో మహానుభావులుగా నిలిచిపోయారు. దీనికి విరుద్ధంగా ప్రవర్తించిన వారు చరిత్రహీనులుగా మిగిలిపోయారు. సత్యమును మించిన ధర్మము లేదు. సత్యము పలికే వారిని లోకం గౌరవిస్తుంది.వారికి భయపడుతుంది కూడా! హరిశ్చంద్రుడు సత్యానికే కట్టుబడి అనేక కష్టాలను అనుభవించినా అఖండమైన కీర్తిని పొందాడు.సమాజం సత్యవంతులను ఎంతగా గౌరవిస్తుందో, అబద్ధాలాడే వారిని అంతే హీనంగా చూస్తుంది. సకల మతాలు, శాస్త్రాలు, సత్యమును గూర్చి ఉన్నతంగా చెబుతాయి. సత్యం ఉన్నచోట ప్రేమ,కరుణ, ధర్మం, ఆప్యాయతలు ఉంటాయి.అబద్ధాలు ఉండే చోట అల్లర్లు, గొడవలు, అభండాలు, చిల్లర వ్యవహారాలుంటాయి. సత్యము సదా గౌరవాన్ని ఇస్తుంది. వ్యవస్థలను సరైన మార్గంలో ఉంచుతూ, అభివృద్ధి పథంలో నిలుపుతూ, విజయాన్నందిస్తుంది. సత్యమేవ జయతే కనుక సత్యాన్ని పాటిద్దాం!

**డాక్టర్ యం. ప్రభుదయాల్**
**మాజీ సెనెట్ మెంబర్ – కాకతీయ యూనివర్సిటీ జీవిత సభ్యుడు,**
**ఐఏటిఈ**
**మండల విద్యాశాఖాధికారి –'కొత్తగూడెం.**

# ఈబీసీ రిజర్వేషన్లు సాధించాల్సిందే!



2021లో జీవో నెంబర్ 33 ద్వారా అగ్రకుల పేదల(ఈడబ్ల్యూఎస్)కు తెలంగాణ ప్రభుత్వం 10 శాతం రిజర్వేషన్లు కల్పించడం ఒకరికి మోదం మరొకరికి ఖేదం అన్నట్టయింది.తమిళనాడులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు కలిపి 69 శాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈడబ్ల్యూఎస్ వర్గాలకు 10 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నట్టే..తెలంగాణలోని ఈబీసీలకు కూడా రిజర్వేషన్లు వర్తింపజేయడం అత్యంత అవశ్యకం. కేంద్ర ప్రభుత్వంతో పోరాడి ఈబీసీ రిజర్వేషన్లను సాధించాల్సిన బాధ్యత కాంగ్రెస్ సర్కార్‌పైనే ఉన్నది.

10 శాతం అగ్రకుల రిజర్వేషన్ల విషయం కనుమరుగు కావడానికే ప్రస్తుతం ఓబీసీ వర్గీకరణను కేంద్రం తెరపైకి తీసుకొచ్చింది.

56 శాతం మంది ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లు మాత్రమే అమలవుతున్నాయి. ఈ నేపథ్యంలో 'మేమెంతో మాకంతా'నినాదంతో రిజర్వేషన్ ఉద్యమం మళ్లీ ఉవ్వెత్తున ఎగిసిపడటం తథ్యం.103వ రాజ్యాంగ సవరణ ద్వారా 2019 జనవరి 12న ఈడబ్ల్యూఎస్ వర్గాలకు 10 శాతం రిజర్వేషన్లు అమల్లోకి వచ్చాయి. లోక్‌సభలో 323 –3 ఓట్ల తేడాతో, రాజ్యసభలో 165 –7 తేడాతో ఈ బిల్లు ఆమోదం పొందింది. అయితే ఆ సమయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాలకు చెందిన పార్లమెంట్ సభ్యుల్లో ఒక్కరూ నోరు మెదపలేదు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 15లో ఇప్పటికే ఉన్న 5 నిబంధనలకు అదనంగా మరో నిబంధనను చేర్చిన కేంద్రం ఎస్సీ, ఎస్టీ, బీసీలను వంచించింది. 15(6)ఏ లో ప్రస్తావించిన వర్గాలకు కాకుండా ఆర్థికంగా బలహీనంగా ఉన్న వర్గాల అభ్యున్నతికి ప్రత్యేక చర్యలు తీసుకునే వెసులుబాటు దీని ద్వారా ప్రభుత్వానికి కలిగింది. నిబంధన (బీ) ప్రకారం.. ఎయిడెడ్, అన్ ఎయిడెడ్ విద్యాసంస్థల్లో ఆర్థికంగా బలహీనవర్గాలకు 10 శాతం రిజర్వేషన్ కల్పించాలి. 16(6)లో 4వ నిబంధనలో పేర్కొన్న వర్గాలకు కాకుండా అదనంగా ఈబీసీ వర్గాలకు కేటాయించాలని పేర్కొన్నారు. 16(4)లో ప్రభుత్వ ఉద్యోగాల్లో సరైన ప్రాతినిధ్యం లేని సామాజికవర్గాల వారికి రిజర్వేషన్లు కల్పించాలని ఉంది. కానీ, కొత్త క్లాజులో ప్రభుత్వ ఉద్యోగాల్లో సరైన ప్రాతినిధ్యం లేని సామాజిక వర్గాలు అనే మాటను తొలగించారు.రాజ్యాంగంలో 340 అధికరణం వెనుకబడిన తరగతులకు, 341 షెడ్యూల్డ్ కులాలకు, 342 షెడ్యూల్డ్ తెగలకు సంబంధించిన పరిస్థితులను అధ్యయనం చేయడానికి అవకాశం కల్పిస్తుంది. ఈ అధికరణంలో పేర్కొన్న వర్గాలకు మినహా మరే ఇతర వర్గాలకు రిజర్వేషన్ల హక్కు కల్పించడమంటే కులాన్ని శాశ్వతీకరించి అగ్రకులాలు మరింత ఉన్నతంగా వర్ధిల్లేందుకు తోడ్పడటమే. సామాజిక వెనుకబాటుతనాన్ని రూపుమాపి సమానత్వాన్ని సాధించడానికి ఎన్నుకున్న మార్గమే రిజర్వేషన్లు. కులాల మధ్య ఉన్న సామాజిక అసమానతలను తొలగించడానికి సామాజికంగా వెనుకబడిన వర్గాలకు మన రాజ్యాంగం రిజర్వేషన్ సౌకర్యం కల్పించింది. అంతేతప్ప, ఆర్థిక వెనుకబాటుతనానికి కాదు. ఆర్థిక వెనుకబాటుతనాన్ని రూపుమాపాలంటే సంక్షేమ పథకాలు అమలు చేయాలి. రిజర్వేషన్లు అనేవి ఒక సంక్షేమ పథకం కాదు.1953 జనవరి 20న కాకా కాలేల్కర్ నేతృత్వంలో 11 మంది సభ్యులతో కూడిన కమిషన్‌ను అప్పటి రాష్ట్రపతి నియమించారు. ప్రభుత్వానికి ఈ కమిషన్ పలు సూచనలు చేసింది. దేశంలోని ఏ వర్గానికి చెందినవారైనా సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం ఆయా వర్గాలను నిర్ధారించడం, ఆయా వర్గాల జాబితాను తయారు చేయడం. సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన సామాజికవర్గాల జీవన స్థితిగతులను, వారి సమస్యలను అర్థం చేసుకొని ఆ స్థితిగతులను మెరుగుపరచడానికి అవసరమైన చర్యలను సూచించడం.సైన్స్, ఇంజినీరింగ్, మెడిసిన్, అగ్రికల్చర్, వెటర్నరీ, ఇతర టెక్నికల్ కోర్సులు, సంబంధిత విద్యాసంస్థల్లో వెనుకబడిన వర్గాలకు 70 శాతం రిజర్వేషన్లు కల్పించడం. సీట్ల కేటాయింపుల్లో అత్యంత వెనుకబడినవర్గాల పిల్లలకు ముందు ప్రాధాన్యత ఇవ్వడం. ప్రభుత్వ ఉద్యోగాలనేవి ప్రజలకు ఒక రకమైన సామాజిక హోదా, గుర్తింపు, విలువ, అధికారం, వేతనాలు, ఆర్థిక, ఉద్యోగపరమైన భద్రత కల్పిస్తాయి. కాబట్టి, వారికి రిజర్వేషన్లు కల్పించడం. స్థానిక సంస్థల సర్వీసుల్లో వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు ఉండాలని కమిషన్ సూచించింది. ఈ కమిషన్ తన నివేదికను 1955 మార్చి 30న నాటి రాష్ట్రపతికి సమర్పించింది. ఆ తర్వాత వెనుకబడిన తరగతుల రిజర్వేషన్ల కోసం రెండో కమిషన్ ఏర్పాటైంది.

1979లో అప్పటి ప్రధాని మొరార్జీ దేశాయ్ నేతృత్వంలోని జనతా ప్రభుత్వం మండల్ కమిషన్‌ను నియమించింది. సాంఘిక, ఆర్థిక, విద్యాపరమైన 11 సూచికల ఆధారంగా వెనుకబాటుతనాన్ని మథించేందుకు పనిచేసిన ఈ కమిటీకి బీపీ మండల్ నేతృత్వం వహించారు. 1980 డిసెంబరు 31 నాటికి మండల్ కమిషన్ తన నివేదికను సమర్పించింది. కులం, ఆర్థిక, సామాజిక అంశాల ఆధారంగా 1980 నాటికి దేశ జనాభాలో 52 శాతం మంది ఓబీసీలు (ఇతర వెనుకబడ్డ కులాలు) ఉన్నట్టు గుర్తించింది. ఓబీసీలకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లోనూ, పబ్లిక్ సెక్టార్ సంస్థల్లోనూ 27 శాతం రిజర్వేషన్లు కల్పించాలని మండల్ కమిషన్ సిఫారసు చేసింది. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లకు ఈ 27 శాతాన్ని కలిపితే మొత్తం రిజర్వేషన్లు 49 శాతానికి చేరతాయి.10 శాతం అగ్రకుల రిజర్వేషన్ల విషయం కనుమరుగు కావడానికే ప్రస్తుతం ఓబీసీ వర్గీకరణను కేంద్రం తెరపైకి తీసుకొచ్చింది. 56 శాతం మంది ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లు మాత్రమే అమలవుతున్నాయి. ఈ నేపథ్యంలో 'మేమెంతో మాకంతా' నినాదంతో రిజర్వేషన్ ఉద్యమం మళ్లీ ఉవ్వెత్తున ఎగిసిపడటం తథ్యం.

## రామచరిత మానస్

భక్తి



'శ్రీరామనామం సుధా మధురం' అంటారు భక్తులు. భక్తిపూర్వకంగా రామరసాన్ని ఆస్వాదించాలని సదాశివ బ్రహ్మేంద్రులు చెబుతారు. కదళి, ఖర్జూర ఫలాల కన్నా రామనామం ఎంతో రుచి అని కీర్తించాడు రామదాసు. రామభక్తి మనోజ్ఞమే కాక భవ సాగరాన్ని దాటించే తారక మంత్రమనీ భావిస్తారు సాధకులు. అనంత రామభక్తితో సుందర సాహిత్యాన్ని, మధుర సంగీతాన్ని సృజించిన మహానుభావులు ఎందరో ఉన్నారు.

శ్రీరాముడికి ప్రథమ భక్తుడు భరతుడు– అని ఆధ్యాత్మిక రామాయణం చెబుతోంది. మరో సోదరుడు లక్ష్మణుడు ఎప్పుడూ శ్రీరాముడి వెన్నంటి ఉన్నాడు. రామబంటుగా పేరొందిన మహావీరుడు హనుమ. వారందరూ సదా రాముణ్నే ధ్యానించి తరించారు. అదే బాటలో మరెందరో రామభక్తితో చరించారు. వారు రసవత్తర రీతిలో రామాయణం రచించారు. కబీర్‌దాసు, తులసీదాసు, సూరదాసు, సుందరదాసు వంటి సాధకులు ఎన్నో గీతాలు, వచనాలు వెలయించారు. తులసీదాసు రాసిన రామచరిత మానసం, జానకీ మంగళం, హనుమాన్ చాలీసా వంటివి ఎంతో ప్రాచుర్యాన్ని పొందాయి.

వాల్మీకి రామాయణం తరవాత తిరిగి అంతటి ప్రాచుర్యం పొంది, భక్తులకు పారవశ్యం కలిగించే గ్రంథం– రామచరిత మానస్. ఈ గ్రంథ రచయిత తులసీదాసు. ఆయన ఇప్పటి ఉత్తర్ ప్రదేశ్‌లోని రాజపూర్ గ్రామంలో జన్మించాడు. ప్రాచీన హిందీకి రూపాంతరమైన అవధ్– ఆ ప్రాంతపు సామాన్య ప్రజల వాడుక భాష. అందులో భారతదేశ సంస్కృతి నిండిన సంప్రదాయ సాహిత్యాన్ని వెలయించాడు తులసీదాసు. ఆయన రామచరిత మానస్ నాలుగు పాదాల కవిత (చౌపాయి)గా సాగింది. రామాయణాన్ని హిందీ మూలంలో అందించిన తొలి కవి ఆయనే!

రామాయణం ఓ మహాగ్రంథం. దాని రచనా కార్యక్రమాన్ని రామరాజ్య రాజధాని అయోధ్యలో చేపట్టాడు తులసీదాసు. భగవంతుడి సగుణ సాకార తత్వాలు, గుణ ప్రభావ విశేషాలు, భక్తితత్వ రహస్యాలు– అన్నింటినీ సుందరమైన సరళ శైలిలో అందించాడాయన. రామచరిత మానసంలోని ప్రతి అక్షరమూ దివ్యమంత్ర సదృశమంటారు భక్తులు. ఆ గ్రంథాన్ని 'ఆశీర్వాత్మకం'గా వర్ణిస్తారు.శ్రీరాముడి కృపకు పాత్రుడైన మహాభక్తుడు తులసీదాసు. భగవంతుడి లీలల్ని తన గ్రంథంలో ఆయన అనుభవ పూర్వకంగా వర్ణించాడు. పరమేశ్వరుడి ఆజ్ఞానుసారం ఆ పుస్తకం రాశానని వెల్లడించాడు. మొదట సీతమ్మకు నమస్కరించి, గ్రంథరచన ప్రారంభించాడు. ఆమెను మహాశక్తి స్వరూపిణిగా భావించి, 'ఉద్భవ స్థితి కారిణి'గా స్తుతించాడు.శివధనుర్భంగం గురించి తులసీదాసు విలక్షణంగా అభివర్ణిస్తాడు.

ఆ ధనుస్సులో ఇతర రాజుల దురభిమానం, పరశు రాముడి అహంకారం కలగలిసి ఉన్నాయని; అటువంటిదాన్ని రాముడు అవలీలగా విరిచాడని విలక్షణమైన రీతిలో వ్యాఖ్యానిస్తాడు. వాల్మీకి రామాయణానికి రామచరిత మానసం యథాతథ అనువాదం కాదు. మూలకథను ఏ మాత్రం మార్చకుండా, భక్తితత్వాన్ని రంగరించి రాసిన గ్రంథం అది. తులసీదాసు అద్భుత రచనా శైలికి అదొక నిదర్శనం.

## పంచదారకు బదులుగా...



చలికాలంలో తరచుగా వచ్చే ప్రత్యేక సందర్భాల కోసం తీపి పదార్థాలు వండుతుంటాం. వీటిలో చాలావరకూ పంచదారనే ఉపయోగిస్తాం. ఇది ఆరోగ్యానికి మంచిది కాదు. పంచదారకు బదులు ఏమి వాడవచ్చో తెలుసుకుందాం!తేనె:ఇది సహజంగా లభించే తీపి పదార్థం. దీనిని సంప్రదాయ తీపి వంటకాలతోపాటు కేకులు, కుకీలు, పేస్ట్రీల తయారీలో వాడవచ్చు. తేనెలోని విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు కలిసి శరీరానికి తక్షణ శక్తిని అందిస్తాయి. ముడి తేనె వాడుకోవడం మంచిది.

బెల్లం:దీనిని చెరకు లేదా తాటి రసంతో తయారు చేస్తారు. రెండూ ఆరోగ్యానికి మంచివే. వీటిలో ఐరన్ అధికంగా ఉంటుంది. నువ్వుల లడ్డూలు, క్యారెట్ లేదా గాజర్ హల్వా, పుడ్డింగ్‌ల తయారీలో బెల్లాన్ని వాడడం మంచిది.

ఖర్జూరాలు..కేక్, కుకీల తయారీలో ఖర్జూరం సిరప్... ఖీర్, పాయసం, హల్వా, డ్రైఫ్రూట్ లడ్డూల తయారీలో ఖర్జూరం పేస్ట్.... వాడుకోవచ్చు. ఖర్జూరంలో ఉండే పొటాషియం రక్తంలో చక్కెర స్థాయి పెరగకుండా నిరోధిస్తుంది.

కొబ్బరి చక్కెర..దీనిని కొబ్బరి చెట్టు పూల మొగ్గల కాండం స్రవించే రసం నుంచి తయారు చేస్తారు. దీనిలో గ్లైసెమిక్ ఇండెక్స్ శాతం చాలా తక్కువ. మామూలు పంచదారలో కంటే 400 రెట్లు అధికంగా పొటాషియం ఉంటుంది. కొబ్బరి చక్కెరలో అత్యధికంగా ఉండే సుక్రోజ్... కొవ్వుగా మారదు. పాయసం, లడ్డూలు, మఫిన్ల తయారీకోసం కొబ్బరి చక్కెరను నిరభ్యంతరంగా ఉపయోగించుకోవచ్చు.

మాపుల్ ద్రావణం..దీనిని మాపుల్ చెట్ల కాండం నుంచి తయారు చేస్తారు. ఇది బంగారం రంగులో ప్రత్యేకమైన రుచితో ఉంటుంది.


నవభూమి

www.navabhoomi.in
www.epaper.navabhoomi.in

5 హైదరాబాద్ మంగళవారం 07 । జనవరి । 2025


# పచ్చదనానికి ప్రాణం

మట్టిలో వేసిన విత్తు మొలకెత్తి శాఖోపశాఖలుగా విస్తరించి మహావృక్షమవుతుంది. అదే విత్తుని యువత మెదళ్లలో నాటితే? పచ్చదనం...పర్యావరణం, సాధికారత అనే ఆలోచనల్ని విత్తనాలుగా చేసి పర్యావరణ పరిరక్షణ, అభివృద్ధి ఉద్యమానికి శ్రీకారం చుట్టారు జయశ్రీనాయర్, సువర్ణా భట్. మహిళలకు ఉపాధి నైపుణ్యాలతో మొదలుపెట్టి పచ్చదనానికి ప్రాణం పోస్తున్న వారికీ ఆలోచన ఎందుకు వచ్చిందో వివరిస్తున్నారు జయశ్రీ...



నిన్ననే... హైదరాబాద్ కుషాయిగూడలోని ఎన్ఎస్ఐసీ (నేషనల్ స్మాల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్) ప్రాంగణంలో మా కార్యక్రమాన్ని నిర్వహించాం. మొక్కలతో.. చిన్నారులూ, యువతతో ఆ క్యాంపస్ మొత్తం పచ్చగా కళకళ్లాడిపోయింది. మాతోపాటూ అక్కడకు వచ్చిన పిల్లలంతా 'మొక్కలని కాపాడుకుంటే మన భవిష్యత్తుని కాపాడుకున్నట్టే' అంటూ మనస్ఫూర్తిగా నినాదాలు చేశారు. అంతటితో సరిపెట్టుకోలేదు.. కలబంద, తులసి వంటి ఆయుర్వేద మొక్కల్ని ఇష్టంగా నాటారు. పచ్చదనాన్ని కాపాడతామని ప్రతిజ్ఞ చేశారు. మీరనుకోవచ్చు.. ఇలా ఎంతో మంది ర్యాలీలు చేస్తారు. ఆ తర్వాత చేతులు దులుపుకుంటారులే అని. కానీ మా ప్రయత్నం అలాంటిది కాదు. ఏడాదిగా కరవును ఎదుర్కొనే విధానాలపై నేను పరిశోధన చేస్తున్నా. అందులో భాగంగా పచ్చదనాన్ని ప్రోత్సహించేలా 'మృత్తిక' అనే కార్యక్రమాన్ని ప్రారంభించాను. మృత్తిక లక్ష్యం... కనీసం పదివేల మొక్కలు నాటాలని. మొట్టమొదటగా ఎన్ఎస్ఐసీ యాజమానాన్ని సంప్రదించాను. వాళ్లనే ఎందుకు అంటే... ఇక్కడ పచ్చదనానికి ప్రాధాన్యం ఎక్కువ. మొక్కల సంరక్షణ బాధ్యతని చిత్తశుద్ధితో చేస్తారు. అందుకే వారితో మాట్లాడి వెయ్యి మొక్కల్ని ఆ ఆవరణలో నాటాం. అయితే ఇదే మా మొదటి కార్యక్రమం కాదు.

**మహిళలకూ చేయూత....**

నాలుగేళ్ల కిత్రమే సిన్సోల్ ఇండియా అనే సంస్థను ప్రారంభించాను. దానిలో భాగమే 'నిపుణ'. గ్రామీణ ప్రాంతాల మహిళలు ఉపాధి పొందేందుకు వీలుగా కుట్టూ, సృజనాత్మక కళల్లో అంటే ఆభరణాల తయారీ, జ్యూట్‌బ్యాగుల తయారీలో వారికి శిక్షణ ఇస్తున్నాం. అలాగే ఉపాధి కోసం వారు పట్టణాలకు వలస రావాల్సిన అవసరం లేదు. వారున్న చోటే ఈ పనులన్నీ నేర్చుకోవచ్చు. మేం వాటికి మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తాం. మొదట్లో ముడిసరుకు కూడా కొనుక్కోవడానికి ఆర్థికదన్ను లేని మహిళలకు కొన్ని నెలల పాటూ అవసరమైన పెట్టుబడిని కూడా అందించాను. ప్రస్తుతం వారంతా తాము తయారు చేసిన వస్తువులను మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా అమ్ముతున్నారు. ఈ మృత్తిక కార్యక్రమంలో మరో కీలక భాగస్వామి... సువర్ణ. 'వి ఎంపవర్ ట్రస్ట్' అనే సంస్థను నిర్వహిస్తోంది సువర్ణ.

ఈ సంస్థ కూడా మహిళలకు ఉపాధి మెలకువలు అందిస్తుంది. అలాగే 'సెకండ్ ఇన్నింగ్స్' పేరుతో పిల్లలు పుట్టిన తర్వాత కూడా మహిళలు పోటీ ప్రపంచంలో ముందుకు దూసుకుపోయేలా వారికి శిక్షణ ఇస్తోంది. పంచతంత్ర కన్సల్టెన్సీ పేరుతో పర్యావరణానికి హాని చేయని నిర్మాణాలకు కావాల్సిన ప్లానింగ్ ఇస్తుంటుంది. ప్రస్తుతం చర్లపల్లిలో నిర్మిస్తున్న ఓపెన్ ఎయిర్ జైలు ఆవరణలో నిర్మిస్తున్న ఆయుర్వేద విలేజ్ ఆలోచనకు తనూ ఓ కారణమే. తనకీ మొక్కల పెంపకం పట్ల ఆసక్తి ఎక్కువ. ఆయుర్వేద మొక్కలంటే ప్రాణం. పర్యావరణం గురించి ఇద్దరికీ ఒకేరకం అభిప్రాయాలు ఉండటంతో 'మృత్తిక'లో భాగంగా ఈ మొక్కల పెంపకం ఉద్యమానికి శ్రీకారం చుట్టాం.




# బ్లౌజ్ మేనియా!



పండగ వచ్చిందంటే కొత్త ట్రెండ్స్ కోసం మహిళలందరూ ఎదురుచూస్తూ ఉంటారు. ఈ పండగకు రకరకాల బ్లౌజ్ డిజైన్లు మార్కెట్లోకి ప్రవేశించాయి. ఆ డిజైన్స్ ఏమిటో.. అవి ఎలాంటి చీరలపై ధరించటానికి పనికొస్తాయో చూద్దాం..

**మిర్రర్ వర్క్ బ్లౌజ్‌లు**

బ్లౌజ్‌లపై అద్దాలను కుట్టడం ఒకప్పటి ఫ్యాషన్. మళ్లీ అది ఒక ట్రెండ్‌గా మారింది. ఈ బ్లౌజ్‌లను చీరలపైనే కాకుండా లెహంగాలపై కూడా వేసుకోవచ్చు. ఈ బ్లౌజ్‌లు కుట్టించుకోవటానికి అనువైన బ్లైజ్ పీస్‌లు మార్కెట్లో అందుబాటులో లభిస్తున్నాయి.

**డోరీ బ్లౌజ్**

పార్టీలకు వెళ్లినప్పుడు- అందరిని ఆకర్షించటానికి వేసుకొనే బ్లౌజ్ ఇది. దీనిని ఏ చీర మీద ధరించినా బావుంటుంది.

**ఫుల్ స్లీవ్ బ్లౌజ్**

ఈ బ్లౌజ్ వేసుకుంటే హుందాతనం దానంతట అదే వచ్చేస్తుంది. వీటిని చీరలపైనే కాకుండా లెహంగాలపై కూడా ధరించవచ్చు. కొందరికి చేతులపై చిన్న చిన్న మచ్చలు ఉంటాయి. ఇలాంటి వారు ఈ బ్లౌజ్‌లను ధరిస్తే మచ్చలు బయటకు కనిపించవు. ''

**కటౌట్ బ్లౌజ్**

నైట్ పార్టీలకు ఎక్కువ మంది ఈ డిజైన్‌ను ఎంపిక చేసుకుంటారు. ఈ బ్లౌజ్ వేసుకుంటే శరీరాకృతి స్పష్టంగా కనిపిస్తుంది.'

**స్వీట్‌హార్ట్ బ్లౌజ్**

ప్రస్తుతం ట్రెండింగ్‌లో బ్లౌజ్ డిజైన్ ఇది. దీనిపై రకరకాల పూసలు వేసి కుట్టడం కూడా ఒక ఫ్యాషన్‌గా మారింది. ఇది వయస్సు పైబడిన వారికి కాకుండా అమ్మాయిలకు ఎక్కువగా నప్పుతుంది.

**స్పగాటీ స్ట్రాప్ బ్లౌజ్**

ఈ మధ్యకాలంలో చీరలను కూడా రకరకాల పద్ధతులు కడుతున్నారు. వీటికి కొత్త ఫ్యాషన్ ట్రెండ్స్‌ను జోడిస్తున్నారు. ఇలాంటి చీరలకు ఈ స్పగాటీ స్ట్రాప్ బ్లౌజ్ నప్పుతుంది.

# సూపర్ ఉమన్ లిల్లీసింగ్!



మూడో తరగతి చదివే చిన్నారికి 'ద రాక్ డ్వేన్' అంటే.. బెడ్‌రూంలో కటౌట్ పెట్టుకునేంత ఇష్టం. దీంతో అంతా తనని రాక్ సింగ్ అని పిలిచేవారు. డ్వేన్‌ను సూపర్‌మ్యాన్‌గా భావించిన ఆ చిన్నారి.. తనని సూపర్ ఉమన్‌గా ఊహించుకుంది. తన ఊహ అక్కడితో ఆగిపోలేదు. తనతోనే పెరిగి పెద్దై నేడు సూపర్ ఉమన్ లిల్లీసింగ్ గా ఎదిగింది. కామెడీ కంటెంట్ వీడియోలను యూట్యూబ్‌లో పోస్టు చేస్తూ సోషల్ మీడియా స్టార్‌గానే గాక, కోట్లమంది ఫాలోవర్స్‌తో ప్రపంచంలోనే పాపులర్ యాక్టర్, ర్యాపర్, వ్లాగర్‌గా మంచి గుర్తింపు తెచ్చుకుంది.

కెనడాలో స్థిరపడిన పంజాబీ దంపతులు సుఖ్విందర్ సింగ్, మల్విందర్ సింగ్‌ల రెండో సంతానంగా 1988 సెప్టెంబర్ 26న ఒంటారియాలోని స్కార్‌బరోలో లిల్లీ సైనీ సింగ్ పుట్టింది. లిల్లీకి నీనా అనే అక్క ఉంది. స్కార్‌బరోలోనే విద్యనభ్యసించిన లిల్లీ... యార్క్ యూనివర్సిటీలో సైకాలజీలో డిగ్రీ చదివింది. డిగ్రీలో ఉండగా లిల్లీ భాంగ్రా నృత్యాన్ని నేర్చుకుంది.

**సూపర్ ఉమన్..**

డిగ్రీ పూర్తయ్యాక కలెక్షన్స్ ఏజెన్సీలో ఉద్యోగంలో చేరినప్పటికి, అది తనకి నచ్చకపోవడంతో.. జాబ్ వదిలేసి 2010లో 'సూపర్ ఉమన్' పేరిట యూట్యూబ్ ఛానల్‌ను ప్రారంభించింది. కామెడీ, ఫన్నీ వీడియోలు రూపొందించి తన ఛానల్‌లో పోస్టుచేసేది. పురుషులపై ప్యారడీ, తన తల్లిదండ్రులు, ఇంకా ఇతర కుటుంబ సభ్యులను అనుకరిస్తూ లిల్లీ చేసే కామెడీని ఎక్కువమంది లైక్ చేసేవారు. లిల్లీ చేసిన తొలి వీడియో 'అఫీషియల్ గైడ్ టు బ్రౌన్ గార్ల్స్'లో భారతీయ సంప్రదాయ దుస్తులు వేసుకుని వ్యంగ్యం, కామెడీలతో హాస్యాన్ని రక్తికట్టించడంతో బాగా వైరల్ అయింది. దీంతో లిల్లీ ఛానల్‌ను ఫాలో అయ్యేవారి సంఖ్య కోటి దాటింది. ఈ ఉత్సాహంతో 'సూపర్ ఉమన్ వ్లాగ్స్' పేరిట రెండో యూట్యూబ్ ఛానల్‌ను క్రియేట్ చేసింది. ఈ ఛానల్‌లో తన డైలీ రొటీన్ యాక్టివిటీ వీడియోలు పోస్టు చేసేది.

**ఫోర్బ్స్ టాప్‌టెన్‌లో..**

లాస్ ఏంజిల్స్‌కు మకాం మార్చి తన వీడియోలతో రాకెట్‌లా దూసుకుపోయి కోటిన్నరకు పైగా సబ్‌స్క్రైబర్స్‌తో 10.5 మిలియన్ డాలర్లను సంపాదించి 2017లో ఫోర్బ్స్ అత్యధిక ఆదాయం కలిగిన యూట్యూబ్ స్టార్స్ టాప్ టెన్‌లో లిల్లీ సింగ్ నిలిచింది. తన ప్రతిభతో అనేక అవార్డులు అందుకుంది.

**మంచినటిగానూ...**యూట్యూబర్‌గా బిజీగా ఉంటూనే హాలీవుడ్ బాలీవుడ్ సినిమాల్లో నటించింది. 'డాక్టర్ క్యాబీ', బాలీవుడ్ సినిమా'స్పీడీ సింగ్స్, థ్యాంక్యూలలో నటించగా, బబుల్స్ అండ్ మిస్టీ అనే యానిమేటెడ్ సినిమాకు గాత్రం అందించింది. తరువాత హాలీవుడ్ సినిమా ఐస్ ఏజ్: కొలిజన్ కోర్స్', 'బ్యాడ్ మామ్స్‌లో నటించింది. ఓ పంజాబీ సాంగ్‌ను ర్యాప్ చేసి పాడడంతో బాలీవుడ్ సినిమా గులాబ్ గ్యాంగ్‌లో పెట్టారు. కాగా అనేక సామాజిక అంశాలపై స్పందించే లిల్లీ సింగ్ ఈ ఏడాది జరిగిన గ్రామీ అవార్డ్స్ ఈవెంట్‌లో 'ఐ స్టాండ్ విత్ ఫార్మర్స్' అని రాసి ఉన్న మాస్క్ ధరించి ఇండియాలో రైతులు చేస్తున్న ఉద్యమానికి మద్దతు తెలిపింది.

**ఎ లిటిల్ లేట్ విత్ లిల్లీసింగ్...**నిర్విరామంగా వీడియోలతో అలరించిన లిల్లీసింగ్ 2018 నవంబర్‌లో "గత ఎనిమిదేళ్లుగా మానసికంగా, శారీరకంగా అలసిపోయాను. కొద్దిరోజులు వీడియోలు చేయలేను" అని చెప్పి కొద్దికాలం బ్రేక్ తీసుకుంది. తర్వాత 2019లో "నేను 'బైసెక్సువల్‌ని' అని ట్వీట్ చేసి సంచలనం సృష్టించింది. ఈ విషయాన్ని కొందరు విమర్శిస్తే, మరికొందరు ఆమె నిజాయితీని మెచ్చుకున్నారు. ఇదే ఏడాది కార్సన్ నిర్వహించే ఎన్‌బీసీ షోను లిల్లీ సింగ్ చేపట్టి, అర్ధరాత్రి ఒంటిగంటకు ప్రసారమయ్యే 'ఎ లిటిల్ లేట్ విత్ లిల్లీసింగ్'కు వ్యాఖ్యాతగా మారింది. దీంతో లేట్ నైట్ షోకు హోస్ట్‌గా వ్యవహరిస్తున్న తొలి మహిళగా లిల్లీసింగ్ నిలిచింది. కాగా ఈ షోను ఈ ఏడాది ముగిస్తున్నట్లు ఎన్‌బీసీ ప్రకటించింది.చివరి ఎపిసోడ్ జూన్ 3న ప్రసారం కానుంది. **సహాయ మీడియా**

# కలలు కూలిపోయాయి.. స్థైర్యం నిలబెట్టింది!



ఉత్సాహం పరవళ్లు తొక్కడం అంటే ఏంటో మరియాను చూస్తే తెలుస్తుంది. పదిమందికీ సేవ చేయాలంటే వైద్యవిద్య చదవాలని చిన్నప్పుడే నిర్ణయించుకుంది తను. కలల సాకారం దిశగా అడుగులు వేస్తున్న ఆ అమ్మాయిని విధి చక్రాల కుర్చీకి పరిమితం చేసింది. మరియా బెదరలేదు... కష్టాలను ధిక్కరిస్తోంది... విధిని వెక్కిరిస్తోంది...

**కలలు కూలిపోయాయి.. స్థైర్యం నిలబెట్టింది!**

కొచ్చిలో ఓ మధ్యతరగతి కుటుంబం మరియా బిజు వాళ్లది. నాన్న పీటర్ వ్యాపారి. అమ్మ సునీ గృహిణి. పేదలకు అమ్మానాన్నలు చేసే సాయం చూశాక తనూ తోటివారికి తోడ్పడాలనుకుంది. ఇందుకు డాక్టర్ అవ్వడమే మంచి మార్గమని నిర్ణయించుకుంది. ఇంటర్ తర్వాత మెడిసిన్ ప్రవేశ పరీక్షలో మంచి ర్యాంకు సాధించి తొడుపుళా అఘర్ మెడికల్ కాలేజీలో చేరింది. ఎప్పుడూ చలాకీగా, ఉత్సాహంగా ఉండే మరియా కొద్ది రోజుల్లోనే 'చాలా చురుకైన అమ్మాయి'గా పేరు తెచ్చుకుంది. రోజులు ఇంతే హాయిగా సాగిపోయి ఉంటే బాగానే ఉండేది. కానీ హాస్టల్‌లో ఉండి చదువుకుంటున్న ఆమె జీవితం అనుకోని మలుపు తిరిగింది. ఆ రోజు జూన్ 5, 2016. వర్షం వస్తోందని ఆరేసిన దుస్తులు తెచ్చుకోవడానికి బాల్కనీలోకి వెళ్లింది. అప్పటికే ఆ చోటంతా వర్షపు నీటితో నానిపోయి ఉంది. చీకట్లో అది గమనించలేకపోయింది. రెండో అంతస్తులో ఉన్న ఆ బాల్కనీ నుంచి జారి కింద పడిపోయింది. రక్తపు మడుగులో అచేతనంగా ఉన్న ఆమెని ఆసుపత్రికి తరలించారు. చేతులు, ముఖం, కాళ్లు, వెన్నెముకలకు ఫ్రాక్చర్లు అయ్యాయి. ఐసీయూ నుంచి బయటకు రావడానికే రెండు నెలలు పట్టింది. వెన్నెముక గాయం కారణంగా చక్రాల కుర్చీకే పరిమితమవ్వాలని తెలిసి కుప్ప కూలిపోయింది మరియా. 'నా నడుం కింద నుంచి శరీరం మొత్తం చచ్చుబడి పోయింది. పట్టుమని పదినిమిషాలు కూడా ఒక చోట ఉండటానికి ఇష్టపడని నేను ఇలా కదల్లేని స్థితికొస్తానని అనుకోలేదు. తల్చుకుంటే భరించలేని దుఃఖం ఆవరించేది. అమ్మానాన్న ధైర్యం చెప్పడంతో కోలుకోవడం మొదలుపెట్టా. వరసగా చాలా సర్జరీలు జరిగాయి. ఆసుపత్రి నుంచి బయటకు రావడానికి నాలుగు నెలలు పట్టింది. అప్పటి నా మానసిక స్థితి చూసి వెల్లూరు రిహాబిలిటేషన్ సెంటర్‌లో చేర్చారు. తర్వాత పరిస్థితిలో కొద్దిగా మార్పు వచ్చింది. నా అంతట నేను బ్రష్ చేసుకోవడం, చెంచా పట్టుకొని తినడం వంటి పనులన్నీ నేర్చుకున్నా. ఆ సమయంలో అమ్మ, నా తోబుట్టువులు నీడలా నాతోనే ఉండేవారు. నాలో నిండిన నిరుత్సాహం అమ్మ వల్ల కొంచెం కొంచెంగా దూరమైంది. డాక్టరు కావాలనే నా లక్ష్యానికి వైకల్యం అడ్డుకాకూడదనుకున్నా. తిరిగి చదువుకుంటా అంటే ఇంట్లో వాళ్లు ప్రోత్సహించార'ని గుర్తు చేసుకుంది మరియా.ప్రమాదం జరిగిన ఏడాది తర్వాత కాలేజీలో అడుగుపెట్టింది. చక్రాల కుర్చీలోనే క్లాసులకు వెళ్లేది. ఏదైనా రాద్దామంటే చేతివేళ్లు మొరాయించేవి. వాటిలో కదలిక తీసుకురావడం కోసం ఖాళీ సమయంలో చిత్రలేఖనాలు వేయడం, వయొలిన్ వాయించడం వంటి అభిరుచులతో ప్రయత్నించేది. వీటికి ఫిజియోథెరపీ కూడా తోడయ్యింది. చదువుల్లో తోటి విద్యార్థినులు ఆమెకు అండగా నిలిచారు. దాంతో మొదటి ఏడాది పరీక్షలకు సిద్ధమైంది. స్క్రైబ్ సాయాన్ని తీసుకోమన్నారు కాలేజీ నిర్వాహకులు. 'ఎంబీబీఎస్ పరీక్షలను ఆ కోర్సు చదివే విద్యార్థి మాత్రమే స్క్రైబ్‌గా పనికొస్తారు. అలా కుదరక పోయేసరికి నేనే రాద్దామని నిశ్చయించుకున్నా. కానీ చాలా కష్టమైంది. పెన్ పట్టుకొని రాయడానికి ఎంతో సాధన చేసేదాన్ని. వేళ్లు విపరీతంగా నొప్పి పెట్టేవి. నాలుగైదు గంటలు కష్టపడి సాధన చేసేదాన్ని. నెలరోజుల తర్వాత రాతపై పట్టుసాధించా. అలా ఆ ఏడాది పరీక్షలు రాసి పాసయ్యాను. నాలుగేళ్ల కోర్సును 64 శాతం మార్కులతో పూర్తి చేయగలిగా. నా కల సర్జన్ అవ్వాలని. శస్త్రచికిత్స చేయడానికి నా చేతివేళ్లను ఇంకా సిద్ధం చేసుకోవాలి. ఇటీవలే హౌస్‌సర్జన్‌గా చేరా. ప్రమాదం జరిగినప్పటి నుంచి అమ్మ నా నీడలా ఉంటూ సేవలు చేస్తోంది. తన రుణం తీర్చుకోవాలంటే నేను పేదలకు ఉచితంగా వైద్యం చేయాలి. నన్ను నేను నిరూపించుకుని, నాలాంటి వారికి నేనో ఉదాహరణగా ఉండాలన్నదే నా కల' అని చెప్పే మరియా తనకిష్టమైన బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్‌లను ఆడటంతోపాటు బొమ్మలూ చాలా చక్కగా వేస్తుంది. తన చిత్రలేఖనాలకు సోషల్‌మీడియాలో బాగా అమ్ముడు పోతూంటాయి. తన జీవితాన్నే పట్టుదలకు ప్రతిరూపంగా చూపుతూ యువతలో స్ఫూర్తినింపే వక్తగానూ మారింది.




# ఎంహెచ్‌పీవీ వైరస్ కలకలం.. స్టాక్ మార్కెట్లు క్రాష్..!



**న్యూఢిల్లీ-నవభూమి:**దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం భారీ నష్టపోయాయి. చైనాలో కొత్తగా వెలుగులోకి వచ్చిన హెచ్ఎంపీవీ వైరస్‌పై మరోసారి ఆందోళనలు వ్యక్తమవు తున్నాయి. మొన్నటి వరకు చైనాకే పరిమితమైన కేసులు భారత్‌లోనూ నమోదయ్యాయి. కర్నాటక, గుజరాత్ కేసులు రికార్డయ్యాయి. వైరస్ వ్యాప్తి నేపథ్యంలో దేశీయ మార్కెట్లు ఒక్కసారిగా కుదేలయ్యాయి. మదుపరులు అప్రమత్తంగా వ్యవహరించడంతో మార్కెట్లు భారీగా నష్టపోయాయి. పెట్టుబడిదారులు దాదాపు రూ.12లక్షల కోట్లకుపైగా సంపదను కోల్పోయారు. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్.. సోమవారం ఉదయం 79,281.65 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. మధ్యాహ్నం సెన్సెక్స్ 1200 పాయింట్లకుపైగా పతనమైంది. ఇంట్రాడేలో 79,532.67 పాయింట్ల గరిష్ఠాన్ని తాకిన సెన్సెక్స్.. కనిష్ఠంగా 77,781.62 పాయింట్లకు పడిపోయింది. చివరకు 1,258.12 పాయింట్లు తగ్గి.. 77,964.99 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 3 8 8 . 7 0 పాయింట్లు తగ్గి.. 23,616.05 వద్ద ముగిసింది. నిఫ్టీలో అత్యధికంగా నష్టపోయిన వాటిలో టాటా స్టీల్, ట్రెంట్, కోల్ ఇండియా, ఎన్‌టీపీసీ, బీపీసీఎల్ ఉన్నాయి. అయితే, అపోలో హాస్పిటల్స్, టాటా కన్స్యూమర్, టైటాన్ కంపెనీ, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ లాభపడ్డాయి. పీఎస్‌యూ బ్యాంక్ 4శాతం పతనమైంది. మెటల్, రియాల్టీ, ఎనర్జీ, పీఎస్‌యూ, పవర్, ఆయిల్, గ్యాస్ ఒక్కొక్కటి 3 శాతం చొప్పున క్షీణించాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 2.4 శాతం, స్మాల్ క్యాప్ ఇండెక్స్ 3 శాతం

## తమిళనాడు గవర్నర్ అసెంబ్లీ నుంచి వాకౌట్.. ఎందుకంటే?



**చెన్నై-నవభూమి:** తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి అసెంబ్లీ నుంచి వాకౌట్ చేశారు. జాతీయ గీతాన్ని అవమానించినట్లు ఆరోపించారు. అసెంబ్లీ సమావేశాల తొలి రోజు సంప్రదాయంగా సభ నుద్దేశించి ప్రసంగించేందుకు ఆయన నిరాకరించి వెళ్లిపోయారు. ఆ రాష్ట్రంలో శీతాకాల అసెంబ్లీ సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. సంప్రదాయం ప్రకారం సభ సమావేశమైనప్పుడు రాష్ట్ర గీతం తమిళ్ థాయ్ వాల్తు, సభ ముగిసిన తర్వాత చివరలో జాతీయ గీతం ఆలపిస్తారు. అయితే ఈ నిబంధన మార్చాలని గవర్నర్ రవి డిమాండ్ చేశారు. సభ ప్రారంభంలో కూడా జాతీయ గీతం ఆలపించాలని సభా నాయకుడైన సీఎం స్టాలిన్, స్పీకర్ ఎం అప్పావును కోరారు. వారు నిరాకరించడంతో గవర్నర్ రవి సభ నుంచి వాకౌట్ చేశారు. ఈ నేపథ్యంలో గవర్నర్ చదవాల్సిన సంప్రదాయ ప్రసంగాన్ని స్పీకర్ ఎం అప్పావు చదివి వినిపించారు.కాగా, అసెంబ్లీ నుంచి గవర్నర్ రవి వాకౌట్‌పై రాజ్‌భవన్ ఒక ప్రకటన విడుదల చేసింది. తమిళనాడు అసెంబ్లీలో భారత రాజ్యాంగం, జాతీయ గీతాన్ని మరోసారి అవమానించినట్లు ఆరోపించింది. 'జాతీయ గీతాన్ని గౌరవించడం మన రాజ్యాంగంలో పొందుపరిచిన మొదటి ప్రాథమిక విధి. అన్ని రాష్ట్రాల శాసనసభల ప్రారంభం, చివరిలో జాతీయ గీతాన్ని పాడతారు. ఇవాళ తమిళనాడు అసెంబ్లీ ప్రారంభంలో తమిళ గీతం మాత్రమే పాడారు. జాతీయ గీతం కూడా పాడాలన్న గవర్నర్ విన్నపాన్ని నిరాకరించారు. ఈ నేపథ్యంలో రాజ్యాంగాన్ని, జాతీయతను అగౌరవపరిచే విషయంలో గవర్నర్ తీవ్ర ఆందోళన చెంది సభ నుంచి వెళ్లిపోయారు' అని పేర్కొంది.మరోవైపు గత ఏడాది ఫిబ్రవరిలో కూడా గవర్నర్ రవి అసెంబ్లీ నుంచి వాకౌట్ చేశారు. ప్రసంగం ప్రతి పెద్దగా ఉందని ఆరోపించారు. అలాగే బీఆర్ అంబేద్కర్, పెరియార్, సీఎన్ అన్నాదురై పేర్లతో పాటు 'ద్రావిడియన్ మోడల్' అనే పదం, శాంతిభద్రతలకు సంబంధించిన ప్రసంగంలోని భాగాలను చదవడానికి ఆయన నిరాకరించి సభ నుంచి వెళ్లిపోయారు.

## హౌసింగ్ సెగ్మెంట్‌లో 46 శాతం పెరిగిన సంస్థాగత పెట్టుబడులు..!



**న్యూఢిల్లీ-నవభూమి:**రియల్ ఎస్టేట్ రంగంలో ప్రత్యేకించి ఇండ్ల నిర్మాణ పరిశ్రమలో సంస్థాగత పెట్టుబడులు పెరుగుతున్నాయి. 2023తో పోలిస్తే రియల్ ఎస్టేట్ రంగలో వృద్ధిరేటు 46 శాతం పెరిగిపోయింది. నివాస ఆస్తులకు గల డిమాండ్‌ను ఇన్వెస్టర్లు సొమ్ము చేసుకోవాలని భావిస్తున్నారని ప్రముఖ రియాల్టీ కన్సల్టెన్సీ సంస్థ కొల్లియర్స్ ఇండియా తెలిపారు. 2023లో ఇండ్ల నిర్మాణ పరిశ్రమలో సంస్థాగత పెట్టుబడులు 786.9మిలియన్ డాలర్లు. దీంతో పోలిస్తే 2024లో భారత రియల్ ఎస్టేట్ రంగంలో సంస్థాగత ఇన్వెస్టర్ల వాటా 22 శాతం వృద్ధి చెంది 6.5 బిలియన్ డాలర్లకు చేరుకున్నది. 2023లో 4.3 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఇన్వెస్టర్లు పెట్టారు. 2024లో మొత్తం పెట్టుబడులు 66 శాతం పెరిగాయి.ఇండస్ట్రీయల్ అండ్ వేర్ హౌసింగ్ సెగ్మెంట్‌లో 2024లో సంస్థాగత ఇన్వెస్టర్లు గరిష్టంగా 2.5 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టారు. 2023లో 877.6 మిలియన్ డాలర్ల పెట్టుబడులు మాత్రమే వచ్చాయి. ఆఫీస్ సెగ్మెంట్‌లో మాత్రం 23శాతం పెట్టుబడులు తగ్గాయి. గత ఐదేండ్లుగా రియల్ ఎస్టేట్ రంగంలోని అన్ని సెగ్మెంట్లలో డిమాండ్ ఎక్కువగా ఉండటంతో దేశీయ, అంతర్జాతీయ సంస్థాగత ఇన్వెస్టర్ల నుంచి పెట్టుబడులు పుంజుకున్నాయి. అంతర్జాతీయ స్థాయిలోనే రియల్ ఎస్టేట్‌లో భారత్ మొదటి స్థానంలో నిలిచింది.

## స్వల్పంగా తగ్గిన ధరలు.. నేటి బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయంటే..



**న్యూఢిల్లీ-నవభూమి:**బంగారం వెండి కొనుగోలు చేయాలనుకుంటున్నారా? నూతన సంవత్సరంలో బంగారం రేట్లలో హెచ్చు తగ్గులు కనిపిస్తున్నాయి. ఈ రోజు (డిసెంబర్ 6న) బంగారం ధరలు స్వల్పంగా తగ్గాయి. ఈ నేపథ్యంలో నేడు (డిసెంబర్ 6న) ఉదయం 6.30 గంటల సమయానికి 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. రూ. 78, 770కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. రూ. 72, 140కి చేరింది. ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ. 78, 850కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 72, 290కి చేరుకుంది. ఇక హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 78, 700కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 72, 140కి చేరింది. వెండి ధరలు కేజీకి వంద రూపాయలు తగ్గాయి. ఈ క్రమంలో దేశంలోని ప్రధాన నగరాల్లో ఉన్న బంగారం, వెండి రేట్లను ఇప్పుడు తెలుసుకుందాం.

దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం రేట్లు (10 గ్రాములకు) (24 క్యారెట్, 22 క్యారెట్)

హైదరాబాద్‌లో రూ. 78, 700, రూ. 72, 140
విజయవాడలో రూ. 78, 700, రూ. 72, 140
ఢిల్లీలో రూ. 78, 850, రూ. 72, 290
ముంబైలో రూ. 78, 700, రూ. 72, 140
వడోదరలో రూ. 78, 750, రూ. 72, 190
కోల్‌కతాలో రూ. 78, 700, రూ. 72, 140
చెన్నైలో రూ. 78, 700, రూ. 72, 140
బెంగళూరులో రూ. 78, 700, రూ. 72, 140
కేరళలో రూ. 78, 700, రూ. 72, 140
పుణెలో రూ. 78, 700, రూ. 72, 140

## 2025 హ్యూమన్ రిసోర్సెస్ పోకడలు: ఫ్యూచర్-రెడీ వర్క్‌ఫోర్స్ కోసం వ్యూహాత్మక మార్పులు

**న్యూఢిల్లీ-నవభూమి:** మనం 2024ని ముగించినప్పుడు, టాలెంట్ విభాగం పరిధి గణనీయమైన మార్పుకు లోనైంది అని స్పష్టంగా తెలుస్తుంది. హైబ్రిడ్ వర్క్ మోడల్స్‌కు నిరంతర అనుసరణ, ఉద్యోగుల శ్రేయస్సుపై పునరుద్ధరణ, సంస్థ వ్యాప్తంగా కృత్రిమ మేధస్సు , ఆటోమేషన్‌కు సంబంధించి వేగవంతమైన ఏకీకరణ, ఉద్యోగాలను మెరుగుపరచడం, రీస్కిల్ చేయడం మరియు రీమాజిన్ చేయడం వంటి వాటికి ఈ ఏడాది ఎక్కువగా గుర్తింపు లభించింది. ఈ పురోగతులు ఉన్నప్పటికీ, ప్రతిభను నిలుపుకోవడం, నైపుణ్యం పెంపొందించడం, నాయకత్వ అభివృద్ధి వంటి సవాళ్లు నిరంతరం కొనసాగుతూనే ఉన్నాయి. అందరూ 2025 కోసం వేచి చూస్తుండగా, హ్యూమన్ రిసోర్సెస్ విభాగానికి చెందిన నాయకులు తమ ప్రాధాన్యతలను మార్చుకుంటున్నారు-రియాక్టివ్ చర్యల నుంచి చురుకైన వ్యూహాలకు మారడం అనేది నేటి శ్రామిక శక్తి అవసరాలను మాత్రమే కాకుండా రేపటి కోసం ఎదురుచూస్తుంది. అదే విధంగా, 2025లో హెచ్ఆర్‌ను రూపొందించే పోకడలు ఉద్యోగులతో లోతైన సంబంధం, నైపుణ్య నిర్మాణం, మరియు తెలివిగా ప్రతిభ నిర్వహణకు సాంకేతికతను వృద్ధి చేయడంపై దృష్టి పెడతాయి.

**1. మారుతున్న కార్యాలయంలో నాయకత్వ అభివృద్ధి:** హైబ్రిడ్ బృందాలు, పలు-తరాల వర్క్‌ఫోర్స్, ఆధునిక పని వాతావరణాల అనిశ్చితుల నిర్వహణలో సమర్థవంతమైన నాయకత్వం కీలకంగా ఉంటుంది. నాయకత్వ అభివృద్ధిలో పెట్టుబడులు పెట్టే కంపెనీలు సంస్థాగత పనితీరులో 25% వృద్ధిని చూస్తున్నాయని అధ్యయనాలు చెబుతున్నాయి. నాయకత్వం సంస్థపై సుదూర ప్రభావాన్ని చూపే సంస్కృతిని సృష్టిస్తుంది. ఉద్యోగులు ఉండడానికి ఎంచుకునే ప్రధాన కారణం అదే. దానితో సంస్థ, ప్రజల అవసరాలకు అనుగుణంగా నాయకత్వ అంచనాలను అభివృద్ధి చేయవలసిన అవసరం ఉంది.

**2. నియామకం నుంచి నిలుపుదలకి మారడం:** గొప్ప రాజీనామా యుగం మన వెనుక ఉండవచ్చు. కానీ, సమర్థవంతమైన నిలుపుదల వ్యూహాల అవసరం ఎన్నడూ లేనంతగా ఉంది. టాప్ టాలెంట్‌ను ఉంచుకోవడం దీర్ఘకాలిక విజయానికి కీలకమని గ్రహించిన కంపెనీలు ఇప్పుడు రిక్రూట్‌మెంట్ నుంచి రిటెన్షన్ వైపు దృష్టి సారిస్తున్నాయి. నిలుపుదల అనేది ఇకపై ప్రామాణిక ప్రయోజనాలను అందించడం మాత్రమే కాదు-ఇది విభిన్న అవసరాలకు అనుగుణంగా వ్యక్తిగతీకరించిన ఉద్యోగి అనుభవాలను రూపొందించడం ఆధారంగా ఉంటుంది.

సంస్థను నిర్మించే కీలకమైన క్లిష్టమైన నైపుణ్యాలు, ప్రతిభను నిలుపుకోవడం అత్యవసరం. అందువల్ల ప్రతిభను గుర్తించేందుకు, పెట్టుబడి పెట్టడానికి వ్యూహాత్మక ప్రతిభ నిర్వహణ అవసరం. నిలుపుదల అనేది ఇప్పటికీ ఒక ఫలితం. అందువల్ల సమర్థవంతమైన వ్యూహాలు మరియు సంస్కృతి అవసరం. ఇక్కడ గొప్ప ప్రతిభను ప్రదర్శించిన వారే, ఉత్తమంగా అభివృద్ధి చెందుతారు.

## వేల కోట్ల రూపాయలు సంపాదించా.. కానీ ఏం చేయాలో అర్థం కావట్లే..



**న్యూఢిల్లీ-నవభూమి:**ప్రపంచంలో చాలా మంది వ్యక్తులు తమ దగ్గర డబ్బు లేని కారణంగా ఏమీ చేయలేకపోతున్నామని చెబుతుంటారు. కానీ అమెరికాలో ఉంటున్న భారతీయ సంతతికి చెందిన వినయ్ హిరేమత్ మాత్రం అందుకు వినూత్నంగా ఓ ప్రకటన చేశారు. ఇది ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. బిలియనీర్ అయిన తర్వాత కూడా వినయ్ అభద్రతా భావంతో ఉన్నట్లు చెప్పుకొచ్చారు. వేల కోట్ల రూపాయలు సంపాదించినా కూడా ఏం చేయాలో అర్థం కావడం లేదన్నారు.

**చాలా డబ్బు ఉందని:**ఆన్‌లైన్ ఉచిత స్క్రీన్ రికార్డింగ్ సాధనాలను అందించే లూమ్ సహ వ్యవస్థాపకుడు వినయ్ హిరేమత్ 2023లో తన స్టార్టప్ లూమ్‌ను 975 మిలియన్ డాలర్లకు (రూ. 8368.59 కోట్లు) విక్రయించారు. అప్పటి నుంచి తనకు ఏం చేయాలో తోచడం లేదన్నారు. ఈ విషయాన్ని తన బ్లాగ్ పోస్ట్‌లో పంచుకున్నారు. ఇప్పుడు తన వద్ద చాలా డబ్బు ఉందని, కానీ తన జీవితంలో ఇప్పుడు ఏం చేయాలో అర్థం కావడం లేదని పేర్కొన్నారు. కంపెనీని అమ్మిన తర్వాత డబ్బు సంపాదించాలన్నా, హోదా సాధించాలన్నా కోరిక లేకుండా పోయిందన్నారు.

తర్వాత రోజుల్లో..వినయ్ హిరేమత్ 1991లో జన్మించాడు. ఆయన యూనివర్శిటీ ఆఫ్ ఇల్లినాయిస్, ఉర్బానా-ఛాంపెయిన్‌లో చదువు ప్రారంభించాడు. కానీ రెండేళ్ల తర్వాత చదువు మానేశాడు. దీని తర్వాత ఆయన కాలిఫోర్నియాలోని పాలో ఆల్టోకు వెళ్లాడు. స్టార్టప్‌లలో కెరీర్‌ను కొనసాగించాలని కలలు కన్నాడు. మొదట్లో వినయ్ సిలికాన్ వ్యాలీలో స్టార్టప్ అయిన బ్యాక్‌ప్లేన్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేశాడు.ఆ సమయంలో ఇంటర్న్‌గా ఉన్న షాహెద్ ఖాన్‌ను కలుసుకున్నాడు. తరువాత అతనితో కలిసి లూమ్‌ను స్థాపించాడు. ప్రారంభ రోజులలో లూమ్ ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయింది. కేవలం రెండు వారాల్లో నిధులు ఖాళీ అయ్యాయి. ఈ కష్ట సమయాల్లో హిరేమత్ తన క్రెడిట్ కార్డును పూర్తిగా ఉపయోగించుకుని కంపెనీని కాపాడుకున్నాడు. లూమ్ సహ వ్యవస్థాపకుడు, మాజీ CTOగా ఆయన $200 మిలియన్ల నిధిని సేకరించాడు.

## ఒక్క రోజే రూ. 12 లక్షల కోట్లు ఆవిరి.. కారణమిదే..



**న్యూఢిల్లీ-నవభూమి:**అమెరికన్ స్టాక్ మార్కెట్లలో పెరుగుదల ఉన్నప్పటికీ, భారతీయ స్టాక్ మార్కెట్ సూచీలు మాత్రం సోమవారం (జనవరి 6న) భారీ నష్టాలతో ముగిశాయి. దేశంలో హ్యూమన్ మెటాప్‌న్యూమో వైరస్ కేసులు రెండు నమోదైన తర్వాత మార్కెట్‌లో విస్తృతంగా అమ్మకాలు జరిగాయి. ఈ క్రమంలో కొన్ని ఒడిదుడుకుల తర్వాత మార్కెట్ మొత్తం ఎరుపు రంగులోకి జారిపోయింది. చివరకు సెన్సెక్స్ 1258 పాయింట్ల పతనంతో 77,964.99 వద్ద ముగిసింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ నిఫ్టీ 50 కూడా భారీ అమ్మకాల తర్వాత 24,700 దిగువకు పడిపోయింది. చివరగా నిఫ్టీ 388.70 పాయింట్ల భారీ పతనంతో 23,616.05 వద్దకు చేరుకుంది.

**ఒక్క రోజులోనే..**

దీంతో మదుపర్లు ఒక్క రోజులోనే దాదాపు 12 లక్షల కోట్ల రూపాయలను నష్టపోయారు. స్టాక్ మార్కెట్‌లో ఆల్ రౌండ్ అమ్మకాల కారణంగా ఇన్వెస్టర్లు రూ.12 లక్షల కోట్లకు పైగా తగ్గింది. బీఎస్ఈలో లిస్టయిన కంపెనీల మార్కెట్ క్యాప్ (ఎంక్యాప్) రూ.12,38,638 కోట్లు తగ్గి రూ.4,38,95,210 లక్షల కోట్లకు చేరింది. శుక్రవారం ఇది రూ.45,133,848 కోట్లుగా ఉండేది. ఈ క్రమంలో సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో సన్‌ఫార్మా, టైటాన్ మినహా అన్ని షేర్లు నష్టాల్లో ముగిశాయి. టాటా స్టీల్ షేర్లు అత్యధికంగా 4 శాతానికి పైగా పడిపోయాయి.

**రూపాయి విలువ కూడా..**

కోటక్ మహీంద్రా బ్యాంక్, ఏషియన్ పెయింట్స్ తదితర షేర్లు కూడా క్షీణించాయి. టాటా స్టీల్, రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, కోటక్ బ్యాంక్, టాటా మోటార్స్, ఐటీసీ వంటి హెవీవెయిట్ స్టాక్‌లలో అమ్మకాలు మార్కెట్‌ను దిగువకు లాగాయని నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో డాలర్‌తో రూపాయి మారకం విలువ పోల్చుకుంటే ఆల్ టైమ్ కనిష్ట స్థాయికి చేరుకుంది. సోమవారం (జనవరి 6) అమెరికా కరెన్సీతో రూపాయి మారకం విలువ రూ.85.82కి పడిపోయింది. ఇది ఆల్ టైమ్ కనిష్ట స్థాయి.

**ఇతర మార్కెట్లు ఎలా ఉన్నాయంటే..**

ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియాకు చెందిన కోస్పి లాభాల్లో ఉండగా, చైనాకు చెందిన షాంఘై కాంపోజిట్, హాంకాంగ్ హ్యాంగ్ సెంగ్, జపాన్‌కు చెందిన నిక్కీ నష్టాల్లో ఉన్నాయి. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియాకు చెందిన కోస్పి లాభాల్లో ఉండగా, చైనాకు చెందిన షాంఘై కాంపోజిట్, హాంకాంగ్ హ్యాంగ్ సెంగ్, జపాన్‌కు చెందిన నిక్కీ నష్టాల్లో ఉన్నాయి. శుక్రవారం అమెరికా మార్కెట్లు సానుకూలంగా ముగిశాయి. %దీబూ% సెన్సెక్స్ శుక్రవారం (జనవరి 3) 720.60 పాయింట్లు క్షీణించి 79,223.11 వద్ద ముగిసింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ నిఫ్టీ-50 183.90 పాయింట్లు పడిపోయి 24,004.75 వద్ద ముగిసింది. ఈ విధంగా సెన్సెక్స్ గత రెండు రోజుల్లో దాదాపు 2000 పాయింట్లు పడిపోయింది.

## మిగులు.. ఎలా చేస్తే లాభం?




**న్యూఢిల్లీ-నవభూమి:**శశాంక్ ఓ ప్రైవేట్ ఉద్యోగి. హైదరాబాద్‌లో పదేండ్ల క్రితం రూ.50 లక్షలతో ఓ ఇల్లు కొన్నాడు. నెలనెలా ఈఎంఐలు చెల్లిస్తూపోతున్నాడు. ప్రస్తుతం ఇంకా చెల్లించాల్సిన ఇంటి అప్పు రూ.30 లక్షలుగా ఉన్నది. కానీ నెలనెలా ఈఎంఐలు భారంగా కనిపిస్తున్నాయి. దీంతో రుణంలో కొంతకొంత చెల్లిస్తూపోతే లాభామేమో? అన్న ఆలోచనలోపడ్డాడు. మరోవైపు ఆ మిగతా సొమ్మును మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడిగా పెడితే ప్రయోజనమేమో? అన్న సందేహాలూ మదిని తొలిచేస్తున్నాయి. అయితే ఒక్క శశాంక్‌దే ఈ పరిస్థితి కాదు. మనలో చాలామందిదీ ఇదే పరిస్థితి. మిగులు నిల్వలతో గృహ రుణాన్ని తీర్చాలా? లేక ఆ నిధులను ఇతర ప్రత్యామ్నాయ పెట్టుబడి మార్గాల్లోకి మళ్లించాలా? అన్న డైలామా కొట్టుమిట్టాడుతుంటారు. మరి నిపుణులు ఏమంటున్నారు?


ఇదీ సంగతి..పెట్టుబడి అనేది ఎప్పుడూ ఒకే దగ్గర పోగై ఉండిపోకూడదు. ఒకటికి మించిన సాధనాల్లో పెట్టుబడులు పెడితేనే సురక్షితం. రిస్క్‌లనూ తగ్గిస్తుంది. అయితే ఇల్లు అనేది ఓ దీర్ఘకాల మదుపు. నిజానికి సొంతిల్లు కల సాకారమనేది మంచిదే అయినా.. దీర్ఘకాలంపాటు మన కష్టార్జితం దానికే అంకితం చేసుకునేలా ఉంటే మాత్రం కొంత ఆలోచించాల్సిన అంశమని చెప్పవచ్చు. కాబట్టి అనుకోకుండా మన చేతికి పెద్ద మొత్తంలో నగదు వస్తే.. దాంతో ఇంటి రుణాన్ని వీలైనంత మేరకు తీర్చేయడమే తెలివైన పనిగా భావించవచ్చు. దీనివల్ల ముఖ్యంగా వడ్డీ భారం చాలావరకు తగ్గుతుంది. ఎందుకంటే హోం లోన్ వంటి దీర్ఘకాలిక రుణాల్లో అసలు కంటే దానిపై చెల్లించే వడ్డీ మొత్తమే ఎక్కువ. అసలు, వడ్డీ కలిపి అప్పు కొండను తలపిస్తుంటుంది. ఎంతకీ దిగిరాని పరిస్థితిలో పడిపోతాం. కాబట్టి అనూహ్యంగా వచ్చిన మొత్తాలతో ఇంటి అప్పు భారాన్ని తగ్గించుకోవడం ఉత్తమం. పైగా ఫ్లోటింగ్ వడ్డీరేట్లతో గృహ రుణం తీసుకున్నప్పుడు, మధ్యమధ్యలో కొంత మొత్తాలు చెల్లిస్తే జరిమానాలేవీ పడవు.

**నెలనెలా మిగుళ్లతో..**

నెలనెలా కొంత మొత్తాలు మిగులుతూపోతే గృహ రుణం తీర్చేకన్నా.. మ్యూచువల్ ఫండ్స్ వంటి వాటిని పరిశీలించడం లాభదాయకమని చెప్పవచ్చు. స్టాక్స్ లేదా మ్యూచువల్ ఫండ్స్‌ల్లో మిగులు నిల్వలను దీర్ఘకాలిక పెట్టుబడులుగా పెడితే 10-12 శాతం రాబడులను ఆశించవచ్చు. 8-9 శాతం వడ్డీరేట్లతో ఉన్న గృహ రుణం తీర్చడం కంటే ఇదే నయం మరి. అయితే స్టాక్ మార్కెట్లు, దాని ఆధారిత మ్యూచువల్ ఫండ్స్‌ల్లో పెట్టుబడులు ఒడిదొడుకులకు లోబడి ఉంటాయి. కాబట్టి రిస్క్‌కు సిద్ధపడితేనే మరింత లాభాలను అందుకోవచ్చున్నది మరువద్దు. రిస్క్‌లతో కూడిన పెట్టుబడులకు ఇష్టపడనివారు దూరంగా ఉంటేనే మంచిది. అయితే ఆర్థిక నిపుణుల సలహాతో సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ల (సిప్)ను ప్రయత్నించవచ్చు. ఇవికూడా రిస్క్‌తో కూడుకున్నవే అయినా.. మన అవసరాలకు తగ్గట్టుగా ఎక్స్‌పర్ట్స్ సూచనలతో ప్లానింగ్ చేసుకోవచ్చు. నిజానికి దీర్ఘకాలంలో స్టాక్ పెట్టుబడులు మెజారిటీ ఇన్వెస్టర్లకు లాభాల్నే పంచాయని గణాంకాలు చెప్తున్నాయి.

చివరగా..మదుపరులు ఎప్పటికైనా తమ పెట్టుబడులు బహుళ సాధనాల్లోకి మళ్లిస్తేనే మరింత లాభదాయకం. అలాగే చిన్న వయసు నుంచి చేసే పొదుపు.. పెద్ద లాభాల్ని పంచిపెడుతుంది. స్వల్ప, దీర్ఘకాల లక్ష్యాలకు తగ్గట్టుగా పెట్టుబడి సాధనాలను ఎంచుకోవడం తెలివైన నిర్ణయం. నగదు నిల్వలు సరిపడా ఉంటే వాటితోనే ఇల్లు కొనుక్కోవడం లాభమనే చెప్పవచ్చు. అయితే మోయలేనంత భారాన్ని మాత్రం ఎత్తుకోవద్దు.

# సీనియర్లకు ఇవి సరి



**న్యూఢిల్లీ-నవభూమి:**ఇదో కేంద్ర ప్రభుత్వ పథకం. పూర్తిగా రిస్క్ లేని రుణ సాధనం. 60 ఏండ్లు, ఆపై వయసువారి కోసమే తెచ్చారు. ప్రస్తుత వడ్డీరేటు 8.20 శాతం. కనీస పెట్టుబడి రూ.1,000, గరిష్ఠం రూ.30 లక్షలు. గరిష్ఠ కాలవ్యవధి 5 ఏండ్లు.

**2. పోస్టాఫీస్ మంత్లీ ఇన్‌కమ్ స్కీం**

తపాలా శాఖ అందించే ఈ స్కీంలో వార్షిక వడ్డీరేటు 7.40 శాతంగా ఉన్నది. కనీస పెట్టుబడి రూ.1,500. గరిష్ఠ పెట్టుబడి రూ.4.5 లక్షలు. జాయింట్ అకౌంట్‌లో రూ.9 లక్షలదాకా పెట్టుబడులు పెట్టవచ్చు. కాలపరిమితి 5 ఏండ్లు. మరో 5 ఏండ్లు పొడిగించుకోవచ్చు.

**3. సీనియర్ సిటిజన్ ఎఫ్‌డీ స్కీం**

60 ఏండ్లు, ఆపై వయసున్నవారికి రెగ్యులర్ ఇన్‌కమ్‌ను అందించడానికి బ్యాంకుల్లో వచ్చినదే ఈ స్కీం. కాలపరిమితి 7 రోజుల నుంచి 10 ఏండ్లు. వార్షిక వడ్డీరేట్లు 9.75 శాతం వరకున్నాయి. అత్యవసర పరిస్థితిలో ఎఫ్‌డీని వెనక్కి తీసుకోవచ్చు. అయితే జరిమానా ఉంటుంది.

**4. ఫిక్స్‌డ్ డిపాజిట్లు**

బ్యాంకుల్లో సాధారణ పౌరులతో పోల్చితే సీనియర్ సిటిజన్లకు ఎఫ్‌డీలపై వడ్డీరేట్లు ఎక్కువగా లభిస్తాయి. ఆదాయ పన్ను (ఐటీ) చట్టంలోని సెక్షన్ 80సీ కింద ఎఫ్‌డీలలో పెట్టుబడులకు పన్ను మినహాయింపున్నది. ఏటా రూ.1.5 లక్షలదాకా పన్ను ఆదా చేసుకోవచ్చు.

**5. సిస్టమ్యాటిక్ డిపాజిట్ ప్లాన్**

సిస్టమ్యాటిక్ డిపాజిట్ ప్లాన్‌లో సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్), ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ) ఫీచర్లుంటాయి. ఒకేసారి పెద్ద మొత్తాల్లో డిపాజిట్లకు బదులు చిన్నచిన్న మొత్తాల్లోనూ డిపాజిట్లకు ఇందులో వీలుంటుంది. రూ.5వేలతో ఈ మంత్లీ డిపాజిట్లను ప్రారంభించవచ్చు. ఇక ఇందులో రెండు వేరియంట్లుంటాయి. ఒకటి సింగిల్ మెచ్యూరిటీ స్కీం, మరొకటి మంత్లీ మెచ్యూరిటీ పథకం. వీటిపై వార్షిక వడ్డీరేట్లు 8.50 శాతందాకా ఉన్నాయి. మదుపరులు ఏడాది నుంచి ఐదేండ్ల కాలపరిమితితో పెట్టుబడులు పెట్టవచ్చు.

**6. మ్యూచువల్ ఫండ్స్**

మ్యూచువల్ ఫండ్స్‌ల్లో పెట్టుబడులు మార్కెట్ రిస్క్‌లకు లోబడి ఉంటాయి. పెట్టుబడులు పెట్టే ముందే సంబంధిత డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం మంచిది.

**7. నేషనల్ పెన్షన్ సిస్టమ్**

నేషనల్ పెన్షన్ సిస్టమ్ అనేది కేంద్ర ప్రభుత్వం అందించే రిటైర్మెంట్ సేవింగ్స్ స్కీం.

**8. పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్**

పీపీఎఫ్‌లో పెట్టుబడి ఇన్వెస్టర్లకు ఏటా రూ.1.5 లక్షలదాకా పన్ను ఆదాకు అవకాశాన్నిస్తుంది. పీపీఎఫ్ ఖాతా పరిమితి 15 ఏండ్లు ఉంటుంది.

**9. ట్యాక్స్ ఫ్రీ బాండ్లు**

ప్రభుత్వ రంగ కార్యక్రమాలు, ప్రభుత్వ సంస్థలు, మున్సిపల్ కార్పొరేషన్లు, ఇతర మౌలిక సదుపాయాల సంస్థలు ఈ బాండ్లను ప్రభుత్వం తరఫున జారీ చేస్తాయి. కాబట్టి ఇదో భద్రత కలిగిన పెట్టుబడి సాధనం.

**10. ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీం**

ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీం అనేది ఓ ట్యాక్స్-సేవింగ్ మ్యూచువల్ ఫండ్ స్కీం. స్టాక్ మార్కెట్లు తదితర సాధనాల్లో పెట్టుబడులను పెట్టడం జరుగుతుంది. తక్కువ రిస్కుతో ఎక్కువ రాబడులను అందుకోవచ్చు. ఐటీ చట్టంలోని సెక్షన్ 80సీ కింద పన్ను ఆదా చేసుకోవచ్చు.




# భార్య వేధింపులు భరించలేక గుజరాత్‌లో భర్త ఆత్మహత్య



**న్యూఢిల్లీ-నవభూమి:**భార్య వేధింపులు భరించలేక మరో భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. గతంలో బెంగళూరులో ఇలాంటి సంఘటన జరగగా, తాజాగా గుజరాత్‌లో చోటుచేసుకుంది. బోటాడ్ జిల్లా జమరాల గ్రామానికి చెందిన సురేష్ సతాదియా (39) గత నెల 30న తన ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రాణాలు తీసుకునే ముందు సెల్‌ఫోన్ ద్వారా అతడు తీసిన వీడియో వెలుగులోకి రావడంతో ఆయన తండ్రి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. భార్య జయ తనను మానసికంగా హింసించిందని సురేశ్ ఆ వీడియోలో తెలిపాడు. "జీవితాంతం గుర్తుంచుకునేలా ఆమెకు గుణపాఠం చెప్పండి. ఆమె నాకు చెందదు. పిల్లలకు కూడా చెందదు. నన్ను మోసగించింది. ప్రాణాలు తీసుకునేలా చేసింది" అని సురేష్ చెప్పాడు. తనతో నిత్యం గొడవ పడి పుట్టినింటికి వెళ్లిపోయేదని తెలిపాడు. సురేషకు 17 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. 15, 10 ఏళ్ల వయసు ఉన్న ఇద్దరు కుమార్తెలు, 6, 4 ఏళ్ల వయసు ఉన్న ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా, సురేశ్ భార్యను శనివారం అరెస్టు చేశామని డీఎస్పీ ఎన్.పి.అహిర్ తెలిపారు.

# ఈ లక్షణాలు మీలో కనిపిస్తే కొత్త వైరస్ సోకినట్లే..



**న్యూఢిల్లీ-నవభూమి:**కరోనా తరహాలోనే చైనాలో వేగంగా వ్యాప్తి చెందుతూ కలకలం సృష్టిస్తున్న కొత్త వైరస్ హ్యూమన్ మెటానిమోవైరస్ భారత్‌కూ పాకింది. బెంగళూరులో ఎనిమిది నెలల వయసున్న ఓ చిన్నారికి ఈ వైరస్ సోకినట్లు పరీక్షల్లో తేలింది. జాతీయ మీడియా కథనాల్లో ప్రచారం చేస్తున్నట్లుగా రాష్ట్రంలోని ఏ ల్యాబ్‌లో ఇలాంటి పరీక్షలు నిర్వహించలేదని కర్ణాటక ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రకటించింది. అయితే, ప్రైవేటు ఆస్పత్రి వైద్యులు పరీక్షలు నిర్వహించి విడుదల రిపోర్ట్‌పై తమ ప్రభుత్వానికి ఎలాంటి అనుమానాలు లేవని తెలిపింది. మొత్తంగా, ఈ కేసు విషయమై కేంద్ర ఆరోగ్య శాఖ నుంచి ఇంకా స్పందన రాలేదు.కరోనా మహమ్మారి తర్వాత చైనాలో పుట్టుకొచ్చిన మరో కొత్త వైరస్ ఇప్పుడు భారత్‌కూ పాకింది. ఈ వైరస్ వేగంగా ఇతర దేశాలకు వ్యాప్తి చెందడం చూసి ప్రపంచదేశాల్లో కలవరం మొదలైంది. చైనాలో ఈ మధ్యే బయటపడిన హ్యూమన్ మెటానిమోవైరస్ వేగంగా విస్తరిస్తున్నట్లు సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం జరుగుతోంది. ఈ వైరస్ బారిన పడి పెద్ద సంఖ్యలో ఆస్పత్రుల ముందు క్యూ కట్టిన రోగుల ఫొటోలు వైరల్ అయ్యాయి. హెచ్‌ఎంపీవీతో పాటు ఇన్‌ఫ్లూయెంజా ఏ, మైకోప్లాస్మా, న్యుమోనియా, కొవిడ్-19 వైరస్‌లు కూడా వ్యాప్తి చెందుతున్నట్లు వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఇప్పటివరకూ చైనాలోనే ఎక్కువగా కనిపించిన హెచ్‌ఎంపీవీ వైరస్ కేసులు ఇప్పుడు మలేషియాలోనూ విపరీతంగా పెరిగిపోతున్నాయి. దీంతో మళ్లీ కరోనా తరహా పరిస్థితి వస్తుందేమో అని అన్ని దేశాల ప్రజల్లో ఆందోళన మొదలైంది.అనేది శ్వాసకోశ వ్యాధులు కలిగించే ఒక రకమైన వైరస్. ఇది పిల్లలు, వృద్ధులు, బలహీనమైన రోగనిరోధక శక్తి ఉన్న వ్యక్తులను వేగంగా ప్రభావితం చేస్తుంది. దీని లక్షణాలు సాధారణంగా ఫ్లూ లాగా ఉంటాయి. ఈ వైరస్ సోకినవారిలో జ్వరం, గొంతు నొప్పి, దగ్గు ఉంటుంది. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడతారు. వైరస్ తీవ్రమైతే న్యుమోనియా, బ్రాంకైటిస్ వచ్చేందుకు అవకాశముంది. లక్షణాలను వెంటనే గుర్తించకపోతే ప్రమాదకరంగా మారే అవకాశముందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. కాబట్టి, ఈ కింది లక్షణాలుంటే నిర్లక్ష్యం చేయకండి. 1. నిరంతర జ్వరం 2. దగ్గు, గొంతు నొప్పి 3. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది4. అలసట, బలహీనత

# సర్కారు మారితే ఉద్యోగులకు బంపరాఫరే..



**న్యూఢిల్లీ-నవభూమి:** దేశంలో నైనా ప్రభుత్వానికి దాని ఉద్యోగులే పెద్ద సంపద. ఆయా ప్రభుత్వాలు చేపట్టే కార్యక్రమాలు ప్రజలకు చేరాలంటే ఉద్యోగులే వారధులు. అందుకే వారిని మచ్చిక చేసుకునేందుకు తాయిలాలు ప్రకటిస్తుంటారు. ఆర్థికంగా బాగా ఉన్న దేశాల్లో ఇది వర్క్ అవుట్ అవుతుంది. మరి శ్రీలంక, బంగ్లాదేశ్, జింబాబ్వే వంటి దేశాల్లో..? 50 ఏళ్ల నియంత పాలన పోయి.. సిరియాలో 50 ఏళ్ల పాటు బషర్ కుటుంబ పాలన సాగింది. అసద్ అల్ బషర్ ప్రభుత్వంపై 2011లో తిరుగుబాటు మొదలైంది. ఈ ప్రయత్నం అప్పట్లో విఫలమైంది. కానీ, 40 శాతం దేశం తిరుగుబాటుదారుల చేతుల్లోనే ఉంది. చివరకు డిసెంబరులో రోజుల వ్యవధిలోనే వారు రాజధాని డమాస్కస్ కు చేరుకోవడంతో.. అధ్యక్షుడు అసద్ దేశం విడిచి పారిపోయారు. సిరియా అసద్ దేశం విడిచి వెళ్లేలా రష్యా సహకరించింది. ఆయన కుటుంబంతో సహా ప్రవాసంలోకి వచ్చేందుకు రష్యా విమానాలను ఏర్పాటు చేసింది. దీంతో అసద్ ఇప్పుడు రష్యాలోనే ఆశ్రయం పొందుతున్నారు. కాగా, అసద్ పరారీ అనంతరం సిరియాలో కొత్త ప్రభుత్వం ఏర్పాటైంది. ఈ ప్రభుత్వానికి సహకరించే దేశాలు ఏమిటా? అనే చర్చ మొదలైంది. అయితే, ఆర్థిక సాయం చేస్తామని అరబ్ దేశాలు హామీ ఇచ్చాయి. ఉద్యోగులకు పండుగే.. సిరియా కొత్త ప్రభుత్వం తమ ఉద్యోగులకు భారీగా జీతాలు పెంచుతోంది. అది కూడా ఎవరూ ఊహించని విధంగా 400 శాతం పెంచనుందట. ఆర్థిక మంత్రి మహమ్మద్ అబ్జాద్ ఈ విషయాన్ని ప్రకటించారు. 1.65 ట్రిలియన్ సిరియన్ పౌండ్ల వేతనాలను దేశీయ వనరుల నుంచి సమకూర్చనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇదంతా ఆర్థిక వ్యవస్థను స్థిరీకరించడం కోసమేనని చెప్పారు. వాస్తవానికి సిరియాలో 15 ఏళ్లు అంతర్యుద్ధం జరుగుతోంది. ఒకప్పుడు పశ్చిమాసియాలోనే సంపన్న దేశమైన సిరియా తీవ్ర ఆర్థిక సవాళ్లలో చిక్కుకుంది. ఇప్పుడు కొత్త ప్రభుత్వం విదేశాల్లోని తమకు చెందిన 400 మిలియన్ డాలర్ల విలువైన ఆస్తులను విడిపించుకొనే ప్రయత్నం చేస్తోంది.

## డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నీతులు చెప్పడం వరకే...!: యాంకర్ శ్యామల

**విజయవాడ-నవభూమి:**ఇటీవల రాజమండ్రిలో గేమ్ చేంజర్ ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించగా, ఈ కార్యక్రమం నుంచి తిరిగి వెళుతూ ఇద్దరు అభిమానులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. గేమ్ చేంజర్ ప్రీ రిలీజ్ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఈ ఘటన పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున సాయం ప్రకటించారు. గత ప్రభుత్వం కాకినాడ-రాజమండ్రి ఏడీబీ రోడ్డును పట్టించుకోకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని పవన్ ఆరోపించారు.

దీనిపై వైసీపీ అధికార ప్రతినిధి యాంకర్ శ్యామల స్పందించారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నీతులు చెప్పడం వరకేనని, ఆచరణ ఉండదని విమర్శించారు. గేమ్ చేంజర్ మెగా ఈవెంట్ కు హాజరైన ఇద్దరు అభిమానులు రోడ్డు ప్రమాదంలో చనిపోతే ఈ ఘటనను రాజకీయం చేస్తున్నారని, నెపాన్ని గత ప్రభుత్వంపై నెట్టేసి చేతులు దులుపుకోవాలని ప్రయత్నిస్తున్నారని శ్యామల ఆరోపించారు. "కాకినాడ-రాజమండ్రి ఏడీబీ రోడ్డు ఛిద్రమైన స్థితిలో ఉందని మీకు ముందుగానే తెలిసినప్పుడు ఈవెంట్‌కు మీరు ఎందుకు పర్మిషన్ ఇచ్చారు సర్? సీజ్ ద రోడ్ అనాలి కదా! ప్రశ్నించారు.

# మహాకుంభ్ ప్రయాగ్‌రాజ్ యుద్ధభూమిగా మారుతుంది.. ఖలిస్థానీ ఉగ్రవాది పన్నూన్ బెదిరింపులు



**న్యూఢిల్లీ-నవభూమి:** సిక్కు వేర్పాటువాద నాయకుడు, ఖలిస్థానీ ఉగ్రవాది గురుపత్వంత్ సింగ్ పన్నూన్ మరోసారి తీవ్ర బెదిరింపులకు పాల్పడ్డాడు. జనవరి 13 నుంచి ప్రారంభమయ్యే మహా కుంభమేళా ను అడ్డుకుంటామని హెచ్చరించాడు.జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు జరగనున్న ఈ మహాకుంభ మేళాపై దాడులు చేసి భగ్నం చేస్తామని బెదిరింపులకు పాల్పడ్డాడు. ఈ మేరకు హిందూత్వ భావజాలానికి వ్యతిరేకంగా 'చలో ప్రయాగ్‌రాజ్'కు పిలుపునిచ్చాడు. లఖ్‌నవూ, ప్రయాగ్‌రాజ్‌లోని విమానాశ్రయాల్లో ఖలిస్తానీ, కశ్మీరీ జెండాలను ఎగురవేయాలని ఆయన మద్దతుదారులను కోరాడు. 'మహాకుంభ ప్రయాగ్‌రాజ్ 2025 యుద్ధభూమిగా మారుతుంది' అంటూ తీవ్ర బెదిరింపులకు పాల్పడ్డాడు.కాగా, పన్నూన్ ఇలా బెదిరింపులకు పాల్పడటం ఇదేమీ మొదటిసారి కాదు. గతంలోనూ అనేక సార్లు ఇలాంటి హెచ్చరికలే చేశాడు. భారత్‌లో సిక్కు వ్యతిరేక అల్లర్లు జరిగి 40 ఏళ్లు కావొస్తున్న సందర్భంగా ఎయిర్ ఇండియా విమానాలపై దాడి జరిగే అవకాశం ఉందని వాటిలో సిక్కులు ప్రయాణించొద్దని, ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ మూసివేస్తారని, అయోధ్య రామ మందిరం పునాదుల్ని పెకిలిస్తాం వంటి బెదిరింపులకు పాల్పడ్డాడు.ఉత్తం ప్రదేశ్‌లోని గంగ, యమున, సరస్వతి (అంతర్వాహిని) నదుల సంగమ ప్రదేశం ప్రయాగ్‌రాజ్ ముస్తాబవుతోంది.

జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకూ 45 రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఉత్సవానికి పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. మహా కుంభమేళాకు తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం రాష్ట్ర ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేస్తోంది. ఈ కుంభమేళాలో 45 కోట్లమంది భక్తులు పాల్గొని గంగాస్నానం ఆచరించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో యూపీ ప్రభుత్వం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తోంది. దీనిలో పాల్గొనే భక్తుల సౌకర్యం కోసం 1,60,000 టెంట్లు, 1,50,000 మరుగుదొడ్లను ఏర్పాటు చేస్తున్నారు. 15,000 మంది పారిశుద్ధ్య కార్మికులు పని చేస్తారు. 1,250 కిలోమీటర్ల పైప్‌లైనును సిద్ధం చేస్తున్నారు. 67 వేల ఎల్‌ఈడీ లైట్లు, 2 వేల సోలార్ లైట్లు, 3 లక్షల మొక్కలు ఏర్పాటవుతున్నాయి. కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత కెమెరాలు, ఆర్ఎఫ్ఐడీ రిస్ట్‌బ్యాండ్స్, యాప్ ట్రాకింగ్‌లతో భక్తులను లెక్కిస్తారు.

# ప్రశాంత్ కిషోర్‌కు 14 రోజుల జ్యుడిషియల్ కస్టడీ



**పాట్నా-నవభూమి:** జన్ సురాజ్ చీఫ్ ప్రశాంత్ కిషోర్ )కు పాట్నా సివిల్ కోర్టు 14 రోజుల జ్యుడిషియల్ కస్టడీ విధించింది. దీనికి ముందు కోర్టు బెయిలు మంజూరు చేసినప్పటికీ ష్యూరిటీ బాండ్ ఇచ్చేందుకు ఆయన నిరాకరించారు. దీంతో ఆయనను జ్యుడిషియల్ కస్టడీలోకి తీసుకోవాలని కోర్టు ఆదేశించింది. బీహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (బీపీఎస్సీ) పరీక్షలు రద్దు చేయాలనే డిమాండ్‌పై పీకే చేపట్టిన నిరాహార దీక్షను పాట్నా పోలీసులు సోమవారం తెల్లవారుజామున భగ్నం చేశారు. ఆయనపై ఎఫ్‌ఐఆర్ నమోదైనందున అరెస్టు చేసి కోర్టు ముందు హాజరుపరిచారు.

**అందుకే బెయిల్ ఆర్డర్‌ను నిరాకరించా: పీకే**

కోర్టు తనకు బెయిలు మంజూరు చేసినప్పటికీ, ఎలాంటి తప్పిదాలు చేయరాదని ఆ ఆదేశాల్లో రాసి ఉందని, దీంతో బెయిల్ ఆర్డర్‌ను తోసిపుచ్చానని, జైలుకు వెళ్లేందుకు అంగీకరించానని ప్రశాంత్ కిషోర్ తెలిపారు. "ఉదయం 5 నుంచి 11 గంటల వరకూ నన్ను పోలీసు వ్యానులోనే ఉంచి వివిధ ప్రాంతాలకు తీసుకెళ్లారు. పదేపదే అడిగినప్పటికీ ఎక్కడికి తీసుకువెళ్తున్నారో చెప్పలేదు. ఫత్వా కమ్యూనిటీ సెంటర్‌కు తీసుకువెళ్లారు. వైద్యపరీక్షలు చేయించి వైద్యుల నుంచి సర్టిఫికెట్ తీసుకోవాలని అనుకున్నారు. నేనేమీ నేరపూరిత చర్యలకు పాల్పడలేదు. అందుకే వైద్య పరీక్షలకు నిరాకరించాను. ఈ విషయాన్నే డాక్టర్లకు చెప్పాను. వైద్యులకు పోలీసులు నచ్చచెప్పేందుకు ప్రయత్నించారు. అయితే చట్టవిరుద్ధమైన సర్టిఫికెట్ ఇచ్చేందుకు వైద్యులు నిరాకరించారు. మెడికల్ టెస్టుకు నిరాకరించడంతో నా స్టేట్‌మెంట్‌ను వాళ్లు రికార్డు చేసుకున్నారు" అని ప్రశాంత్ కిషోర్ తెలిపారు.

**నాటకీయ పరిణామాల మధ్య అరెస్టు**

దీనికి ముందు, గాంధీమైదాన్‌లో సోమవారం ఉదయం నాటకీయ పరిణామాల మధ్య ప్రశాంత్ కిషోర్‌ను పాట్నా పోలీసులు అరెస్టు చేశారు. ఆంక్షలున్న ప్రదేశంలో ప్రదర్శనలకు అనుమతి లేనందునే కిషోర్‌ను, ఆయన మద్దతుదారులను దీక్షా స్థలి నుంచి తరలించినట్టు పోలీసులు తెలిపారు. గత ఏడాది డిసెంబర్ 13న నిర్వహించిన బీపీఎస్-సీ పరీక్షలు రద్దు చేయాలనే డిమాండ్‌పై జనవరి 2 నుంచి జన్ కిషోర్ ఆమరణ నిరాహార దీక్షకు దిగారు. కిషోర్ దీక్షా శిబిరం నుంచి తొలగించేటప్పుడు ఆయనపై చేయి చేసుకున్నారని, కొట్టారని ఆయన మద్దతుదారులు చేసిన ఆరోపణను జిల్లా మెజిస్ట్రేట్ చంద్రశేఖర్ సింగ్ తోసిపుచ్చారు. భద్రతా సిబ్బంది ఆయనపై చేయి చేసుకోలేదని, ఆయనను అరెస్టు చేయకుండా అడ్డుపడిన మద్దతుదారులను నిరసన స్థలి నుంచి ఖాళీ చేయించారని చెప్పారు. ఈ సందర్భంగా 43 మంది మద్దతుదారులను అరెస్టు చేసి మూడు ట్రాక్టర్లతో సహా 15 వాహనాలను సీజ్ చేసినట్టు తెలిపారు. బీపీఎస్సీ పరీక్షల వ్యవహారం ప్రస్తుతం సుప్రీంకోర్టు ముందుందని, ఎవరైనా తమ వాదనలు చెప్పుకోవాలని అనుకుంటే అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చని అన్నారు.

# కుంభమేళాకు 13 వేల రైళ్లు



**ప్రయాగరాజ్-నవభూమి:** ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగరాజ్‌లో ఈ నెల 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు జరుగనున్న జరుగనున్న మహా కుంభమేళాకు దేశవిదేశాల నుంచి 40 కోట్ల మంది వరకు వస్తారని అంచనా వేస్తున్నారు. యాత్రికులు, భక్తులను చేరవేసేందుకు రైల్వే శాఖ పెద్దఎత్తున ఏర్పాట్లు చేసింది. 50 రోజులపాటు 13 వేల రైళ్లు నడపాలని నిర్ణయించింది. వీటిలో పది వేలు రెగ్యులర్ సర్వీసులు కాగా.. మూడు వేలు ప్రత్యేక రైళ్లు. మేళా జరగడానికి 2-3 రోజుల ముందు.. ఆ తర్వాత 2-3 రోజుల వరకు రైళ్లు నడుస్తాయి. అలాగే పవిత్ర పుణ్యక్షేత్రాలను కలుపుతూ 560 రింగ్ రైళ్లు నడుపనుంది. ప్రయాగరాజ్-అయోధ్య-వారాణసీ-ప్రయాగ్‌రాజ్, ప్రయాగరాజ్-సంగమ్ ప్రయాగ్-జాన్‌పూర్-ప్రయాగ్-ప్రయాగరాజ్, గోవింద్‌పురి-ప్రయాగరాజ్-చిత్రకూట్-గోవింద్‌పురి, ఝాన్సీ-గోవింద్‌పురి-ప్రయాగరాజ్-మాణిక్‌పూర్-చిత్రకూట్-ఝాన్సీ మార్గాల్లో వీటిని నడుపుతారు. ప్రయాగరాజ్ ప్రాంతంలోని మొత్తం 9 రైల్వే స్టేషన్లలో 560 టికెట్ కౌంటర్లను కూడా రైల్వే ఏర్పాటుచేస్తోంది. భక్తులు లక్షలాదిగా తరలిరానున్న నేపథ్యంలో రైల్వే రక్షణ దళం (ఆర్‌పీఎఫ్), రాష్ట్ర రైల్వే పోలీసుకు చెందిన 18 వేల మందికిపైగా సిబ్బందిని మోహరిస్తున్నట్లు ఉత్తర మధ్య రైల్వే జీఎం ఉపేంద్ర వెల్లడించారు. ప్రయాణికులకు వైద్య సేవలు అందించడానికి ఆక్సిజన్ సిలిండర్లు, కాన్సంట్రేటర్లు, ఈసీజీ యంత్రాలతో ప్రయాగరాజ్ జంక్షన్‌లో అబ్జర్వేషన్ రూంను ఏర్పాటు చేశామన్నారు.

**ఉగ్ర బెదిరింపు..**

మహాకుంభమేళాకు ఆదివారం బాంబు బెదిరింపు వచ్చింది. ఉగ్ర దాడిచేస్తానని, వెయ్యి మందిని చంపుతానని సోషల్ మీడియాలో పోస్టుచేసిన ఆయుషకుమార్ జైస్వాల్‌ను మహాకుంభ్ పోలీసులు అరెస్టు చేశారు. ఇతడు విద్యార్థి. బిహార్‌లోని షాదీజంగ్ వాసి. ఇన్‌స్టాగ్రాంలో నాసిర్ పఠాన్ అనే నకిలీ పేరుతో ఈ బెదిరింపు పోస్టు పెట్టి నేపాల్ పారిపోయాడు. తన పక్కింటిలోని నాసిర్ పఠాన్‌ను ఇరికించేందుకే ఆయుష్ ఆ పేరుతో పోస్టు పెట్టినట్లు దర్యాప్తులో వెల్లడైంది.

**మేళా జరిగేది వక్ఫ్ భూమిలో!**

తమ వక్ఫ్ భూమిలో మహాకుంభమేళా జరగబోతోందని అఖిల భారత ముస్లిం జమాత్ అధ్యక్షుడు మౌలానా షహబుద్దీన్ రజ్వీ బరేల్వీ తెలిపారు. వక్ఫ్ భూమిలో ఇంతటి ఉత్సవం నిర్వహించేందుకు అనుమతించి ముస్లింలు తమ విశాల హృదయాన్ని చాటుకున్నారని.. హిందువులు కూడా ఇచ్చిపుచ్చుకునే రీతిలో ఈ కార్యక్రమానికి తమను అనుమతించాలని అన్నారు. ఆయన వ్యాఖ్యలపై హిందూ మహాసభ మండిపడింది. పాకిస్థాన్ ప్రేరిత మౌలానాను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేసింది. మహాకుంభ్‌ను ఆటంకపరచడానికి ఆయన ఈ వ్యాఖ్యలు చేస్తున్నారంది.

**అణువిపత్తును ఎదుర్కొనేందుకు శిక్షణ**

మహా కుంభమేళా సందర్భంగా రసాయన, అణు విపత్తులు చోటుచేసుకుంటే ఎదుర్కోవడానికి యూపీ ప్రభుత్వం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. సిబ్బందిని అందుకు సన్నద్ధం చేసేందుకు గత శుక్రవారం ప్రత్యేక శిక్షణ కూడా ఇచ్చింది. యూపీ విపత్తు నిర్వహణ అథారిటీ (యూపీఎసడీఎంఏ), కేంద్రప్రభుత్వం, అణుశక్తి విభాగం సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని అథారిటీ ఉపాధ్యక్షుడు లెఫ్టినెంట్ జనరల్ యోగేంద్ర డిమ్రీ ప్రారంభించారు. సంబంధిత సాధనాల ప్రదర్శనతో పాటు విపత్తు నిర్వహణలో కొత్త సాంకేతికతలు, రసాయన ప్రమాదాలపై సత్వర స్పందన, సురక్షిత సహాయ కార్యక్రమాలు, వైద్యసాయం మొదలైనవాటిపై వివిధ శాఖలకు చెందిన సుమారు 400 మందికి శిక్షణ ఇచ్చారు.

# పిల్లలలో వైరస్ ఎందుకు వేగంగా వ్యాపిస్తోంది?



: చైనాలో భయాందోళనలకు గురిచేస్తున్న ఇన్‌ఫెక్షన్ భారతదేశంలో కూడా వేగంగా వ్యాపించడం ప్రారంభించింది. దాని లక్షణాలు బెంగళూరులోని 8, 3 నెలల చిన్నారిలో ధృవీకరించబడిన తర్వాత, ఇప్పుడు అహ్మదాబాద్‌లో 2 నెలల చిన్నారి కూడా పాజిటివ్‌గా నివేదించబడింది. 60 ఏళ్లు పైబడిన పెద్దలు, చిన్న పిల్లలు ఈ వైరస్ బారిన పడే ప్రమాదం ఎక్కువగా ఉందని నిపుణులు చెబుతున్నారు. కానీ, నవజాత శిశువులలో ఈ సంక్రమణ ఎందుకు కనిపిస్తుంది? దీని వెనుక కారణం ఏమిటి? అనే విషయాలను తెలుసుకుందాం..

**ఊపిరితిత్తులలోకి ప్రవేశిస్తుంది :**

గాలిలో వైరస్ ఉండటం వల్ల ఊపిరితిత్తులను ఎక్కువగా ప్రభావితం చేస్తుంది. దీని సంక్రమణ శ్వాసకోశ వ్యవస్థను ప్రభావితం చేస్తుంది. కొన్నిసార్లు ఈ వైరస్ చెవుల ద్వారా కూడా వ్యాపిస్తుంది.

నవజాత శిశువులలో వైరస్ సంక్రమణకు కారణం బలహీనమైన రోగనిరోధక వ్యవస్థ. నిజానికి పుట్టినప్పుడు శిశువుల రోగనిరోధక వ్యవస్థలు బలహీనంగా ఉంటాయి. ఇన్ఫెక్షన్‌తో పోరాడటానికి తగినంత ప్రతిరోధకాలను ఉత్పత్తి చేయలేవు. అదనంగా, శిశువుల శ్వాసకోశం ఇప్పటికే సున్నితంగా ఉంటుంది. వైరస్ వారిపై ప్రభావం చూపడం సులభం అవుతుంది. అదే కారణంగా వృద్ధుల్లో ఈ వైరస్ వ్యాప్తి చెందే ప్రమాదం ఎక్కువగా ఉందని చెబుతున్నారు.

**నవజాత శిశువులలో లక్షణాలు:**

సాధారణంగా, సంక్రమణ ప్రారంభ లక్షణాలు తేలికపాటి జ్వరం, దగ్గు, ముక్కు కారటం. అదనంగా, శిశువులు రెస్పిరేటరీ డిస్ట్రెస్ సిండ్రోమ్ లేదా బ్రోన్కైటిస్ వంటి లక్షణాలను విపరీతమైన దగ్గు, వేగవంతమైన శ్వాస.

# ఢిల్లీ ఓటర్ల తుది జాబితాను విడుదల చేసిన ఈసీ



**న్యూఢిల్లీ-నవభూమి:**ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతుండటంతో ఓటర్ల తుది జాబితాను ఢిల్లీ ఎన్నికల కమిషన్ సోమవారంనాడు విడుదల చేసింది. అప్‌డేట్ చేసిన జాబితా ప్రకారం దేశ రాజధానిలో 1,55,24,858 మంది రిజిస్టర్డ్ ఓటర్లు ఉన్నారు. వీరిలో 84,49,645 మంది పురుష ఓటర్లు, 71,73,952 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. ఓటర్ల జాబిజాలో లేనివారు 2025 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేసే అవకాశం లేదని ఎన్నికల కమిషన్ తెలిపింది. ఎంత మంది కొత్త ఓటర్లను చేర్చారు, ఎంతమంది పేర్లను తొలగించారనే వివరాలు తాజా ఓటర్ల తాబితాలో ఈసీ పొందుపరిచింది.

కాగా, మాజీ ముఖ్యమంత్రి, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల పోటీ చేస్తున్న అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పెద్దఎత్తున ఓటర్లను తొలిగించారని ఆ పార్టీ రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్ చేసిన ఆరోపణలను న్యూఢిల్లీ డిస్ట్రిక్ట్ ఎలక్షన్ ఆఫీసర్ గత శనివారంనాడు తోసిపుచ్చారు. ఓట్ల తొలగింపును కోరిన అప్లికెంట్ల వివరాలను డీఈఓ ఇవ్వలేదని, ఉద్దేశపూర్వకంగానే ఓటర్ల పేర్లను డీఈఓ తొలగించారని ఎంపీ చేసిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమని చెప్పారు. ఎన్నికల జాబితా నుంచి పేర్లు తొలగించడం పూర్తిగా ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారమే ఉంటుందని తెలిపారు.ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు ఫిబ్రవరిలో జరగాల్సి ఉన్నాయి. అయితే ఇంతవరకూ ఎన్నికల షెడ్యూల్‌ను ఈసీ ప్రకటించలేదు. ఢిల్లీలో వరుసగా 15 సంవత్సరాలు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలవలేదు. 2020లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 70 స్థానాలకు ఆప్ 62 సీట్లు గెలుచుకోగా, బీజేపీ 8 సీట్లు దక్కించుకుంది.

# మహిళలకు రూ.2.500.. ప్రకటించిన కాంగ్రెస్



**న్యూఢిల్లీ-నవభూమి:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో కాంగ్రెస్ పార్టీ మహిళల కోసం "ప్యారీ దీదీ యోజన" ను ప్రకటించింది. ఈ స్కీమ్ కింద మహిళలకు నెలనెలా రూ.2,500 ఆర్థిక సాయం అందనుంది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ పథకాన్ని అమలు చేస్తామని వాగ్దానం చేసింది. సోమవారంనాడిక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఈ పథకాన్ని ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందనే ధీమాను ఆయన వ్యక్తం చేశారు. కర్ణాటక మోడల్ తరహాలోనే 'ప్యారీ దీదీ' పథకాన్ని ఇక్కడ కూడా అమలు చేస్తామని, తొలి మంత్రివర్గ సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను ఖరారు చేస్తామని డీకే చెప్పారు.

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో మహిళా ఓటర్ల సంఖ్య గణనీయంగా ఉండటంతో పార్టీలన్నీ ప్రధానంగా మహిళా పథకాలపై దృష్టి సారిస్తున్నాయి. ఇటీవల మహారాష్ట్ర ఎన్నికల్లో మహాయుతి కూటమి భారీ విజయాన్ని సాధించింది. ఈ విజయంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ముఖ్యమంత్రి లడ్కీ బహిన్ యోజన' కీలక పాత్ర పోషించినట్టు రాజకీయ విశ్లేషకులు తేల్చిచెప్పారు.

కాంగ్రెస్‌పై పెరుగుతున్న నమ్మకం

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తుండటంతో ప్రజల్లోనూ నమ్మకం పెరిగినట్టు ఢిల్లీ కాంగ్రెస్ అధ్యక్షుడు దేవేందర్ యాదవ్ తెలిపారు. కర్ణాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్, జారా?ండ్, ఛత్తీస్‌గఢ్‌లలో ఏవైతే వాగ్దానాలు చేశామో వాటన్నింటిని అమలు చేశామని, ప్రజావిశ్వాసాన్ని పొందగలిగామని చెప్పారు. ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ కలల్లో విహరిస్తుంటారని, 11 ఏళ్లుగా ఢిల్లీ పరిస్థితి దిగజారిందని, ఎడ్యుకేషన్ మోడల్, ఉచిత విద్యుత్, ఉచిత నీళు ,, అవినీతిని అంతం చేయడం వంటి హామీలన్నీ పూర్తిగా విఫలమయ్యాయని అన్నారు.

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు ఫిబ్రవరిలో జరగాల్సి ఉన్నాయి. ఢిల్లీలో 15 ఏళ్ల పాటు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలుచుకోలేకపోయింది. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో 70 స్థానాలకు 60 సీట్లలో ఆప్ గెలుపొందగా, బీజేపీ 8 సీట్లు గెలుచుకుంది.

# ఒక్క రోజు వేతనం.. 48 కోట్లు!



**న్యూఢిల్లీ-నవభూమి:** రూ.48 కోట్లు. ఇది ఒక కంపెనీ నెలవారీ టర్నోవర్ కాదు. ఒక వ్యక్తి ఒక్క రోజులో సంపాదించే మొత్తం. ఆయన పేరు జగదీప్ సింగ్. విద్యుత్తు వాహనాల్లో వినియోగించే బ్యాటరీల తయారీ రంగంలో ఉన్న క్వాంటమ్‌స్కేప్ సీఈవో ఇతను. ప్రపంచంలోనే అత్యధిక వేతనం పొందుతున్న వ్యక్తిగా జగదీపసింగ్ రికార్డు సృష్టించారు. ఆయన వేతనం రోజుకు 48 కోట్ల రూపాయలు. ఏడాదికి రూ.17,500 కోట్లు. ఇది చాలా పెద్దసంస్థల వార్షిక ఆదాయం కంటే అధికం. 2010లో అమెరికాలో జగదీప్ సింగ్ స్థాపించిన క్వాంటమ్‌స్కేప్... ఎలక్ట్రిక్ వాహనాల బ్యాటరీల తయారీలో అగ్రగామిగా ఉంది. భారత సంతతికి చెందిన ఆయన స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీలో బీటెక్, బర్కిలీలోని కాలిఫోర్నియా యూనివర్సిటీలో ఎంబీఏ చదివారు. బ్యాటరీ టెక్నాలజీలో తనదైన ముద్ర వేసిన జగదీప్ సింగ్.. ప్రపంచం దృష్టి ఆకర్షిస్తున్నారని పారిశ్రామిక దిగ్గజాలు ప్రశంసిస్తున్నారు. కళ్లు చెదిరే ఆయన వేతన ప్యాకేజీ వివరాలు వెల్లడి కావడంతో రాత్రికి రాత్రే ఆయన ఇంటర్నెట్‌లో సంచలనంగా మారారు.



## అల్లు అర్జున్‌కు రాంగోపాల్ పేట్ పోలీసులు నోటీసులు

సినీ నటుడు అల్లు అర్జున్‌కి హైదరాబాద్ రాంగోపాల్ పేట్ పోలీసులు నోటీసులు పంపారు. సంధ్య థియేటర్ ఘటనలో గాయపడి సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీతేజ్‌ను పరామర్శించేందుకు అల్లు అర్జున్ వెళుతున్నాడని సమాచారం అందుకున్న పోలీసులు బన్నీని రావొద్దని సూచించారు. ఒకవేళ పరామర్శకు వస్తే తమ సూచనలు పాటించాలన్నారు. ఏదైనా జరిగితే అల్లు అర్జున్ బాధ్యత వహించాల్సి వస్తుందని నోటీసుల్లో పేర్కొన్నారు.పుష్ప-2 బెనిఫిట్ షో సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనలో రేవతి అనే మహిళ మృతిచెందడంతో పాటు ఆమె కుమారుడు శ్రీతేజ్ తొక్కిసలాటలో గాయపడి ప్రస్తుతం కిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. అయితే రేవతి మరణానికి అల్లు అర్జున్ కారణమంటూ ఆయనపై చిక్కడపల్లి పోలీసులు కేసు నమోదుచేసి అరెస్టు చేశారు. నాంపల్లి కోర్టు రిమాండ్ విధించడంతో ఆయనను పోలీసులు చంచల్‌గూడ జైలుకు తరలించారు. అయితే హైకోర్టు మధ్యంతర బెయిల్‌తో ఆయన విడుదలయ్యారు. మరోవైపు నాంపల్లి కోర్టు విధించిన రిమాండ్ ముగియడంతో రెగ్యులర్ బెయిల్ కోసం అల్లు అర్జున్ పిటిషన్ దాఖలు చేశారు. అయితే ఈ కేసుపై శుక్రవారం విచారణ చేపట్టిన నాంపల్లి కోర్టు అల్లు అర్జున్‌కి రెగ్యులర్ బెయిల్‌ను మంజూరు చేసింది. ఇక బెయిల్ మీద బయటకు వచ్చిన అల్లు అర్జున్‌కి కోర్టు పలు షరతులను విధించింది.









## బుట్ట బొమ్మ ఈ సారి పక్కా ప్లానింగ్ తో..!

బుట్ట బొమ్మ పూజా హెగ్దేని టాలీవుడ్ దూరం పెట్టినా కూడా మొన్నటిదాకా ఒకటి రెండు అవకాశాలతో సరిపెట్టుకున్న అమ్మడు ఇప్పుడు ఏకంగా ఐదారు సినిమాలతో బిజీ బిజీగా మారింది. బాలీవుడ్ లో షాహిద్ కపూర్ తో దేవా సినిమా చేస్తున్న అమ్మడు ఆ సినిమా తర్వాత రెండు ఆఫర్లను పట్టేసింది. ఇక కోలీవుడ్ లో దళపతి విజయ్ సినిమాతో పాటుగా సూర్య రెట్రోలో కూడా నటిస్తుంది. ఈ సినిమాలతో అక్కడ కూడా మళ్లీ తిరిగి ఫాం లోకి రావాలని చూస్తుంది అమ్మడు. 500 కోట్ల క్లబ్‌లో మేమూ ఉన్నాం.. హిందీ నిర్మాత ఫికర్ పూజా హెగ్దే ఈసారి పక్కా ప్లానింగ్ తో సినిమాలు చేస్తుందని అనిపిస్తుంది. ఒకప్పుడు గ్లామర్ కే ప్రాధాన్యత ఇస్తూ సినిమాలు చేసిన అమ్మడు ఇప్పుడు నటనా ప్రాధాన్యత ఉన్న పాత్రలను కూడా చేయాలని భావిస్తుంది. ఈ క్రమంలో బుట్ట బొమ్మ పూజా హెగ్దే తన సినిమాల అవకాశాల గురించి రీసెంట్ గా మాట్లాడింది. తన కెరీర్ సంతృప్తికరంగా ఉందని అంటున్న అమ్మడు. పాత్రల ఎంపిక కాదు అందులో జీవించడం ముఖ్యమని అంటుంది. అంతేకాదు ప్రొఫెషనల్ గా ఎప్పటికప్పుడు కొత్త విషయాలను నేర్చుకుంటూ ఉన్నా అంటుంది పూజా. 40గంటల పాటు యూట్యూబర్ డిజిటల్ అరెస్ట్ సినిమాలో పూజా హెగ్దే ఉంది అంటే గ్లామర్ షో తప్పనిసరి అని ఫిక్స్ అయ్యారు ఆడియన్స్. అలాంటిది అమ్మడు పాత్ర ప్రాధాన్యత ఉంటేనే గ్లామర్ షో చేస్తానని అంటుంది. అది కొంతమేరకు మంచిదే అయినా అమ్మడి థై షోకి సెపరేట్ ఫ్యాన్స్ ఉన్నారు కాబట్టి వాళ్లని నిరాశ పరచకుండా ఉంటే బెటర్ అని చెప్పొచ్చు. తెలుగులో ఒకటి రెండు సినిమాల డిస్కషన్స్ జరుగుతున్నాయని తెలుస్తున్నా వాటిలో ఏది ఫైనల్ అవ్వలేదు. తెలుగులో మొన్నటిదాకా స్టార్ సినిమా అయితే ఆమె ఫస్ట్ ఆప్షన్ అనిపించగా ఇప్పుడు అమ్మడు తిరిగి మళ్లీ అలాంటి ఛాన్స్ లు పొందేందుకు చాలా కష్టపడుతుంది. మరి పూజా బేబీ పెడుతున్న ఈ ఎఫర్ట్స్ అమ్మడికి ఏమేరకు ఫలితాన్ని అందిస్తాయన్నది చూడాలి. పూజా హెగ్దే గ్లామర్ కాకుండా యాక్టింగ్ మీద ఎక్కువ ఫోకస్ చేస్తే మాత్రం ఫ్యాన్స్ హర్ట్ అయ్యే ఛాన్స్ ఉంది. బాలీవుడ్ సినిమాలేమో కానీ తమిళ్ లో పూజా చేస్తున్న రెండు సినిమాలు భారీ అంచనాలతో వస్తున్నాయి కాబట్టి వాటితో పూజా అక్కడ తిరుగులేని క్రేజ్ తెచ్చుకుంటుందని చెప్పొచ్చు.

## తెలంగాణలో టికెట్ రేట్ల పెంపు.. దిల్ రాజు ఏమన్నారంటే?




తెలంగాణ ఇకపై కొత్త సినిమాలకు టికెట్ రేట్లు పెంచేందుకు, ప్రీమియర్ షోస్ వేసేందుకు పర్మిషన్ ఇవ్వమని రీసెంట్ గా రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత టాలీవుడ్ పెద్దలతో జరిగిన సమావేశంలో కూడా అదే విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. దీంతో సంక్రాంతి సినిమాలకు ఏపీలో అనుమతులు వచ్చాయి కానీ తెలంగాణలో రాలేదు. ఇప్పుడు ఆ విషయంపై నిర్మాత దిల్ రాజు స్పందించారు. “అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్ రెడ్డి టికెట్ రేట్లు పెంచమని చెప్పారు.. మరోసారి ఆయన వద్దకు మీరు ప్రతిపాదన తీసుకెళ్తా అంటున్నారు.. దాన్ని ఎలా చూడాలి” అన్న ప్రశ్నకు దిల్ రాజు తాను ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో రెస్పాండ్ అయ్యారు. “మీరు ముఖ్యమంత్రి స్పీచ్ చూస్తే తెలుస్తుంది.. ఆయన సినీ ఇండస్ట్రీకి వ్యతిరేకం కాదని చెప్పారు” అని దిల్ రాజు తెలిపారు. హిందీ నిర్మాత ఫికర్ “అన్నీ ఇస్తాం.. కానీ అలాంటి (సంధ్య థియేటర్ ఘటన) ఇన్సిడెంట్లు జరగకూడదని అన్నారు.. జరిగింది కాబట్టి నిర్ణయం తీసుకుంటున్నామన్నారు. అన్నీ ఇస్తానని చెప్పారు. ఆ ఆశతో ఉన్నాను. ఆయన స్పీచ్ వినండి. ఆకలైతే అడగందే అమ్మ కూడా పెట్టదుగా.. అందుకు నేను కూడా కోపరేట్ చేయమని అడుగుతా” అని పేర్కొన్నారు. ఒక నిర్మాతగా త్వరలోనే ఆయన్ను కలిసి టికెట్ రేట్ల గురించి మాట్లాడతానని, కానీ తుది నిర్ణయం ప్రభుత్వానిదేనని తెలిపారు. ఎలాంటి సమాధానం వచ్చినా తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఏదేమైనా సినిమా పరిశ్రమకు ఎప్పుడూ అండగా ఉంటానని సీఎం రేవంత్ రెడ్డి తమకు చెప్పినట్లు గుర్తుచేశారు దిల్ రాజు. అన్ని విషయాల్లో జాగ్రత్తగా ఉండమని సూచించినట్లు చెప్పారు. ఫార్మా, ఐటీ, సినిమా రాష్ట్రానికి ఎంతో ముఖ్యమని ఆయన ఇటీవల తమతో అన్నట్లు తెలిపారు. తాను తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ గా బాధ్యతలు చేపట్టినందుకు ఎంతో హ్యాపీగా ఉందని దిల్ రాజు తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలతో సంయుక్తంగా వర్క్ చేస్తానని చెప్పారు. మూవీ ఇండస్ట్రీకి.. ప్రభుత్వానికి మధ్య ఒక వారధిగా ఉంటానని పేర్కొన్నారు. అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని వెల్లడించారు. తాను గేమ్ ఛేంజర్ తో తప్పకుండా కమ్‌బ్యాక్ ఇస్తానని అనుకుంటున్నట్లు ధీమా వ్యక్తం చేశారు. తమ బ్యానర్ పై రూపొందిన మరో చిత్రం సంక్రాంతికి వస్తున్నాం విషయంలో నమ్మకంతో ఉన్నట్లు తెలిపారు.

## ట్రోల్స్‌తో డిప్రెషన్‌లోకి
### మీనాక్షి చౌదరి షాకింగ్ కామెంట్స్



ప్రస్తుతం తెలుగు, తమిళ భాషల్లో స్టార్ హీరోలతో సినిమాలు చేస్తూ ఫుల్ బిజీగా ఉన్న భామల్లో ఒకరు మీనాక్షి చౌదరి. ఈ బ్యూటీ గతేడాది దళపతి విజయ్‌తో ది గోట్ సినిమాలో మెరిసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత లక్కీ భాస్కర్‌తో బ్లాక్ బస్టర్ హిట్టందుకుంది.అయితే ది గోట్ సినిమా ఈ బ్యూటీ మాత్రం ఆశించిన స్థాయిలో బ్రేక్ ఇవ్వలేకపోయింది. త్వరలోనే అనిల్ రావిపూడి దర్శకత్వంలో వెంకటేశ్ హీరోగా రాబోతున్న సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో ప్రేక్షకులకు హాయ్ చెప్పనుంది. ఈ సినిమా జనవరి 14న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ప్రమోషనల్ ఇంటర్వ్యూలో మీనాక్షి చౌదరి తన లైఫ్‌లో ఎదుర్కొన్న కష్టతరమైన విషయాన్ని ఒకటి షేర్ చేసుకుంది. విజయ్‌తో కలిసి నటించిన ది గోట్ సినిమా విడుదలయ్యాక నా నటనపై ఆన్‌లైన్‌లో చాలా ట్రోల్స్ వచ్చాయి. ఈ ట్రోల్స్‌తో వారంపాటు నేను డిప్రెషన్‌లోకి వెళ్లేలా చేశాయంటూ చెప్పుకొచ్చింది మీనాక్షి చౌదరి. ఇప్పుడీ కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి.మీనాక్షి చౌదరి మరోవైపు జాతిరత్నాలు హీరో నవీన్ పొలిశెట్టితో కలిసి అనగనగా ఒక రాజు సినిమాలో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఇటీవలే ఈ మూవీ నుంచి విడుదల చేసిన వెడ్డింగ్ వీడియో నెట్టింట వైరల్ అవుతోంది.

## అతను నన్ను లైంగికంగా వేధిస్తున్నాడు
### బాలకృష్ణ హీరోయిన్ సంచలన కామెంట్స్



ప్రతి ఇండస్ట్రీల్లోనూ మహిళలకు వేధింపులు తప్పడం లేదు. పని చేసే ప్రతిచోట అమ్మాయిలు అభద్రతా భావంతో ఉన్నారని ఇటీవల ఓ సర్వేలో తేలింది. ఇక సినిమా ఇండస్ట్రీలో లైంగిక వేధింపుల గురించి కొత్తగా చెప్పాల్సిన పనిలేదు. ఇండస్ట్రీలో కాస్టింగ్ కౌచ్ ఉందని చాలామంది బహిరంగంగానే వెల్లడించారు. తమకు ఎదురైన లైంగిక వేధింపులు ,కాస్టింగ్ కౌచ్, కమిట్మెంట్‌ల గురించి హీరోయిన్లు, క్యారెక్టర్ ఆర్టిస్టులు ఇటీవల పలు సందర్భాల్లో వెల్లడిస్తున్నారు. తాజాగా స్టార్ హీరోయిన్ హనీరోజ్ లైంగిక వేధింపులకు గురయ్యారనే వార్త హాట్ టాపిక్‌గా మారింది. హనీరోజ్ తనకు ఎదురైన లైంగిక వేధింపుల గురించి తన సోషల్ మీడియాలో ఓ పోస్ట్‌ను షేర్ చేసింది. గతంలో తాను ఓ ప్రైవేట్ ఈవెంట్‌కు హాజరయ్యానని, ఆ ఈవెంట్ నిర్వహించిన వ్యక్తి అప్పటి నన్ను వేధిస్తున్నాడని చెప్పుకొచ్చింది. నేను ఎక్కడికి వెళ్తే అక్కడకు వస్తూ తనని టార్చర్ చేస్తున్నాడని హనీరోజ్ తెలిపింది.సోషల్ మీడియాలో నా పరువుకు భంగం కలిగేలా ప్రవర్తిస్తున్నాడు. బిజినెస్ మేన్ కావడంతో, చట్టపరంగానే అతనిపై పోరాటం చేస్తానని హనీరోజ్ పేర్కొంది. భారత న్యాయవ్యవస్థలో ఆడవారికి ప్రత్యేక రక్షణ కల్పిస్తే బాగుండు, 20 ఏళ్లుగా పరిశ్రమలో ఉంటున్న తాను ఆ బిజినెస్ మేన్ వేధింపులను ఎందుకు భరించాలి అని హనీరోజ్ ప్రశ్నించింది. మరోవైపు హనీ రోజ్‌ను అసభ్యకరంగా మాట్లాడుతూ సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఓ వ్యక్తిని తిరువనంతపురం పోలీసులు అరెస్ట్ చేశారు.

## విశాల్ హెల్త్ పుకార్లు... అసలు విషయం ఏంటంటే!



కెరీర్ ఆరంభంలో ఏడాదికి మూడు అంతకంటే ఎక్కువ సినిమాలు చేసిన విశాల్ ఆ తర్వాత ఏడాది రెండు సినిమాలు చొప్పున చేసుకుంటూ వచ్చాడు. కానీ గడచిన రెండేళ్లుగా ఆయన నుంచి పెద్దగా సినిమాలు రావడం లేదు. 2023లో మార్క్ ఆంటోనీ విడుదల కాగా, 2024లో రత్నం సినిమా వచ్చింది. ఈ ఏడాది ఆయన నుంచి సినిమా ఉంటుందా అనే అనుమానాలు ఉన్న సమయంలో ఎప్పుడో 12 ఏళ్ల క్రితం ఆగిపోయిన సినిమా అయిన మధగజ రాజా ను విడుదల చేయబోతున్నారు. ఇది కాకుండా మరో సినిమా ఈ ఏడాదిలో ఆయన నుంచి వస్తుందా అంటే స్పష్టత లేదు. ఒక సినిమా సెట్స్ పై ఉన్నా ఎప్పుడు ఆ సినిమా వచ్చేది ఇప్పటి వరకు క్లారిటీ ఇవ్వడం లేదు. విశాల్ ఎందుకు స్లో అయ్యారు, భారీ సినిమాలు ఏమైనా చేస్తున్నారా అంటే లేదు. అయినా ఎందుకు ఆయన నుంచి సినిమాలు రావడం లేదు అంటూ అభిమానులు ఆందోళన చెందుతున్నారు. ఇలాంటి సమయంలో ఆయన మధగజ రాజా సినిమా ప్రమోషన్ వేడుకలో పాల్గొన్న సమయంలో చాలా సన్నబడి, మాట్లాడానికి, నిలబడ్డానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో విశాల్ ఆరోగ్యం గురించి పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ముఖ్యంగా తమిళ మీడియాలో విశాల్ ఆరోగ్యం గురించి ఎవరికి ఇష్టం వచ్చినట్లు వారు కథనాలు రాస్తున్నారు. ఆయన తీవ్ర అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు, షూటింగ్‌లో పాల్గొనడానికి ఆరోగ్యం సహకరించడం లేదు అంటూ ఎవరికి తోచిన విధంగా వారు మాట్లాడుకుంటూ ఉన్నారు.

## స్వదేశంలో ఐర్లాండ్‌తో వన్డే సిరీస్.. జట్టును ప్రకటించిన బీసీసీఐ..!




**ఐర్లాండ్-నవభూమి:** ఐర్లాండ్‌తో స్వదేశంలో జరిగే వన్డే సిరీస్‌కు టీమిండియా వుమెన్స్ జట్టును బీసీసీఐ ప్రకటించింది. మూడు వన్డేల సిరీస్‌లో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, ఫాస్ట్ బౌలర్ రేణుకా సింగ్ ఠాకూర్‌కు విశ్రాంతి ఇచ్చింది. జనవరి 10 నుంచి రాజ్‌కోట్‌లో వేదికగా జరుగనున్న వన్డే సిరీస్‌కు బీసీసీఐ సోమవారం 15 మంది సభ్యులతో కూడిన జట్టును ప్రకటించింది. ఓపెనర్ స్మృతి మంధాన కెప్టెన్‌గా వ్యవహరించనున్నది. హర్మన్‌ప్రీత్ గాయం కారణంగా వెస్టిండ్‌తో జరిగిన తొలి రెండు టీ20ల్లో ఆడలేకపోయింది. మూడు టీ20లోకి అందుబాటులోకి వచ్చింది. ఆ తర్వాత మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లోనూ ఆడింది.గతేడాది అక్టోబర్‌లో దుబాయి వేదికగా జరిగిన మహిళల టీ20 ప్రపంచకప్‌లో పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో గాయపడింది. ఇక వెస్టిండీస్‌తో జరిగిన మూడు మ్యాచుల్లో పది వికెట్లు పడగొట్టిన ఫాస్ట్ బౌలర్ రేణుక ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచింది. రేణుక వెన్నుముకపై ఒత్తిడి, పగులుతో ఇబ్బందిపడుతున్నది. ఈ క్రమంలో ఐర్లాండ్ సిరీస్ ఇద్దరు ప్లేయర్లకు బీసీసీఐ విశ్రాంతి ఇచ్చింది. రేణుక గైర్హాజరీలో సయాలీ సత్‌ఘరే, సైమా ఠాకూర్ బౌలింగ్ బాధ్యతలను మోయనున్నారు. ఇక మూడు వన్డేలు ఐర్లాండ్‌తో రాజ్‌కోట్ వేదికగా జరుగుతాయి. అన్ని మ్యాచులు ఉదయం 11 గంటలకు మొదలవుతాయి. తొలి వన్డే 10న, రెండో వన్డే 12న, మూడో వన్డే 15న జరుగుతుంది.

**ఐర్లాండ్‌తో వన్డే సిరీస్‌కు భారత జట్టు..**

స్మృతి మంధాన (కెప్టెన్), దీప్తి శర్మ (వైస్ కెప్టెన్), ప్రతీకా రావల్, హర్లీన్ డియోల్, జెమీమా రోడ్రిగ్స్, ఉమా ఛెత్రి (వికెట్ కీపర్), రిచా ఘోష్ (వికెట్ కీపర్), తేజల్ హసబ్నిస్, రాఘవి బిస్త్, మిన్ను మణి, ప్రియా మిశ్రా, తనూజా కన్వర్, టిటాస్ సాధు, సైమా ఠాకోర్, సయాలీ సత్‌ఘరే.


## టెస్టు క్రికెట్‌కు కొత్త రూపు.. రెండు డివిజిన్లుగా పోటీ.. ప్లాన్ చేస్తున్న టాప్



**న్యూఢిల్లీ-నవభూమి:** టెస్టు క్రికెట్‌కు మరింత వన్నె తెచ్చేందుకు .. మూడు క్రికెట్ బోర్డులు పెద్ద ప్లాన్ వేశాయి. ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, ఇండియా క్రికెట్ బోర్డులు.. టెస్టు క్రికెట్ మ్యాచ్‌లను రెండు విభాగాలుగా నిర్వహించేందుకు ప్రణాళిక చేపట్టినట్లు తెలుస్తోంది. అంతర్జాతీయ క్రికెట్ మండలి కూడా ఈ ప్లాన్ అమలుకు రెఢీ ఉన్నట్లు తెలుస్తోంది. టెస్టులు ఆడే ఏడు జట్లు టాప్ డివిజన్‌లో, మరో అయిదు జట్లు సెకండ్ ర్యాంక్ డివిజన్‌లో పోటీ పడే రీతిలో ప్రణాళిక తయారు చేస్తున్నారు. అయితే ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, ఇండియా మధ్య మాత్రం ఎక్కువ టెస్టు మ్యాచ్‌లు ఉండే తరహాలో ప్లాన్ చేస్తున్నారు.

ఇటీవల విజయవంతంగా ముగిసిన బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ తరహాలో.. ద్వైపాక్షిక టెస్టు సిరీస్‌ల సంఖ్యను పెంచాలనుకుంటున్నారు. ఐసీసీ చైర్మెన్ జేషా, క్రికెట్ ఆస్ట్రేలియా చైర్మెన్ మైక్ బెయిర్డ్, ఈసీబీ చైర్మెన్ రిచర్డ్ థాంప్సన్ దీనిపై చర్చించనున్నారు. ఈనెల 12వ తేదీన ముంబైలో జరిగే మీటింగ్‌లో దీనిపై క్లారిటీ వచ్చే అవకాశం ఉన్నది. అయితే రెండు డివిజన్లుగా పోటీ పడే టెస్టు మ్యాచ్‌లను 2027 తర్వాతే నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి టూ టైర్ కాన్సెప్ట్‌ను తొలుత ఇండియన్ బోర్డు వ్యతిరేకించింది.

## ఇంగ్లండ్‌తో జరిగే టీ20, వన్డే సిరీస్‌కు బుమ్రా దూరం !



**సిడ్నీ-నవభూమి:** భారత స్పీడ్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా గాయపడ్డ విషయం తెలిసిందే. సిడ్నీ టెస్టు రెండో రోజు అతను వెన్ను నొప్పితో బాధపడ్డాడు. డాక్టర్లు అతనికి స్కానింగ్ కూడా చేశారు. బోర్డర్ - గవాస్కర్ సిరీస్‌ను 3-1 తేడాతో ఇండియా చేజార్చుకున్న విషయం తెలిసిందే. ఆ సిరీస్‌లో బుమ్రా 32 వికెట్లు తీసి ప్లేయర్ ఆఫ్ ద సిరీస్ అవార్డును కూడా గెలుచుకున్నాడు. కానీ త్వరలో ఇంగ్లండ్‌తో ప్రారంభంకానున్న స్వదేశీ సిరీస్‌లో బుమ్రా ఆడేది డౌట్‌గా ఉన్నది. ఆస్ట్రేలియాతో జరిగిన అయిదు టెస్టుల సిరీస్‌లో అతను సుమారు 150 ఓవర్లకు పైగా బౌలింగ్ చేశాడు. దీంతో అతనికి వెన్ను పట్టేసింది. ఆ కారణంతోనే అతను సిడ్నీ టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో బౌలింగ్ చేయలేకపోయాడు. వర్క్‌లోడ్ పెరగడం వల్ల వత్తిడికి గురైన బుమ్రాకు రెస్ట్ ఇవ్వాలని బీసీసీఐ మెడికల్ బృందం భావిస్తున్నది. నిజానికి బుమ్రా వెన్ను నొప్పి ఏ స్థాయిలో ఉందన్న విషయం ఇంకా తెలియదు. కానీ ఫిబ్రవరిలో ప్రారంభం అయ్యే ఛాంపియన్స్ ట్రోఫీకి అందుబాటులో ఉండే రీతిలో బుమ్రాను తీర్చిదిద్దాలని బీసీసీఐ భావిస్తున్నది. ఆ కారణంగానే అతనికి రెస్ట్ ఇవ్వాలని ఆలోచిస్తున్నారు.ఒకవేళ బుమ్రాకు గ్రేడ్ వన్ క్యాటగిరీ గాయమైతే, అతను కనీసం రెండు లేదా మూడు వారాల పాటు చికిత్స తీసుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ గ్రేడ్ 2 గాయమైతే, అతను కోలుకునేందుకు ఆరు వారాలు పట్టవచ్చు. ఒకవేళ గ్రేడ్ 3 అయితే అప్పుడు కనీసం మూడు నెలల రెస్టు తీసుకోవాల్సి ఉంటుంది.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**